www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 17-8-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 162 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా.7:25 తదుపరి దశమి, నక్షత్రం: రోహిణి తె. 3:18 తదుపరి మృగశిర, వర్జ్యం: రా.7.45-9.15, దుర్ముహూర్తం: సా.4:55-5:45 అమృతఘడియలు: రా.12:16-1:47, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:36 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శ్రీసత్యసాయి జిల్లా అమ్మవారిపల్లిలోని కియ కార్ల పరిశ్రమ

కియతో కళకళ

సత్యసాయి జిల్లాలో వేల కుటుంబాల్లో వెలుగులు

- రోజురోజుకూ విస్తరిస్తున్న అనుబంధ పరిశ్రమలు
- జాతీయ రహదారి పక్కన 20 కి.మీ. పరిధిలో
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి పైగా ఉపాధి
- ఉమ్మడి అనంత జిల్లా, ఇతర రాష్ట్రాల వారికీ అవకాశాలు
- ఒకప్పటి కొండగుట్టలపై ఇప్పుడు ఖరీదైన విల్లాలు
- రూ.లక్ష పలికిన ఎకరా.. ఇప్పుడు కోటిన్నర పైనే
- నగరాలను తలపించేలా రెస్టారెంట్లు, విల్లాలు, దుకాణాలు

3

చదువు వారికి సాహసమే!

అడవిలో ఆరు కిలోమీటర్లు నడిచి బడికి..

- సర్పాలు, జంతువుల భయం మధ్యే నడక
- ఊళ్లో బడి లేకపోవడంతో రోజూ పోరుగూరుకు
- వర్షాకాలంలో వెళ్లిరావడానికి అవస్థలు
- బిల్డింగ్ కట్టి పాఠశాలను మరిచిన వైసీపీ
- 40 ఏళ్లుగా బడి కోసం ఎదురుచూస్తున్న పల్నాడు జిల్లా రామాంజనేయపురం
- న్యాయం చేయాలని లోకేశ్‌కు విన్నపం

12



రామాంజనేయపురం నుంచి మన్నె సుల్తాన్ పాలెంలోని బడికి నడిచి వెళ్తున్న విద్యార్థులు



తిరుమలలో రింగురోడ్డు వరకు బారులుతీరిన భక్తులు

తిరుమల కిటకిట

13

- వరుస సెలవులతో పోటెత్తిన భక్తులు.. 3 కిలోమీటర్ల మేర క్యూలైన్
- సాయంత్రానికి క్యూలైన్ల మూసివేత.. సర్వదర్శనానికి 24 గంటల సమయం
- గదుల కోసం 6 గంటలకు పైగా నిరీక్షణ.. కల్యాణకట్టలు, అన్నప్రసాద కేంద్రాల్లో రద్దీ

అనంతపురం ఆర్టీసీ బస్టాండులో బస్సుల ముందు గుర్తింపు కార్డులు చేతబట్టుకొని విద్యార్థినుల సెల్ఫీ



ఫ్రీ బస్.. సూపర్ సక్సెస్

ఆడపడుచుల ప్రయాణ సంబరం

- అన్నిరూట్లలో భలే స్పందన
- నిండుగా కనిపించిన బస్సులు
- పూర్తి ఆక్యుపెన్సీతో రైట్.. రైట్
- జీరో టికెట్‌తో మహిళల్లో రిలీఫ్
- తగ్గిన ఖర్చుల్ని లెక్కేసుకుంటూ ఉత్సాహంగా గమ్యస్థానాలకు..
- అన్నిచోట్లా మహిళలదే పైచేయి
- రాజమహేంద్రిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఫ్రీ బస్ సూపర్‌హిట్ కొట్టింది. ప్రయాణ ఖర్చులు...ఆటోలకు పెట్టే డబ్బులు.. రోజంతా కష్టపడితే వచ్చే డబ్బుల్లో రాకపోకలకు పెట్టాల్సిన వ్యయాలను బేరీజు వేసుకున్న ఆడపడుచుల కళ్ల నిండా కాంతులు! వదనాల్లో సంతృప్తి! అన్ని రూట్లలోనూ రైట్.. రైట్.. అంటూ మహిళలే సందడి చేశారు. బస్సుల్లో సాధారణంగా 'టికెట్ ప్లీజ్' అంటూ విజ్ఞప్తిచేసే కండక్టర్లు 'టికెట్ ఫ్రీ' అంటూ ప్రతి మహిళకూ

మిగతా 13వ పేజీలో...

తొలి 30 గంటల్లో

- రూ.5 కోట్ల విలువైన జీరో టికెట్లు జారీ
- 12 లక్షల మంది మహిళలు, బాలికల ప్రయాణం
- 'స్త్రీ శక్తి'ని సమీక్షించిన సీఎం
- ఘాట్ రోడ్లలోనూ అనుమతించాలని ఆదేశం

అంబాజీపేట టు విజయవాడ.. ఆ కుటుంబానికి రూ.1,160 లబ్ధి

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట నుంచి విజయవాడకు 170 కిలోమీటర్లు. ఒక కుటుంబంలోని ముగ్గురు మహిళలు, ఇద్దరు బాలికలు ఫ్రీ బస్సులో ఇంత దూరం ప్రయాణించి విజయవాడ చేరుకున్నారు. ఈ ఒక్క ప్రయాణంలోనే తమకు రూ.1,160 లబ్ధి చేకూరిందని ఆ కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

– అంబాజీపేట, ఆంధ్రజ్యోతి



పులివెందుల పులి.. పిల్లి శాపనార్థాలు!



మనం విత్తే విత్తును బట్టే ఆ చెట్టు కాయలు ఉంటాయని జగన్ రెడ్డి ఇటీవల తరచుగా చెబుతున్నట్టుగానే అధికారంలో ఉన్నప్పుడు ఆయనగారు చేసిన అరాచకాలు ఇప్పుడు కర్మ రూపంలో ఎదురొస్తున్నాయి. కర్మ ఫలాన్ని అనుభవించాల్సిందే.

'పులి బిడ్డ', 'పులివెందుల పులి' అని కీర్తించబడుతున్న జగన్ రెడ్డి పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? తాను మాత్రం ఉట్టి కట్టుకొని నూరేళ్లపాటు ఊరేగుతానని, 75 ఏళ్ల వయసుకు చేరుకున్న చంద్రబాబు పరిస్థితి ఇవాళో రేపో అన్నట్టుగా ఉందని వాగడం ఏమిటి? ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా వచ్చే నెలతో 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను కూడా ఇవాళో రేపో అని అనగలవా?

తన హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల సందర్భంగా జగన్ రెడ్డి అన్ని హద్దులూ దాటారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన వాళ్లను నామినేషన్లు కూడా వేయనీయలేదు. తిరుపతి పార్లమెంటు స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా తిరుపతి పట్టణంలో విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేయించుకోలేదా? అప్పుడు అదంతా న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా జరిగిందని చెప్పుకొన్నారు కదా?

నిజానికి పులివెందులలో వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబానికి బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో ప్రజలలో మద్దతు లేదు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ విషయం రుజువైంది.

తన పట్ల ప్రజల్లో విముఖత ఏర్పడుతోందని జగన్ రెడ్డి గుర్తించలేకపోయారు. సొంత బాబాయిని హత్య చేసిన, చేయించిన వాళ్లకు వత్తాసు పలుకుతూ, తల్లినీ చెల్లినీ దూరం చేసుకున్న జగన్ రెడ్డి నిజ స్వరూపాన్ని పులివెందుల ప్రజలు కూడా గుర్తించారు.

రాహుల్ గాంధీ ఏపీ గురించి మాట్లాడలేదని, రాహుల్-చంద్రబాబు- రేవంత్ రెడ్డి ముగ్గురూ హాట్ లైన్‌లో ఉంటారని పొంతన లేని వ్యాఖ్యలు చేసి జగన్ నవ్వులపాలయ్యారు. మోదీ దయ కోసం పరితపిస్తున్న బేలతనంతో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలయ్యారు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



అమెరికాలోని అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలుకుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

సుంకాల సంకెళ్లు

తప్పినట్టే!

ట్రంప్, పుతిన్ భేటీ నేపథ్యంలో భారత్‌కు ఉపశమనం

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం నిలిపివేత దిశగా పరిణామాలు

- 25% అదనపు సుంకాల అమలు నిలిచిపోయే అవకాశం!
- రెండో విడత సుంకాలు ప్రస్తుతానికి అవసరం లేదు
- పుతిన్‌తో భేటీ సానుకూలం.. భూభాగాల అప్పగింతపై చర్చ
- శాంతి ఒప్పందానికి జెలెన్‌స్కీ ముందుకు రావాలి: ట్రంప్
- అమెరికా, యూరప్ మా భద్రతకు హామీ ఇవ్వాలి: జెలెన్‌స్కీ
- సోమవారం వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ చర్చలు
- కొన్ని భూభాగాల్ని రష్యాకు అప్పగించడమే పరిష్కారం!
- తొలి నుంచి పుతిన్ డిమాండ్ ఇదే.. ఆ దిశగానే సంధి!

వాషింగ్టన్, న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడుతున్నాయా? యుద్ధానికి మూల కారణాల్లో ఒకటైన భూభాగాల అప్పగింత ఓ కొలిక్కి వస్తుందా? అలాస్కాలో చర్చలు సఫలమయ్యాయని ట్రంప్, పుతిన్ ఇద్దరూ గట్టిగా చెప్పడం, ఇక అంతా ఉక్రెయిన్, యూరప్ దేశాల చేతిలోనే ఉందని ట్రంప్ ప్రకటించడం ఇందుకు సంకేతమేనా? యుద్ధం ముగింపునకు వస్తే రష్యాపై ఆంక్షలు తొలగుతాయా? ఆ ఆంక్షల వల్ల అమెరికా సుంకాల మోతబారినపడిన భారత్‌కు ఉపశమనం లభిస్తుందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ ట్రంప్, పుతిన్ భేటీ తర్వాతి

మిగతా 2వ పేజీలో...



2

ఆ అధికారం కోర్టులకు లేదు

- బిల్లుల్ని ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు పెట్టలేదు
- అలా చేస్తే రాజ్యాంగపరమైన గందరగోళం
- సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పిన కేంద్ర సర్కారు

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై కసరత్తు ముమ్మరం

- నేడు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ
- అభ్యర్థిని నిర్ణయించే అవకాశం!
- రేసులో ప్రధానంగా రాజ్‌నాథ్ సింగ్ పేరు
- సెప్టెంబరు 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక

2

ఓట్ చోరీపై తాడో పేడో!

- బిహార్‌లో నేటి నుంచి రాహుల్ 'ఓట్ అధికార్ యాత్ర'
- 20 జిల్లాల్లో 16 రోజులు
- పెద్ద ఎత్తున పాల్గొననున్న ఇండియా కూటమి పార్టీలు
- ఇది ఎస్ఐఆర్‌పై యుద్ధం
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో మైలురాయి: కాంగ్రెస్



పట్నా, ఆగస్టు 16: 'ఓట్ చోరీ'పై తాడో పేడో తేల్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమస్థాయిలో విజృంభించేందుకు సిద్ధమైంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరిట 65 లక్షల ఓట్లను తొలగించడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. దీనిని మరింత తీవ్రతరం

మిగతా 2వ పేజీలో...

ఢిల్లీలో నేడు ఈసీ విలేకరుల సమావేశం

ఎస్ఐఆర్, ఓట్ చోరీలపై వివరణ ఇచ్చే అవకాశం

2



పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు కంబోడియా నకిలీ యాప్ ద్వారా వల వేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహప్ప నుంచి ఏకంగా 1.73 కోట్లు లాగేశారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్ ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు ప్రత్యేక బృందాలను పంపారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 41.20 లక్షలు రికవరీ చేశారు. ఏపీలో సైబర్ నేరగాళ్ల నుంచి రికవరీ చేసిన మొత్తంలో ఇదే అత్యధికం.

సైబర్ నేరగాళ్ల నుంచి రికవరీ చేసిన సొమ్ముతో అనంతపురం ఎస్పీ జగదీశ్ (ఫైల్)


సైబర్ నేరగాళ్లకు సవాల్

రికవరీలో ఏపీ పోలీసుల సత్తా.. ఆధునిక సాంకేతికతో గుర్తింపు

- నేరగాళ్ల అరెస్ట్.. సొమ్ము స్వాధీనం
- రికార్డు స్థాయిలో అనంతపురం పోలీసులు రూ. 40 లక్షల రికవరీ
- విజయనగరంలో రిటైర్డ్ టీచర్ సొమ్ము 20 లక్షలు స్వాధీనం
- బాపట్ల పోలీసులూ లక్షల్లో రికవరీ
- రాష్ట్రాలు దాటి నిందితుల అరెస్ట్
- గంటలోపు ఫిర్యాదు చేస్తే 90 శాతం రికవరీకి అవకాశం
- కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1930

ఆంధ్రజ్యోతి పరిశీలన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడం, డబ్బు రికవరీ చేయడంలో ఏపీ పోలీసులు సత్తా చాటుతున్నారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త మోసాలకు పాల్పడుతుండగా... పోలీసులూ ఎప్పటికప్పుడు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ వారిని కట్టడి చేస్తున్నారు. ఇటీవల ప్రధానంగా అనంతపురం, బాపట్ల, విజయనగరం ప్రాంతాల్లో చేసిన రికవరీలు.. విజయవాడ, విశాఖపట్నంలో ఛేదించిన కొత్తరకం సైబర్ కేసులు బాధితుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. నకిలీ యాప్‌తో కంబోడియా నుంచి వల వేసి ఢిల్లీ కేంద్రంగా మ్యూల్ ఖాతాలు తెరిచి దొరికిన వారిని దొరికినట్లు దోచుకొంటున్న ముఠాను అనంతపురం పోలీసులు నెల రోజుల పాటు శ్రమించి ఆటకట్టించారు. తక్కువ పెట్టుబడితో

మిగతా 13వ పేజీలో...

కరువు తీరింది!

ఖరీఫ్ సాగు పుంజుకుంది



- వరుస అల్పపీడనాలతో దంచుతున్న వానలు
- 24 నుంచి 8.6 శాతానికి తగ్గిన వాన లోటు
- సీమలో మెరుగైన వర్షపాతం.. కోస్తాలో జోరుగా వరి నాట్లు

14

రేపు మరో అల్పపీడనం

24న మరొకటి ఏర్పడే అవకాశం

- కోస్తా, సీమకు మళ్లీ భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఉత్తర కోస్తా రేవుల్లో మూడో నంబరు హెచ్చరిక
- మత్స్యకారులు సంద్రంలో వేటకు వెళ్లొద్దని సూచన

ధర్మవరం వాసికి 'ఉగ్ర' లింకులు!

14

- ఎన్ఐఏ సమాచారంతో పోలీసులు అప్రమత్తం
- నూర్ మహమ్మద్‌పై నిఘా.. 'ఉపా' కేసు.. అరెస్ట్
- నిషేధిత సంస్థలతో నిందితుడికి సంబంధాలు


దేశ విభజన దోషులు వీళ్లే!

- జిన్నా డిమాండ్‌కు కాంగ్రెస్ ఓకే.. మౌంట్ బాటన్ అమలు
- విభజన వల్లే కశ్మీర్ సమస్య.. ప్రత్యేక మాడ్యూల్లో ఎన్సీఈఆర్టీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఎన్సీఈఆర్టీ మరోసారి వార్తల్లో నిలిచింది. దేశ విభజనపై పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ విద్యార్థుల కోసం తాజాగా ఒక ప్రత్యేక మాడ్యూల్‌ను విడుదల చేసింది. 'విభజన భయానక కాల స్మారక దినం'ను పురస్కరించుకొని విడుదల చేసిన దానిలో.. భారతదేశ విభజనకు మహ్మద్ అలీ జిన్నా ఒక్కరే కారణం కాదని, ఆయన డిమాండ్‌ను ఆమోదించిన కాంగ్రెస్, అమలు చేసిన అప్పటి వైస్రాయి లార్డ్ మౌంట్‌బాటన్‌లు కూడా అని పేర్కొంది. 'విభజన దోషులు' అనే సెక్షన్‌లో ఈ ప్రస్తావన చేసింది. విభజన తర్వాత భారత్‌కు కశ్మీర్ ఒక కొత్త సమస్యగా మారిందని, దేశ విదేశాంగ విధానానికి సవాల్ సృష్టించిందని పేర్కొంది. ఎన్సీఈఆర్టీ మాడ్యూల్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరును కూడా ప్రస్తావించింది. భారత్‌లో అంతర్యుద్ధం కంటే దేశాన్ని విభజించడం మంచిదని ఆయన అభిప్రాయపడినట్లు పేర్కొంది. మహాత్మా గాంధీ వైఖరి గురించి చెప్తూ.. విభజనను ఆయన వ్యతిరేకించారని, కానీ హింస ద్వారా కాంగ్రెస్ నిర్ణయాన్ని ఆపలేనని గాంధీ చెప్పినట్లు మాడ్యూల్‌లో పేర్కొన్నారు. దేశ విభజనపై 6-8 తరగతులు (మిడిల్ స్టేజ్), 9-12 తరగతుల (సెకండరీ స్టేజ్) విద్యార్థుల కోసం రెండు వేర్వేరు మాడ్యూల్స్‌ను ప్రచురించింది. ఈ మాడ్యూళ్లపై రాజకీయ దుమారం రేగింది. పుస్తకంలో పేర్కొన్న అంశాలను కాంగ్రెస్ నేత పవన్ ఖేరా తిప్పికొట్టారు. హిందూ మహాసభ, ముస్లిం లీగ్ మధ్య సహకారం వల్లే భారత్, పాక్ విభజన జరిగిందని, ఇదీ వాస్తవమని అన్నారు. 'చరిత్రలో అతిపెద్ద విలన్ అంటే అది ఆరెస్సెస్. ఆ సమయంలో 25 ఏళ్ల గూఢచర్యం పాత్ర పోషించిన ఆ సంస్థను భవిష్యత్తు తరాలు క్షమించవు. ఆ గూఢచర్యంలో ముస్లింలు, జిన్నాతో భాగస్వామ్యం ఉంది' అని ఆరోపించారు. 'ఈ అంశాలన్నింటినీ ప్రస్తావించకపోతే.. ఆ పుస్తకాన్ని తగలబెట్టండి' అని ఆయన అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా మాట్లాడుతూ తనకు అనుకూలంగా లేనప్పుడు చరిత్ర నుంచి కాంగ్రెస్ పారిపోతుందన్నారు.

కంపెనీలో వాటాను 14వేల కోట్లకు అమ్మి రూ.13వేల కోట్లు దానమిచ్చేశాడు

- యాప్‌నెక్సస్ సంస్థ మాజీ సీఈవో బ్రియాన్ దాతృత్వం



న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఎవరైనా తాము సంపాదించిన దాంట్లో పదో.. పరకో.. దానం చేస్తారు. కానీ, ఓ కంపెనీ మాజీ సీఈవో కంపెనీలో తనకున్న వాటాను రూ.14వేల కోట్లకు(1.6బిలియన్ డాలర్లు) అమ్మేసి అందులో రూ.13వేల కోట్లను దానం చేసేశారు. అడ్వర్టైజింగ్ టెక్నాలజీ కంపెనీ యాప్‌నెక్సస్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో బ్రియాన్ కెల్లీ ఈ ఘనత వహించారు. తాజాగా ఫార్చ్యూన్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. యాప్‌నెక్సస్ కంపెనీలో బ్రియాన్‌కు 10% వాటా ఉండేది. 2018లో ఆయన దాన్ని 'ఏటీ అండ్ టీ' సంస్థకు విక్రయించారు. దీంతో ఆయనకు రూ.14వేల కోట్లు(1.6బిలియన్ డాలర్లు) వచ్చాయి. ఇందులో దాదాపు 900కోట్లను(100మిలియన్ డాలర్లు) తమ కుటుంబం కోసం ఉంచుకొని మిగతా 13వేల కోట్లను విరాళంగా ఇచ్చేశారు. "బిలియనీర్‌గా ఉండటంపై, బిలియనీర్ లైఫ్‌స్టైల్ పైన నాకు ఆసక్తి లేదు. ఈ విషయం నా భార్యతో చర్చించా. భవిష్యత్తు అవసరాల కోసం 100 మిలియన్ డాలర్లు చాలని మేమిద్దరం నిర్ణయించుకున్నాం" అని ఆయన తెలిపారు.

'సిందూర్'లో 13 మంది పాక్ సైనికులు హతం

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఆపరేషన్ సిందూర్ వల్ల 13 మంది సైనిక అధికారులు సహా మొత్తం 50కిపైగా ప్రాణాలను కోల్పోయినట్టు పాకిస్థాన్ ఎట్టకేలకు అంగీకరించింది. పాక్ అధికార వర్గాలు శనివారం ఒక ఆంగ్ల టీవీ చానల్‌కు ఈ విషయాన్ని నిర్ధారించాయి. ఆపరేషన్ సిందూర్ కారణంగా తమకు భారీగా ప్రాణ నష్టం జరిగినట్టు మూడు నెలల తర్వాత ఇప్పుడు పాకిస్థాన్ అంగీకరించింది. భోలారీ వైమానిక స్థావరంపై భారత దాడిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్ మరణించిన విషయాన్ని అతనికి మరణానంతరం ప్రెసిడెన్సీ అవార్డును ప్రదానం చేయడం ద్వారా పాకిస్థాన్ తాజాగా నిర్ధారించింది.

రోబోకు అమ్మతనం!

- బిడ్డను గర్భంలో మోసి జన్మనిచ్చే హ్యుమనాయిడ్ రోబోలను అభివృద్ధి చేస్తున్న చైనా

ఏఐ చిత్రం



హైదరాబాద్, ఆగస్టు 16: రజనీకాంత్ నటించిన రోబో సినిమా గుర్తుందా ? సనా(ఐశ్వర్యరాయ్)ను పెళ్లిపీటల మీద నుంచి ఎత్తుకొచ్చిన చిట్టి(రోబో).. తాను అభివృద్ధి చేసిన కృత్రిమ జీవకణాన్ని సనా గర్భంలో ప్రవేశపెడతానంటాడు. మనిషికి, యంత్రానికి పుట్టిన తొలి బిడ్డకు జన్మనిద్దామని సనాకు చెబుతాడు. ఇన్నాళ్లూ సినిమాకే పరిమితమైన ఈ మాటలను కృత్రిమ మేధ(ఏఐ) నిజం చేయబోతుంది. అవును.. మనిషికి రోబోకు పుట్టిన సంతానాన్ని చూసే రోజులు రాబోతున్నాయి. చిట్టి చెప్పినట్టు కాదు కానీ.. గర్భం దాల్చి నవ మాసాలు బిడ్డను మోసి జన్మనిచ్చే హ్యుమనాయిడ్ రోబోలను చైనా శాస్త్రవేత్తలు తయారు చేస్తున్నారు. రోబోలకు అమ్మతనాన్ని ఇచ్చేలా సింగపూర్‌లోని నాన్‌యాంగ్ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ జాంగ్ కీఫెంగ్ నేతృత్వంలోని బృందం ప్రపంచంలోనే తొలిసారిగా 'ప్రెగ్నెన్సీ రోబో'ను అభివృద్ధి చేస్తోంది. చైనా మీడియా కథనాల ప్రకారం.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంక్యుబేటర్లకు ప్రెగ్నెన్సీ రోబోలకు ఏమాత్రం సంబంధం లేదు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కృత్రిమంగా అభివృద్ధి చేసిన గర్భసంచి ఈ ప్రెగ్నెన్సీ రోబోల్లో ఉంటుంది. ఆర్టిఫిషియల్ అమ్నియోటిక్ ద్రవాలతో నిండి ఉండే ఈ కృత్రిమ గర్భసంచి అచ్చం మానవ గర్భసంచిలానే పని చేస్తుంది. నిజజీవితంలో గర్భధారణ నుంచి ప్రసవం వరకు జరిగే ప్రక్రియ అంతా ప్రెగ్నెన్సీ రోబో గర్భంలో అలానే జరుగుతుంది. ప్రెగ్నెన్సీ రోబోల ప్రోటోటైప్ వచ్చే ఏడాదికి సిద్ధమవుతుందని, ఇందుకు రూ.12.96 లక్షల వరకు వ్యయం అవుతుందని జాంగ్ పేర్కొన్నారు.

భార్యాభర్తల మధ్య 'ఫోన్' చిచ్చు!

- గుంటూరులో ఇద్దరు బిడ్డల్ని చంపి.. తండ్రి ఆత్మహత్య

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో దారుణం జరిగింది. భార్యతో గొడవ నేపథ్యంలో ముక్కుపచ్చలారని తన ఇద్దరు బిడ్డలకూ విషమిచ్చి చంపిన తండ్రి.. ఆపై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నూరు రోడ్డులోని సాయిబాబా కాలనీ మెయిన్ రోడ్డులో శనివారం సాయంత్రం ఈ ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేటకు చెందిన షేక్ యూసుబ్(28)కు సైదాబీకి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అతడు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం భార్య సైదాబీ ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతుండడాన్ని యూసుబ్ గమనించాడు. ఈ విషయమై వారి మధ్య ఘర్షణ జరిగింది. యూసుబ్ భార్యను కొట్టడంతో ఆమె.. సమీపంలోనే ఉండే తల్లి నాగమణి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో యూసుబ్ మూడు రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలు షేక్ సైదు హుస్సేన్(6), షేక్ ఆరిఫ్(5)ను తీసుకుని సాయిబాబా కాలనీలో ఉంటున్న తన అక్క షేక్ మాబుల ఇంటికి వచ్చాడు. ఏం జరిగిందని ఆమె అడగ్గా.. జరిగిన గొడవ గురించి వివరించాడు. భార్యాభర్తల గొడవే కదా.. నాలుగు రోజులు పోతే అదే సర్దుకుంటుందిలే అని ఆమె పెద్దగా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో.. యాకూబ్ తన ఇద్దరు కుమారులకూ పాలల్లో ఎలుకల మందు పేస్ట్ కలిపి తాగించాడు. అనంతరం మరో గదిలో తాను ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. సాయంత్రం స్కూల్ నుంచి వచ్చిన మాబుల పిల్లలు.. అది చూసి వెంటనే తల్లికి, తండ్రికీ ఫోన్ చేసి చెప్పారు. వారు ఇంటికి చేరుకునేసరికే యూసుబ్, అతడి ఇద్దరు కుమారులు మృతి చెందారు. లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్సై రవికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ఓట్ చోరీపై తాడో పేడో!

(మొదటి పేజీ తరువాయి)

చేయనుంది. ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేయడంతోపాటు, ఎస్ఐఆర్ ద్వారా ఓటు హక్కుపై జరుగుతున్న దాడిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం నుంచి 'ఓట్ అధికార్' పేరుతో యాత్ర చేపట్టనున్నారు. సెప్టెంబరు 1వ తేదీ వరకు నిర్వహించే ఈ యాత్ర మొత్తం 16 రోజులు పాటు 20 జిల్లాల్లో కొనసాగుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు అఖిలేశ్ ప్రసాద్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన పట్నాలో మాట్లాడుతూ... యాత్ర జరిగే 16 రోజుల పాటు రాహుల్ గాంధీ బిహార్‌లోనే ఉంటారని, సెప్టెంబరు 1న రాష్ట్ర రాజధాని పట్నాలో యాత్ర ముగియనుందని వివరించారు. "ఓట్ అధికార్ యాత్రను ససారం నుంచి ఆదివారం రాహుల్ గాంధీ ప్రారంభిస్తారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులు ఇప్పటికే తీసుకున్నాం. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇండియా బ్లాక్ తరఫున నిర్వహించే ఈ యాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. సుమారు 15 రోజుల పాటు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. యాత్రను ముందుండి నడిపించనున్నారు. ఈ నెల 20, 25, 31 తేదీల్లో మినహా.. మిగిలిన అన్ని రోజులు యాత్ర కొనసాగుతుంది. తొలి రోజు యాత్రలో రాహుల్‌తో కలిసి ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ సహా ఇండీ కూటమి నేతలు పాల్గొంటారు. మాతో కలిసివచ్చే ఇతర పార్టీల నాయకులను కూడా కలుపుకొని వెళ్తాం." అని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. ఈ యాత్రను ఎస్ఐఆర్‌పై యుద్ధంగా అభివర్ణించారు. మరో నేత పవన్ ఖెరా మాట్లాడుతూ.. ఈయాత్ర భారత ప్రజాస్వామ్య చరిత్రలో అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. "ఓటు దొంగిలించడమేకాదు.. ప్రజల గుర్తింపును కూడా దొంగిలిస్తున్నారు." అని ఖెరా విమర్శించారు.

చోరీపై 'లాపతా ఓట్' వీడియో

ఓట్ చోరీపై శనివారం రాహుల్ 'లాపతా ఓట్(ఓటు కోల్పోయిన) పేరుతో 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేశారు. దీనిలో ఓ వ్యక్తి పోలీసు స్టేషన్‌కు వచ్చి.. తన ఓటు చోరీ చేశారని, తనదే కాకుండా.. లక్షల మంది ఓట్లు కూడా చోరీ చేశారని ఫిర్యాదు చేస్తాడు. దీంతో పోలీసులు తమ సంగతేంటని వారి ఓట్లను పరిశీలించుకుంటారు. అయితే, జాబితాలో వారి ఓట్లు కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోవడంతో వీడియో ముగుస్తుంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ.. ఓట్ చోరీని 'డూ ఆర్ డై'(జీవించడమా-మరణించడమా)గా పేర్కొంది.

చంద్రబాబూ ఆందోళన వ్యక్తం చేశారు

ఓట్ల అక్రమాలపై వీధుల్లోకి రావడం తప్ప.. తమకు మరో మార్గం లేకుండా పోయిందని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించాలని కోరినా తమ విజ్ఞప్తిని పెడచెవిన పెడుతున్నారని అన్నారు. అందుకే ప్రజల మధ్యకు రావాలని నిర్ణయించుకున్నామన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారం... రాజ్యాంగం మూర్ఖులు, మోసగాళ్ల నుంచి అతిపెద్ద ముప్పును ఎదుర్కొంటుందని అంబేద్కర్ చేసిన హెచ్చరికను గుర్తుకు తెచ్చేలా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌పై అన్ని పార్టీలూ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ అన్నారు. వీటిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు కూడా ఉన్నాయని, ఏపీ సీఎం చంద్రబాబు కూడా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. ఎస్ఐఆర్ పేరుతో లక్షల మంది ఓట్లను జాబితాల నుంచి తొలగిస్తుండడం పట్ల ప్రతి ఒక్కరిలోనూ ఆవేదన ఉందన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ కూడా ఎస్ఐఆర్‌పై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయాన్ని తనకు స్వయంగా ఆయన చెప్పారని అఖిలేశ్ ప్రసాద్ సింగ్ సంచలన వ్యాఖ్య చేశారు. అయితే.. బయట మాత్రం పార్టీలైన్‌కు అనుగుణంగా గిరిరాజ్ మాట్లాడుతున్నారని అన్నారు.



యాత్ర జరిగే రోజులు : 16
కొనసాగనున్న జిల్లాలు : 20
మొత్తం దూరం : 1300 కి.మీ.

ఇక, జరగనివ్వం: రాహుల్

ఓట్ల చోరీ ఇకపై జరగనివ్వబోమని, ప్రజలు మేల్కొన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓటును తస్కరించడమంటే.. హక్కులను తస్కరించడమేనని చెప్పారు. "ఏమాత్రం అలికిడి లేకుండా ఓట్లు తస్కరించేస్తున్నారు. కానీ, ప్రజలు ఇప్పుడు మేల్కొన్నారు. ఇకపై చోరీ జరగదు. మన హక్కులు కాపాడుకునేందుకు, ఓట్ చోరీపై ఐక్యగళం వినిపిద్దాం." అని రాహుల్ వ్యాఖ్యానించారు. కాగా, 'ఓటు చోరీ ఆపండి' పేరుతో భారత యువజన కాంగ్రెస్(ఐవైసీ) శనివారం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐవైసీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని ఓటర్ల వివరాలను అధికారిక జాబితాతో పోల్చి సరిచూడనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఐవైసీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్.. జమ్ము ఉత్తర నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించారు.

రాహుల్ ఆరోపణలపై నేడు ఈసీ స్పష్టత!

- ఢిల్లీలో విలేకర్ల సమావేశం నిర్వహించనున్న ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీ ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మీడియా సమావేశం అజెండా ఏమిటనేది అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ.. ప్రతిపక్షాల నిరసన, ఆరోపణల మీద సమాధానం ఇవ్వటం కోసమే నిర్వహిస్తున్నట్లు ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించటానికి తప్ప ఇతర అంశాలపై ఈసీ విలేకరుల సమావేశం జరపటం చాలా అరుదు. బిహార్‌లో రాహుల్ చేపట్టనున్న 'ఓట్ అధికార్ యాత్ర' ఆదివారం నుంచే ప్రారంభం కానుండటం గమనార్హం. మరోవైపు, ఆరోపణలపై రుజువులు సమర్పించాలని రాహుల్ గాంధీకి నోటీసులిచ్చిన ఎన్నికల సంఘం అధికారులు బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ చేసిన ఆరోపణలపైన కూడా ఎందుకు నోటీసులివ్వలేదని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు గెల్చిన నియోజకవర్గాల్లో నకిలీ ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఆ ఓట్లతోనే వారు గెలిచారని, వారి ఎన్నికను రద్దు చేయాలని అనురాగ్ ఈ నెల 14న ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా స్పందిస్తూ.. ఈసీ ఎలక్ట్రానిక్ డేటా ఇవ్వకపోవటం వల్ల ఒక్క మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో డేటాను విశ్లేషించేందుకే తమకు 6 నెలల సమయం పట్టిందని, అనురాగ్ ఠాకూర్‌కు మాత్రం ఆరు లోక్‌సభ సీట్ల తాలూకు ఎలక్ట్రానిక్ డేటా ఎలా లభించిందని ప్రశ్నించారు. ఆయనకు ఈసీ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఇదిలా ఉండగా, ఓట్లచోరీ అంశంపై ఆరోపణలకు సంబంధించి రాహుల్‌గాంధీ ఈసీకి అఫిడవిట్ సమర్పించాల్సిన అవసరం లేదని, ముసాయిదా ఓటర్ల జాబితా పేర్లపై అభ్యంతరాలు లేవనెత్తినప్పుడు మాత్రమే అఫిడవిట్ అవసరమని ఎన్నికల మాజీ సీఈసీ ఓపీ రావత్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ ఆచారి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ఈసీ ఆదివారం సమావేశంలో వివరణ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

లోకం తీరు



అప్పుడే చెప్తే తప్పులు దిద్దేవాళ్లం!

- కొన్ని పార్టీలు ఓటర్ జాబితాలను సరైన సమయంలో పరిశీలించనట్టుంది: ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విపక్షాలన్నీ నిప్పులు చెరుగుతూ, జాబితాలో ఉన్న తప్పులపై ప్రశ్నిస్తుండడంపై ఈసీ స్పందించింది. "ఇటీవలికాలంలో కొన్ని రాజకీయ పార్టీలు, కొంతమంది వ్యక్తులు ఓటర్ల జాబితాలో తప్పుల గురించి చెబుతున్నారు. గత జాబితాల్లో తప్పుల గురించి కూడా ఇప్పుడు ప్రస్తావిస్తున్నారు. వీటన్నింటినీ చూస్తుంటే.. ఆయా రాజకీయ పార్టీలు, ఆ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు.. ఓటర్ల జాబితాలను సరైన సమయంలో పరిశీలించి, తప్పులను గుర్తించి సంబంధిత ఎన్నికల అధికారులతో పంచుకోనట్టు కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించింది. ఓటరు జాబితాలో ఓటర్ల చేరికలు, తీసివేతలకు సంబంధించిన ప్రక్రియను గురించి పది పాయింట్లతో శనివారం ఒక ప్రెస్‌నోట్‌ను విడుదల చేసిన ఈసీ.. ముసాయిదా జాబితాలను, ఖరారైన తర్వాత ఆ జాబితాలను కూడా అన్ని రాజకీయ పార్టీలకూ పంపుతామని.. వాటిలో ఏవైనా అభ్యంతరాలుంటే పార్టీలు ఆ జాబితాలను పరిశీలించి, అప్పుడే చెప్పాలని గుర్తుచేసింది. ఇప్పుడు లేవనెత్తుతున్న అభ్యంతరాలను అప్పుడే (సరైన సమయంలో), సరైన పద్ధతిలో లేవనెత్తి ఉంటే సంబంధిత అధికారులు అప్పట్లోనే ఆ తప్పులను (అవి నిజమైన తప్పులే అయి ఉంటే) దిద్ది ఉండేవారని పేర్కొంది. రాజకీయ పార్టీలు లేదా ఓటర్లు ఓటర్ల జాబితాను ఎప్పుడు పరిశీలిస్తామన్నా తాము స్వాగతిస్తామని ఈసీ స్పష్టం చేసింది. దీనివల్ల తప్పులను తొలగించడం సులువవుతుందని తెలిపింది.

సుంకాల సంకెళ్లు తప్పినట్టే!

(మొదటి పేజీ తరువాయి)

పరిణామాలు సానుకూల సంకేతాలు ఇస్తున్నాయి. రష్యాతోపాటు భారత్‌పై ఆంక్షలు, సుంకాలు పెంచుతానంటూ హూంకరించిన ట్రంప్.. ప్రస్తుతానికి అవేమీ లేనట్టేనని చెప్పడం కూడా మంచి పరిణామమని భారత వర్గాలు చెబుతున్నాయి. అయితే భూభాగాల అప్పగింతకు జెలెన్‌స్కీ నిరాకరిస్తుండటం, ఇన్నాళ్లూ ఉక్రెయిన్ అంశంలో కీలకంగా వ్యవహరించిన యూరోపియన్ దేశాలు చర్చల్లో తమను భాగస్వామ్యం చేయలేదన్న కినుకతో ఉండటం వంటివి ఇబ్బందిగా మారాయి. ఏదేమైనా సోమవారం అమెరికాలో జరిగే ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇప్పుడిక జెలెన్‌స్కీ చేతిలో ఉంది: ట్రంప్

పుతిన్‌తో భేటీ అనంతరం ఎయిర్‌ఫోర్స్ విమానంలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "పుతిన్‌తో భేటీ చాలా బాగా జరిగింది. రెండో విడత సుంకాల విధింపు ప్రస్తావన ప్రస్తుతానికి అవసరం లేదనుకుంటున్నాను. రెండు, మూడు వారాల్లోనో, ఆ తర్వాతనో దీనిపై ఆలోచిస్తా. ఒకవేళ ఇప్పుడే విధిస్తే అది వాళ్ల (రష్యా, మిత్రదేశాల)కు తీవ్రమైన దెబ్బ" అని పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు నిలిపివేస్తోంటూ.. రష్యా ఒక పెద్ద చమురు కొనుగోలుదారును కోల్పోయిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇక పుతిన్‌తో సుమారు 3గంటల పాటు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేస్తూ.. యుద్ధ విరమణ అంశం ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ దేశాల చేతిలో ఉందని ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం చేసుకోవాలని సూచించారు. రష్యా బలమైన దేశమని, ఉక్రెయిన్ కాదని వాఖ్యానించారు ఇరుదేశాల్లో బందీలుగా ఉన్న వేలాది మంది యుద్ధ ఖైదీలు త్వరలోనే విడుదలవుతారని చెప్పారు.


రేపు ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ

పుతిన్‌తో ట్రంప్ భేటీ, యుద్ధం నిలిపివేతపై చర్చల నేపథ్యంలో సోమవారం అమెరికాలోని వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీకానున్నారు. పుతిన్‌తో భేటీ అయి వాషింగ్టన్‌కు తిరిగి వెళ్తున్న ట్రంప్‌తో గంటన్నర పాటు ఫోన్‌లో మాట్లాడానని జెలెన్‌స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ భద్రత కోసం శాంతి చర్చల ప్రక్రియలతో అమెరికాతోపాటు యూరప్ దేశాల భాగస్వామ్యం కూడా కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉక్రెయిన్ భద్రతకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే భూభాగాల అప్పగింత కోసం పుతిన్ డిమాండ్ చేసినట్లు జెలెన్‌స్కీకి ట్రంప్ వివరించారని.. దీనికి జెలెన్‌స్కీ నిరాకరించారని కీవ్ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు జెలెన్‌స్కీతో చర్చల్లో సానుకూలత వస్తే.. త్వరలో పుతిన్‌తో మరో సమావేశం ఏర్పాటు చేస్తామని ట్రంప్ పేర్కొన్నారు.

యుద్ధం త్వరగా ముగియాలి: భారత్

ట్రంప్, పుతిన్ చర్చలను భారత్ స్వాగతించింది. "శాంతి కోసం వారు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. దౌత్యం, చర్చల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని ప్రపంచం కోరుకుంటోంది" అని విదేశాంగ శాఖ పేర్కొంది.

20% భూభాగాల అప్పగింతే.. శాంతి?



ఉక్రెయిన్ అంశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌దే పైచేయి అవుతోంది. రష్యా చేస్తున్న డిమాండ్లకు అనుగుణంగానే యుద్ధ విరమణ, శాంతి ఒప్పందం దిశగా పరిణామాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో భాగంగా ఉన్న ఖేర్సన్, జపోరిజియా, డోనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాలు, క్రిమియా ద్వీపకల్పం తమవేనని రష్యా ఎప్పటినుంచో వాదిస్తోంది. ఈ ప్రాంతాలను తమకు అప్పగించాలని కోరుతోంది. దానికితోడు రష్యాకు శత్రుదేశాల కూటమి అయిన నాటోలో ఉక్రెయిన్ చేరడానికి ప్రయత్నించడమూ పుతిన్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలుపెట్టారు. యుద్ధానికి 'మూల కారణాలు' ఇవేనని, అవి పరిష్కారమైతే యుద్ధం ప్రసక్తే ఉండదని ప్రకటించారు. రష్యా కోరుతున్న ప్రాంతాలు ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో 20శాతం మేర ఉంటాయి. ఇందులో క్రిమియా ద్వీపకల్పాన్ని, డోనెట్స్క్‌లో చాలా భాగాన్ని 2014లోనే రష్యా ఆక్రమించింది. తాజాగా యుద్ధంలో మొత్తం లుహాన్స్క్‌తోపాటు ఖేర్సన్, జపోరిజియా రీజియన్లలో చాలా భాగం రష్యా ఆధీనంలోకి వెళ్లాయి. అయితే వీటిని అధికారికంగా, శాశ్వతంగా అప్పగించాలని రష్యా డిమాండ్ చేస్తోంది. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ట్రంప్ వారం రోజుల క్రితమే చెప్పారు. పుతిన్‌తో భేటీ తర్వాత కూడా.. భూభాగాల అప్పగింత కోసం రష్యా డిమాండ్ చేస్తోందని, ఇప్పుడంతా జెలెన్‌స్కీ చేతిలోనే ఉందని ట్రంప్ స్పష్టంగా వెల్లడించారు. ఈ క్రమంలో రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగింపునకు వచ్చినట్టేని.. భారత్‌కు ఉపశమనమేనని భారత అధికారులు చెబుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే భారత్‌పై అమెరికా అడ్డగోలు సుంకాలు విధించిందని గుర్తు చేస్తున్నారు. యుద్ధం సద్దుమణిగితే.. రష్యాతోపాటు భారత్‌పైనా ఆంక్షలు, సుంకాలు తొలగిపోయే అవకాశాలు ఎక్కువని చెబుతున్నారు. భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకం అమల్లోకి వచ్చే ఆగస్టు 27వ తేదీనాటికి అంతా కొలిక్కి రావొచ్చని... ఈ అదనపు సుంకాలను తొలగించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై కసరత్తు ముమ్మరం

నేడు బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ.. రేసులో రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక కోసం అధికార, విపక్ష పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. శుక్రవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా నివాసంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా సీనియర్ నేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కాబోతోంది. ఇందులో ప్రధానంగా ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిపైనే చర్చ జరిగే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రధాని మోదీతోపాటు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణకు చెందిన ఎంపీ లక్ష్మణ్‌తో పాటు ఇతర పార్లమెంటరీ బోర్డు సభ్యులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఇప్పటికే స్పష్టతకు వచ్చిన కొన్ని పేర్లపై చర్చించి ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై తుది నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. జాట్ సామాజిక వర్గానికి చెందిన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో భర్తీ చేస్తారనే ప్రచారమూ జరుగుతోంది. ప్రస్తుతం రేసులో ఉన్న గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ జాట్ వర్గానికి చెందిన వ్యక్తే. ఢిల్లీ ఎల్జీ వీకే సక్సేనా, బిహార్ గవర్నర్ ఆరిఫ్ ఖాన్, కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సిక్కిం గవర్నర్ ఓం మాథుర్, జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త శేషాద్రి చారి అభ్యర్థిత్వంపైనా చర్చిస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

ఆ అధికారం కోర్టులకు లేదు

- బిల్లుల్ని ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు పెట్టలేదు
- అలా చేస్తే రాజ్యాంగపరమైన గందరగోళం
- సుప్రీంకోర్టుకు తేల్చిచెప్పిన కేంద్ర సర్కారు

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభల్లో ఆమోదించి, పంపే బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి గవర్నర్లకు, రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనివల్ల రాజ్యాంగపరమైన గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని.. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించిన లిఖితపూర్వక వాదనల్లో అభిప్రాయపడింది. రాష్ట్రాల బిల్లులపై ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ల విచక్షణాధికారాలకు సంబంధించి.. రాజ్యాంగంలోని 200, 201 అధికరణల్లో ఎలాంటి కాలపరిమితీ లేదని గుర్తుచేసింది. ఈ అధికరణల కింద లభించిన అధికారాలను యాంత్రికంగా అమలు చేయడం సాధ్యం కాదని, వాటిని రాజ్యాంగ బాధ్యతల్లో భాగంగా భావించాలని కేంద్రం తెలిపింది. గవర్నర్లకు, రాష్ట్రపతికి.. ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగంలో ఎలాంటి కాలపరిమితీ నిర్దేశించలేదని.. అలా గడువు విధించడం వల్ల రాజ్యాంగ బాధ్యతలను వారు సరిగా నిర్వహించలేరని తెలిపింది. న్యాయ పరమైన ఆదేశాల ద్వారా కాల పరిమితిని నిర్దేశించడం సరైంది కాదని, అందుకు రాజ్యాంగంలో సవరణ చేయాల్సి ఉంటుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. కాలపరిమితి అంశం 368 అధికరణ కింద పూర్తిగా పార్లమెంట్ అధికార పరిధిలోకి వస్తుందని స్పష్టంగా రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలాంటి గడువూ విధించలేరని వెల్లడించారు. గవర్నర్లు కేవలం కేంద్ర దూతలు కారని పేర్కొన్నారు. 200 అధికరణలో.. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లుల విషయంలో గవర్నర్ల విధులకు సంబంధించి ఆమోదం, నిలిపివేయడం, పెండింగ్‌లో ఉంచడం, తిరిగి పంపించడం మొదలైన నాలుగు స్పష్టమైన చర్యలను మాత్రమే సూచించారని, ఒక్కో పదానికీ వేర్వేరు అర్థాలు, వేర్వేరు అధికారాలు ఉన్నాయని వివరించారు. గవర్నర్ తన విచక్షణ ప్రకారం ఆమోదం తెలపవచ్చునని చెప్పారు. 142 అధికరణ కింద పూర్తి న్యాయం చేయడానికి సుప్రీంకోర్టుకు అధికారాలు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ నిబంధనలు అధిగమించి అది అధికారాలను ఉపయోగించలేదని తుషార్ మెహతా లిఖిత పూర్వకంగా స్పష్టం చేశారు. బిల్లుల ఆమోదానికి సంబంధించి గవర్నర్, రాష్ట్రపతి విచక్షణాధికారాలపై సుప్రీంకోర్టు సోమవారం విచారించనున్న నేపథ్యంలో కేంద్రం తన అభిప్రాయాన్ని నిష్పష్టంగా చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.



తిరుమలలో రోడ్డుపై బైఠాయించిన శ్రీవాణి భక్తులు

తిరుమలలో శ్రీవాణి భక్తుల నిరసన

» రోడ్డుపై బైఠాయించి టికెట్లు ఇవ్వాలని డిమాండ్

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు టికెట్లు జారీ చేయాల్సిందేనంటూ శనివారం తిరుమలలో భక్తులు నిరసనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు భక్తులు పోటెత్తారు. శ్రీవాణి టికెట్ల కోసం కూడా భారీగా భక్తులు తిరుమలలోని అన్నమయ్య భవనం వద్దకు చేరుకున్నారు. రోజూ ఉదయం శ్రీవాణి టికెట్లు కేటాయించి సాయంత్రానికి దర్శనం చేయిస్తున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం రద్దీ అధికమైన క్రమంలో రాత్రి 11.30 గంటలకే టోకెన్లు జారీ ప్రారంభించి శనివారం వేకువజామున 2 గంటల వరకు టికెట్లు జారీ చేశారు. ఈ క్రమంలో 2.30 గంటల తర్వాత వచ్చిన భక్తులకు 800 టికెట్ల కోటా పూర్తయిందని, తిరిగి ఆదివారం రావాలంటూ సిబ్బంది సూచించారు. దీంతో ముందుగా టికెట్లు ఎలా కేటాయిస్తారని, తాము పిల్లలతో రోడ్లపై ఉన్నామంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ల కోటా పెంపు సాధ్యం కాదని, అందరు సర్వదర్శనానికి వెళ్లాలంటూ భద్రతా సిబ్బంది సూచించడంతో కొంతమంది భక్తులు అన్నమయ్య భవనం ముందున్న రోడ్డుపై బైఠాయించి టికెట్లు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. విజిలెన్స్, పోలీసు అధికారులు బలవంతంగా వారిని పంపాల్సి వచ్చింది. ఈ సందర్భంగా సీఐ శ్రీరాముడు ఏదైనా ఫిర్యాదులుంటే రాతపూర్వకంగా ఇవ్వాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భక్తులకు సూచించారు. అంతకుముందు టికెట్ల కోసం కౌంటర్ వద్దకు వెళ్లే క్రమంలో శ్రీవాణి భక్తుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది.

భ్రమరాంబ దేవికి కానుకగా కాసుల పేరు



భ్రమరాంబికాదేవికి కాసులపేరు అందజేస్తున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైలంలోని భ్రమరాంబదేవికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర దంపతులు రూ.11 లక్షల విలువైన బంగారు కాసులపేరు సమర్పించారు. సుమారు 100 గ్రాముల కాసుల పేరును దాత ఆలయ ఈఓ శ్రీనివాసరావుకు అందజేశారు.

నేడు పాలకొల్లుకు మంత్రి లోకేశ్

పాలకొల్లు టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో పర్యటించనున్నారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ నిశ్చితార్థ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొంటారని మంత్రి నిమ్మల కార్యాలయం తెలిపింది. మంత్రి లోకేశ్‌తో పాటు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొంది.



శ్రీసత్యసాయి జిల్లా అమ్మవారిపల్లిలో నెలకొల్పిన కియ కార్ల ప్రధాన పరిశ్రమ

కియతో కళకళ

సత్యసాయి జిల్లాలో వేలాది కుటుంబాల్లో వెలుగులు

» రోజురోజుకూ విస్తరిస్తున్న అనుబంధ పరిశ్రమలు

» జాతీయ రహదారి పక్కన 20 కి.మీ. పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేలమందికి పైగా ఉపాధి

» ఉమ్మడి జిల్లా, ఇతర రాష్ట్రాల వారికీ అవకాశాలు

» రూ.లక్ష పలికిన ఎకరా.. ఇప్పుడు కోటిన్నర పైనే

(హిందూపురం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు అక్కడ ప్రధానంగా వ్యవసాయమే జీవనాధారం. ఉదయం లేవగానే చాలామంది పొలం బాట పట్టేవారు. ఉపాధి లేనివారు బెంగళూరుకు వలస వెళ్లేవారు. అక్కడా పని దొరకకపోతే కుటుంబాలకు కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయేవి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం, ముఖ్యంగా పెనుకొండ నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇది.

కియతో పాటు అనుబంధ పరిశ్రమల రాకతో ఇప్పుడు ఈ ప్రాంతం రూపురేఖలు చాలా వరకు మారిపోయాయి. ప్రజల జీవనశైలీ మారిపోయింది. వేలాది కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. సమీపంలోని పరిశ్రమలలో ఉపాధి లభించింది. పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు వచ్చాయి. చిన్న ఇళ్లు మేడలయ్యాయి. చిన్న అంగళ్లు సూపర్ మార్కెట్లుగా మారిపోయాయి. టీ స్టాల్ స్థానంలో ఆధునిక కేఫ్‌లు ఏర్పడ్డాయి. భూములు ధరలు భారీగా పెరిగిపోయాయి.

ఒకప్పుడున్న గుట్టలు కనుమరుగై.. పెద్ద పెద్ద భవంతులు, టౌన్‌షిప్‌లు నిర్మితమయ్యాయి. ఒకప్పుడు చీకటి పడితే జనసంచారం లేక, అడవిలా కనిపించే ఈ ప్రాంతం.. ఇప్పుడు విద్యుత్ వెలుగులతో ధగధగలాడుతోంది. శ్రీసత్యసాయి జిల్లాకు కియా కార్ల పరిశ్రమ రాకతో పరోక్షంగా, ప్రత్యక్షంగా 30 వేలమందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాలవారు ఉన్నారు. స్థానికంగా పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, రొద్దం మండలాలలో సరికొత్త జోష్ వచ్చింది. స్థానికంగా వేలాదిమంది కుటుంబాల్లో వెలుగులు నింపింది. కియ కార్ల పరిశ్రమ మొదట 2017లో ఏర్పాటైంది. పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభమైంది. ఆ తరువాత దాని అనుబంధ పరిశ్రమలు ఒక్కొక్కటిగా సుమారు 20కి పైగా వచ్చాయి. పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల మండలాల్లో ఇవి విస్తరించాయి. మూడేళ్ల క్రితం వరకు పెనుకొండ చుట్టూ ఉన్న పరిశ్రమలు ప్రస్తుతం గోరంట్ల మండలంలోకి విస్తరించాయి. పాలసముద్రం వద్ద కియ అనుబంధ పరిశ్రమలు పదికి పైగా ఉన్నాయి. ఒకప్పుడు కియ ప్రధాన పరిశ్రమలోనే ఉపాధి లభించగా.. ప్రస్తుతం 20 కి.మీ. పరిధిలో అవకాశాలు పెరిగాయి. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఇక్కడ వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. కర్ణాటక నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశించాక.. పాలసముద్రం నుంచి సుమారు 20 కి.మీ. పరిధిలో జాతీయ రహదారి పక్కన ఆధునిక రెస్టారెంట్లు, పెద్దపెద్ద భవంతులు కనిపిస్తాయి. జాతీయ రహదారికి ఆనుకుని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.

లక్షలు పలికే భూమి కోట్లకు..

ఒకప్పుడు పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో ఎకరం భూమి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా పలికేది. కియ, అనుబంధ పరిశ్రమలు రావడంతో భూమి ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొన్నిచోట్ల భూముల విలువ 20 నుంచి 40 రెట్లు పెరిగిందని ఈ ప్రాంత రైతులు అంటున్నారు. గోరంట్ల మండలంలో ఎకరం భూమి ఒకప్పుడు రూ.5 లక్షలు ఉండేది. కియకు తోడు పాలసముద్రం వద్ద మరిన్ని పరిశ్రమలు రావడంతో ఇప్పుడు ఎకరం రూ.1.5 కోట్ల నుంచి రూ.2 కోట్ల దాకా పలుకుతోంది. పెనుకొండ చుట్టుపక్కల పదేళ్ల క్రితం రూ.లక్ష నుంచి రూ.2 లక్షలున్న ఎకరం భూమి ప్రస్తుతం రూ.1.5 కోట్లకు చేరింది. సోమందేపల్లి మండల కేంద్రంలో పదేళ్ల క్రితం సెంటు రూ.లక్ష ఉండగా, ప్రస్తుతం రూ.10 లక్షలకు పెరిగింది.

పరిశ్రమల రాకతో...

కరువు కాటకాలతో తల్లడిల్లుతున్న ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రను కియ మార్చి వేసింది. కియ స్థిరపడ్డాక పలు అంతర్జాతీయ సంస్థలు జిల్లాకు వస్తున్నాయి. గోరంట్ల వద్ద నాసిన్ అకాడమీ ఏర్పాటైంది. ఎయిర్‌బస్, బెల్‌తో పాటు మరో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇక్కడికి వస్తోంది. నేడు ప్రపంచ పారిశ్రామికవేత్తలు ఇటువైపు చూసేలా జిల్లా పారిశ్రామికంగా వృద్ధి చెందుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు ఇక్కడికి రావడంతో జాతీయ రహదారికి ఆనుకుని పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల మండలాల్లో టౌన్‌షిప్‌లు ఏర్పాటయ్యాయి. పాలసముద్రం సమీపంలో గుట్టలు, కొండలను చదును చేసి అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. ప్రస్తుతం పాలసముద్రం చుట్టూ పదుల సంఖ్యలో లే అవుట్లు వెలిశాయి. పాలసముద్రం జాతీయ రహదారి సర్కిల్‌లో పదుల సంఖ్యలో దుకాణాలు వృద్ధి చెందాయి. పాలసముద్రం వైపు మరిన్ని సంస్థలు వస్తున్నాయి. ఇక్కడ పనిచేసేందుకు వచ్చేవారికి అద్దెకు ఇచ్చేందుకు, అమ్మేందుకు ఇప్పటికే హిందూపురం రహదారిలో పదుల సంఖ్యలో విల్లాలు నిర్మించారు. గోరంట్ల-బెంగళూరు రహదారి పక్కన.. పాలసముద్రం సమీపంలో మరికొన్ని విల్లాలు ఏర్పాటవుతున్నాయి. పారిశ్రామిక అభివృద్ధిలో ఈ ప్రాంతం దూసుకుపోతోంది. నగర వాతావరణాన్ని తలపించేలా పరిస్థితులు మారిపోతున్నాయి. ఈ ప్రాంతంలో నివసిస్తున్నవారు మార్కెట్‌లో విడుదలైన కొత్త కొత్త వాహనాలను కొనుగోలు చేస్తున్నారు.



శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద హోటళ్లు



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో వెలసిన టౌన్‌షిప్‌లు

చంద్రబాబుతోనే సాధ్యం



ఎనిమిదేళ్ల క్రితం జీవనోపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లాలనుకున్నాం. కియ పరిశ్రమ రాకతో గ్రాండ్ స్టే విల్లాల వద్ద చిల్లర దుకాణం, టీస్టాల్ పెట్టుకున్నాం. ఎనిమిదేళ్లుగా మా కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు. ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాం. సీఎం చంద్రబాబు కియను మా ప్రాంతానికి తీసుకువచ్చినందుకే ఇది సాధ్యమైంది. ఇక్కడున్న విల్లాలలో ఇతర రాష్ట్రాలకు చెందినవారు అద్దెకు ఉంటున్నారు.

- హరిప్రసాద్, చిల్లరకొట్టు వ్యాపారి, పాలసముద్రం, శ్రీసత్యసాయి జిల్లా

టిఫిన్ సెంటర్‌తో జీవనం



పరిశ్రమ రాకతో మా ప్రాంతం, మా గ్రామం ఎంతో అభివృద్ధి చెందాయి. ఇతర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం చాలామంది వచ్చారు. వారి కోసం టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. మా కుటుంబ జీవనం సాఫీగా సాగుతోంది.

- శివారెడ్డి, అమ్మవారిపల్లి, పెనుకొండ మండలం, శ్రీసత్యసాయి జిల్లా

కూటమి రాకతో భవిష్యత్తుపై ధీమా

కియ పరిశ్రమను రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాకు తీసుకొచ్చారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇక్కడకు రావాల్సిన కొన్ని పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. నాడు వైసీపీ నాయకుల దెబ్బకు భయపడి పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి వచ్చింది. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఈ పరిస్థితి మారింది. ఇక్కడికి రావడానికి, పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ భవిష్యత్తు బాగుంటుందని విశ్వసిస్తున్నారు. చంద్రబాబు పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తారని, ఇక్కడికి మరిన్ని వస్తాయని జిల్లా ప్రజలు అంటున్నారు. మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశిస్తున్నారు.



జస్టిస్ గుణరంజన్ చౌదరికి స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

మల్లన్న సేవలో జస్టిస్ చల్లా గుణరంజన్ చౌదరి

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ చౌదరి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.



సీపీఆర్ చేసి కాపాడిన గుర్రప్ప



కోలుకున్న మేడం శ్రీనివాసులు

శ్రీవారి ఆలయం వద్ద భక్తుడికి గుండెపోటు

» సీపీఆర్ చేసి కాపాడిన కానిస్టేబుల్

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఓ కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించి సీపీఆర్ చేసి ఓ భక్తుడిని రక్షించారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా మామిడిపల్లికి చెందిన మేడం శ్రీనివాసులు(61) కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం రాత్రి 9.30 గంటల సమయంలో లడ్డూలు కొనుక్కుని మ్యూజియం వైపు వస్తున్న క్రమంలో పడమర మాడవీధిలో ఛాతీనొప్పితో కుప్పకూలిపోయారు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్‌టౌన్ కానిస్టేబుల్ గుర్రప్ప ఆయనకు సీపీఆర్ చేయడంతో కోలుకున్నారు. వెంటనే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

పులివెందులలో జగన్ పార్టీకి డిపాజిట్ దక్కదని తెలుగుదేశం నాయకులు ఊహించలేదు. గెలవడం ఎలా? అన్న దానిపైనే తర్జనభర్జన పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలే అయినందున ఉప ఎన్నికలు ఏవి జరిగినా ఫలితాలు కూటమికి అనుకూలంగానే ఉంటాయి. అయితే ఉప ఎన్నికలు జరిగిన రెండు స్థానాలు కడప జిల్లాలో ఉండటం, అందులో ఒకటి జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితాలు కూటమి నాయకుల అంచనాలకు భిన్నంగా వచ్చాయి. రాజకీయాల్లో ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలియకుండా జగన్‌రెడ్డి మూర్ఖంగా వెళతారు. ఈ పోకడలను ఆయనను గుడ్డిగా అభిమానించేవారు కీర్తిస్తున్నారు. దీంతో తాను నిజంగానే పులిని అని ఆయన నమ్ముతున్నారు. తాను తలపండిన రాజకీయ నాయకుడు చంద్రబాబుతో తలపడుతున్న విషయం మరచిపోతున్నారు. ప్రస్తుతానికి తల బొప్పి కట్టింది. భవిష్యత్తులో తల పగలకూడదు అనుకుంటే రాజకీయంగా ఆచితూచి అడుగులు వేయాలి. మొరటుతనం అన్ని వేళలా పనికిరాదు.

పులివెందుల పులి.. పిల్లి శాపనార్థాలు!

ధర్మో రక్షతి రక్షితః ..ధర్మాన్ని నీవు రక్షిస్తే ధర్మం నిన్ను రక్షిస్తుంది. పులివెందుల–ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేసిన విమర్శలు విన్న తర్వాత ఈ సూక్తి గుర్తుకురాకుండా ఉండదు. 'ఈ ఎన్నికలలో అధికార కూటమి అరాచకంగా వ్యవహరించింది. దొంగ ఓట్లతో గెలిచిన గెలుపు కూడా ఒక గెలుపేనా? ఇలా అయితే ప్రజాస్వామ్యం ఏమి కావాలి? ముఖ్యమంత్రి నరకానికి పోతాడు!' అని జగన్‌రెడ్డి అండ్ కో చేస్తున్న ఆక్రందనలు రాజకీయ ప్రత్యర్థులకు శ్రవణానందకరంగా ఎందుకు మారాయి? జగన్‌రెడ్డి పరోక్ష మద్దతుదారులు, అభ్యుదయవాదుల ముసుగులో ఉన్న జగన్‌రెడ్డి శ్రేయోభిలాషులు కూడా 'ఇది అన్యాయం' అని గట్టిగా ఎందుకు నిలదీయలేకపోతున్నారు? మనం విత్తే విత్తును బట్టే ఆ చెట్టు కాయలు ఉంటాయని జగన్‌రెడ్డి ఇటీవల తరచుగా చెబుతున్నట్టుగానే అధికారంలో ఉన్నప్పుడు ఆయనగారు చేసిన అరాచకాలు ఇప్పుడు ఖర్మ రూపంలో ఎదురొస్తున్నాయి. ఖర్మ ఫలాన్ని అనుభవించాల్సిందే. అందుకే పులివెందులలో జరిగినవి ఎన్నికలే కాదని జగన్ అండ్ కో ఆక్రోశిస్తున్నా అన్యుల చెవికి ఎక్కడం లేదు. అయినా 'పులి బిడ్డ', 'పులివెందుల పులి' అని కీర్తించబడుతున్న జగన్‌రెడ్డి పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? బెబ్బులి పులిలా గాండ్రించకుండా.. ముసలివాడైన చంద్రబాబు రామా కృష్ణా అనుకోకుండా ఇలా ఎందుకు చేస్తున్నాడు? 'నరకానికి పోతాడు.. బహుశా ఆయనకు ఇవే చివరి ఎన్నికలు' అని పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? పులికి బేలతనం ఉండదు కదా? ఆకలితో అలమటిస్తున్నా పులి గడ్డి మాత్రం తినదు. మన జగన్‌రెడ్డి కూడా ప్రతీకారం తీర్చుకోవడానికి అదను కోసం వేచిచూడకుండా బీద అరుపులు, పిల్లి శాపనార్థాలు పెట్టడం ఏమిటి? తాను మాత్రం ఉట్టి కట్టుకొని నూరేళ్లపాటు ఊరేగుతానని, 75 ఏళ్ల వయసుకు చేరుకున్న చంద్రబాబు పరిస్థితి ఇవాళో రేపో అన్నట్టుగా ఉందని వాగడం ఏమిటి? ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా వచ్చే నెలతో 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను కూడా ఇవాళో రేపో అని అనగలవా? అంతెందుకు, ప్రపంచ దేశాలను, మరీ ముఖ్యంగా మన దేశాన్ని సుంకాల పేరిట వేధిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు 79 ఏళ్లు. ఈ వాస్తవాలను మరిచి చంద్రబాబు జీవించి ఉన్నంత కాలం ఆయనతో నేను రాజకీయంగా పోటీ పడలేను అన్నట్టుగా జగన్ రోదన ఉంది. పులివెందుల అంటే అది తమ కుటుంబ అడ్డా అని, అక్కడ మరొకరికి చోటు లేదు బిడ్డా అన్నట్టుగా ఇంతకాలం విర్రవీగడం వల్లనే ఇప్పుడు ఈ ఆవేదన. రాజ్యాలు, సామ్రాజ్యాలు కుప్పకూలిపోయాయి. రాజులు, చక్రవర్తుల చిరునామాలు గల్లంతయ్యాయి. ఒకప్పుడు రవి అస్తమించని సామ్రాజ్యంగా కీర్తించబడిన బ్రిటన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి? అలాగే పులివెందుల అయినా మరొకటి అయినా ఏదీ ఎవరికీ సొంతం కాదు. ప్రజాస్వామ్యంలో అలా సాధ్యం కాదు కూడా. ఇంతకూ పులివెందులలో ఏమి జరిగింది? జగన్‌రెడ్డి కథ అడ్డం తిరగడానికి కారణం ఏమిటి? నిజంగా జగన్ అండ్ కో ఆరోపిస్తున్నట్టుగా దొంగ ఓటర్లు వచ్చి పడటం వల్లనే వైసీపీకి డిపాజిట్ కూడా గల్లంతయిందా? లేక ప్రజల్లో నిజంగానే జగన్ పట్ల విముఖత ఏర్పడుతోందా? అన్నది పరిశీలించాలి. తన హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల సందర్భంగా జగన్‌రెడ్డి అన్ని హద్దులూ దాటారు. ప్రత్యర్థి పార్టీకి చెందిన వాళ్లను నామినేషన్లు కూడా వేయనీయలేదు. ఇప్పుడు పులివెందులలో పోలింగ్ కేంద్రాలలో తమ పార్టీ ఏజెంట్లను కూడా ఉండనివ్వలేదు అని జగన్‌రెడ్డి వాపోతున్నారు. ఇప్పుడు కనీసం నామినేషన్లు అయినా వేసుకోనిచ్చారు కదా అని సంతృప్తిపడటం మంచిదేమో. తిరుపతి పార్లమెంటు స్థానానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా తిరుపతి పట్టణంలో విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేయించుకోలేదా? అప్పుడు అదంతా న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా జరిగిందని చెప్పుకొన్నారు కదా? ఆనాడు మీరు ఏర్పరిచిన దారిలోనే ఇప్పుడు కూటమి ప్రభుత్వం నడిచి ఉంటుంది. అందుకే జగన్ అండ్ కోను ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదు. అప్పట్లో 90 శాతానికి పైగా స్థానిక సంస్థలలో జయకేతనం ఎగురవేశామని సంబరపడ్డారు కదా? ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత పెరిగిందని మీ చర్యలను సమర్థించుకున్నారు కదా? ఇప్పుడు కూటమి నేతలు కూడా అదే పనిచేస్తున్నారు. నిజానికి స్థానిక సంస్థల ఫలితాలు అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలంగానే ఉంటాయి. నూటికి నూరు శాతం స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నప్పటికీ సాధారణ ఎన్నికల్లో ఫలితాలను ప్రభావితం చేయలేరు. తెలంగాణలో కూడా కేసీఆర్ పార్టీ దాదాపుగా అన్ని స్థానిక సంస్థలను సొంతం చేసుకుంది. అయినా 2023లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి పరిస్థితి కూడా ఇంతే. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఏం చేశారో మరచిపోతే ఎలా?

అక్కడసలు అంత సీన్ ఉందా?

జగన్‌రెడ్డి రాజకీయాల్లోకి ప్రవేశించక ముందు వరకు తెలుగునాట రాజకీయాల్లో కొన్ని ఉన్నత ప్రమాణాలు పాటించేవారు. రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రధాన ప్రత్యర్థులుగా తెలుగునాట రాజకీయాలు సాగినప్పుడు కూడా ఈ ప్రమాణాలను పాటించారు. రాజశేఖరరెడ్డిని పులివెందులలో ఓడించడానికి, కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి వారు ఇరువురూ ప్రత్యేకంగా వ్యూహాలు రచించి అమలు చేయలేదు. నిజానికి పులివెందులలో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో ప్రజలలో మద్దతు లేదు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ విషయం రుజువైంది. అప్పుడు కడప లోక్‌సభ స్థానం నుంచి రాజశేఖరరెడ్డి పోటీ చేశారు. చంద్రబాబు అప్పుడే ముఖ్యమంత్రి అయ్యారు. జిల్లా ఎస్పీగా ఉమేష్ చంద్ర ఉన్నారు. ఎన్టీఆర్‌ను ధిక్కరించి పార్టీని సొంతం చేసుకున్న చంద్రబాబుకు నాటి ఎన్నికలు విషమ పరీక్షగా మారాయి. దీంతో మెజారిటీ స్థానాలు గెలుచుకోక తప్పని పరిస్థితి చంద్రబాబుది. ఈ నేపథ్యంలో కడప పైన కూడా ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని ఆయన జిల్లా ఎస్పీ ఉమేష్ చంద్రను ఆదేశించారు. ఉమేష్ చంద్ర పులివెందులపై దృష్టి కేంద్రీకరించి రిగ్గింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. చివరి నిమిషంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మనసు మార్చుకొని పులివెందులలో కాస్త చూసీ చూడనట్టు వెళ్లవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఫలితంగా కేవలం ఐదు వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆ ఎన్నికల్లో రాజశేఖరరెడ్డి గట్టెక్కి పరువు దక్కించుకున్నారు. దీన్నిబట్టి ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించగలిగితే పులివెందులలో వైఎస్ కుటుంబానికి చెప్పుకొనేంత సీన్ లేదని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పులివెందుల, ఒంటిమిట్ట ఫలితాలను చూడాల్సి ఉంది. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జగన్‌రెడ్డి వేధింపులకు గురిచేసి ఉండకపోతే ఇప్పుడు పులివెందులలో డిపాజిట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడేది కాదు. నేను చేస్తే సంసారం– ఇతరులు చేస్తే వ్యభిచారం అన్నట్టుగా జగన్‌రెడ్డి ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ధర్మం–న్యాయం అని కలవరిస్తున్న జగన్‌రెడ్డి అప్పుడు చేసిందేమిటి? ఆనాడు పోలీసులను దుర్వినియోగం చేయడం ద్వారా మీరు దారి ఏర్పరిచారు. ఇప్పుడు కూటమి నేతలు అదే దారిలో వెళ్లకూడదు అని కోరుకునే నైతికత జగన్‌రెడ్డికి ఉంటుందా? 14 మాసాల క్రితం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలెవరూ మరచిపోలేకపోతున్నారు. అందుకే అన్యాయం జరిగిందని జగన్ అండ్ కో ఘోషిస్తున్నా మద్దతు లభించడం లేదు. కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు కదా! 'వై నాట్ 175?' అన్నప్పుడు న్యాయం, ధర్మం గుర్తుకురాలేదా? అసెంబ్లీలో ప్రతిపక్షానికి ప్రాతినిధ్యమే ఉండకూడదని అనుకున్నారు కదా? అందుకే ప్రజలు మీకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తీర్పు ఇచ్చారు. 2019 ఎన్నికలతో పోల్చితే 2024లో పులివెందులలో జగన్‌రెడ్డి మెజారిటీ 30 వేలకు పైగా తగ్గింది. అయినా తన పట్ల ప్రజల్లో విముఖత ఏర్పడుతోందని జగన్‌రెడ్డి గుర్తించలేకపోయారు. సొంత బాబాయిని హత్య చేసిన, చేయించిన వాళ్లకు వత్తాసు పలుకుతూ, తల్లినీ చెల్లినీ దూరం చేసుకున్న జగన్‌రెడ్డి నిజస్వరూపాన్ని పులివెందుల ప్రజలు కూడా గుర్తించారు.

> **పులివెందుల, ఒంటిమిట్ట విజయంతో తెలుగుదేశం నాయకులు మిడిసిపడకూడదు. జగన్‌రెడ్డికి ప్రస్తుత దుస్థితి ఎందుకు కలిగిందా అని అనుక్షణం గమనంలో ఉంచుకోవాలి. అంతేగానీ, పులివెందులనే కొట్టాం– ఇక మాకు తిరుగు ఉండదని భావిస్తే నడ్డివిరవడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు.**

అయినా 2024 ఎన్నికల్లో పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా ఓట్లు వేసుకోలేకపోయారు. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. వైసీపీకి డిపాజిట్ కూడా దక్కకుండా చేశారు. స్థానిక ఓటర్లు ఓటు వేయపోతే కేవలం దొంగ ఓట్లతోనే ఎవరూ ఈ స్థాయి విజయాన్ని అందుకోలేరు. నా పుట్టలో వేలు పెడితే నేను ఊరుకుంటానా అన్నట్టుగా కుప్పంలో నాడు వేలు పెట్టినందుకు చంద్రబాబు ఇప్పుడు ప్రతీకారం తీర్చుకున్నారు. నిజానికి పులివెందులలో జగన్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కదని తెలుగుదేశం నాయకులు కూడా ఊహించలేదు. గెలవడం ఎలా? అన్న దానిపైనే తర్జనభర్జన పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 మాసాలే అయినందున ఉప ఎన్నికలు ఏవి జరిగినా ఫలితాలు కూటమికి అనుకూలంగానే ఉంటాయి.



AKBAR

అయితే ఉప ఎన్నికలు జరిగిన రెండు స్థానాలు కడప జిల్లాలో ఉండటం, అందులో ఒకటి జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఫలితాలు కూటమి నాయకుల అంచనాలకు భిన్నంగా వచ్చాయి. రాజకీయాల్లో ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలియకుండా జగన్‌రెడ్డి మూర్ఖంగా వెళతారు. ఈ పోకడలను ఆయనను గుడ్డిగా అభిమానించే వారు కీర్తిస్తున్నారు. దీంతో తాను నిజంగానే పులిని అని ఆయన నమ్ముతున్నారు. తాను తలపండిన రాజకీయ నాయకుడు చంద్రబాబుతో తలపడుతున్న విషయం మరచిపోతున్నారు. ప్రస్తుతానికి తల బొప్పి కట్టింది. భవిష్యత్తులో తల పగలకూడదు అనుకుంటే

> **నిజానికి పులివెందులలో వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో ప్రజలలో మద్దతు లేదు. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఈ విషయం రుజువైంది. అప్పుడు కడప లోక్‌సభ స్థానం నుంచి రాజశేఖరరెడ్డి పోటీ చేశారు. చంద్రబాబు అప్పుడే ముఖ్యమంత్రి అయ్యారు. జిల్లా ఎస్పీగా ఉమేష్ చంద్ర ఉన్నారు. ఎన్టీఆర్‌ను ధిక్కరించి పార్టీని సొంతం చేసుకున్న చంద్రబాబుకు నాటి ఎన్నికలు విషమ పరీక్షగా మారాయి. దీంతో మెజారిటీ స్థానాలు గెలుచుకోక తప్పని పరిస్థితి చంద్రబాబుది. ఈ నేపథ్యంలో కడప పైన కూడా ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని ఆయన జిల్లా ఎస్పీ ఉమేష్ చంద్రను ఆదేశించారు. ఉమేష్ చంద్ర పులివెందులపై దృష్టి కేంద్రీకరించి రిగ్గింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. మిగతా అసెంబ్లీ నియోజకవర్గాలలో కూడా ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. చివరి నిమిషంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు మనసు మార్చుకొని పులివెందులలో కాస్త చూసీ చూడనట్టు వెళ్లవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఫలితంగా కేవలం ఐదు వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆ ఎన్నికల్లో రాజశేఖరరెడ్డి గట్టెక్కి పరువు దక్కించుకున్నారు.**

రాజకీయంగా ఆచితూచి అడుగులు వేయాలి. మొరటుతనం అన్ని వేళలా పనికిరాదు. పెళ్లిళ్లు పేరంటాలకు వెళ్లినప్పుడు తోలుకెళ్లిన జనంతో హడావిడి చేసి ప్రభంజనం అని మురిసిపోవడం వల్ల ప్రయోజనం ఉండదు. ప్రజలు తనను అంతలా ఎందుకు తిరస్కరిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోకుండా ఆత్మవంచనతో ముందుకు సాగితే ఫలితాలు ఇలా ప్రతికూలంగానే ఉంటాయి.

నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

అధికారంలో ఉన్నప్పుడు ధర్మాన్ని రక్షించి ఉంటే అది ఇప్పుడు నిన్ను రక్షించి ఉండేది. గడచిన 30 ఏళ్లలో తెలుగుదేశం పార్టీ అనేక పర్యాయాలు అధికారంలో ఉంది. అయినా పులివెందుల జడ్పీటీసీని గెలిపించుకోలేకపోయింది. మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు గెలుచుకోగలిగారు. అది కూడా జగన్‌రెడ్డి పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తూ! ఎంత దొంగ ఓట్లు అయితే మాత్రం ఫలితం ఇంత దారుణంగా ఉంటుందా? ఇక్కడే జగన్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలి. జగన్‌రెడ్డిలో ఇప్పటికీ మార్పు కనబడటం లేదు. రాజకీయ ఎత్తుగడల్లో కూడా మార్పు లేదనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన వల్లభనేని వంశీ, కొడాలి నాని వంటి వారిని తెలుగుదేశం పైకి ఉసిగొల్పారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కాపు సామాజిక వర్గానికి చెందిన పేర్ని నాని, అంబటి రాంబాబును ప్రయోగిస్తున్నారు. ఈ రెండు సామాజిక వర్గాల వారినే తన పావులుగా ఎందుకు ఎంచుకున్నారో తెలియదు. కృత్రిమ ప్రభంజనాలను చూసుకొని మురిసిపోకుండా పులివెందుల ప్రజలు కూడా ఎందుకు తనకు అడ్డం తిరుగుతున్నారో తెలుసుకొనే ప్రయత్నం చేస్తే మంచిది. అంతేగానీ నేను చేశానని నువ్వు కూడా చేస్తావా? నువ్వు నరకానికి పోతావు! అని పిల్లి శాపనార్థాలు పెట్టడం నీ బలహీనతను చెప్పకనే చెబుతోంది. మరోవైపు పులివెందుల, ఒంటిమిట్ట విజయంతో తెలుగుదేశం నాయకులు మిడిసిపడకూడదు. 2021లో ఇలా మిడిసిపడిన వైసీపీకి 2024లో ఏం జరిగిందో మరచిపోకూడదు. స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా ఉప ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగానే ఉంటాయి. జగన్‌రెడ్డి ఏలుబడిలో కుప్పం మున్సిపాలిటీని సొంతం చేసుకోలేదా? ప్రజాభిప్రాయం ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ప్రభుత్వం బాగా పనిచేస్తున్నంత కాలం అనుకూలంగానే ఉంటారు. రాజ్యం వీరభోజ్యం అనుకుంటే జనం వెంటనే అడ్డం తిరుగుతారు. ముఖ్యమంత్రి చంద్రబాబును రెచ్చగొట్టినందుకు జగన్‌రెడ్డి అనుభవిస్తున్నారు. తెలుగుదేశం శాసనసభ్యులు, ఇతర నాయకులు జగన్‌రెడ్డికి ప్రస్తుత దుస్థితి ఎందుకు కలిగిందా అని అనుక్షణం గమనంలో ఉంచుకోవాలి. అంతేగానీ, పులివెందులనే కొట్టాం– ఇక మాకు తిరుగు ఉండదని భావిస్తే నడ్డివిరవడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారు. పులివెందుల ఉండి ఉండకపోతే అసలు ఈ ఎన్నికల గురించి చర్చించాల్సిన అవసరమే ఉండేది కాదు. పులివెందుల విజయానికి కారణాలు ఏమిటో తెలుగుదేశం నాయకులకు తెలుసు కనుక వాపును చూసి బలుపు అనుకోవద్దు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలోని నాలుగు జడ్పీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అప్పుడు 'కుప్పంలో కూలిన చంద్రబాబు కోట' అంటూ సంబరాలు చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుకు 30 వేల మెజారిటీ మాత్రమే లభించగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి లభించిన ఓట్లు 60 వేలు అధికమని, దీన్నిబట్టి చంద్రబాబు ఓడినట్టేనని లెక్కలు కట్టి జబ్బలు చరుచుకున్నారు. ఈ లెక్కలను జగన్ రోత మీడియా ఆనందంగా అచ్చు వేసింది. సీన్ కట్ చేస్తే 2024లో చంద్రబాబుకు 40 వేల ఓట్ల మెజారిటీ లభించింది. అది కూడా ఆయనను ఓడించడానికి ఓటుకు ఐదు వేల రూపాయల వంతున పంచి భారీ స్థాయిలో అధికార దుర్వినియోగానికి పాల్పడిన తర్వాత! నాటి వైసీపీ రోత మీడియా లెక్కల ప్రకారం ఇప్పుడు పులివెందులలో జగన్ ఓడిపోబోతున్నారని చెప్పవచ్చు. నిజానికి ఇవన్నీ కాకి లెక్కలు. నాడు జగన్‌రెడ్డి వద్ద డబ్బుతో పాటు అధికారం ఉంది. తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలను లోబరుచుకున్నారు. ఇప్పుడు కూటమి వద్ద అధికారం, డబ్బు ఉంది. అందుకే పులివెందులలో జగన్ సొంత మనుషులు కూడా అమ్ముడుపోయారు లేదా అధికారానికి లొంగిపోయారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి కూడా అధికారం లేకపోతే ఏమీ చేయలేరని రుజువైంది. అయితే సాధారణ ఎన్నికల్లో డబ్బు, అధికారం ప్రభావం నామమాత్రమే. ప్రజలు కాదనుకుంటే ఎంత అధికారం, డబ్బు ఉన్నప్పటికీ విజయాన్ని అందుకోలేరని అనేక సాధారణ ఎన్నికల్లో రుజువైంది. ప్రజల అండ లేకపోతే పులులు పిల్లులవుతాయి. నాడు కుప్పంలో తమకు జరిగిన పరాభవానికి ఇప్పుడు చంద్రబాబు ప్రతీకారం తీర్చుకున్నారనడంలో తప్పు లేదు. గతంలో కుప్పంలో ఏం జరిగిందో ఇప్పుడు పులివెందులలో అదే జరిగిందని సరిపెట్టుకుంటే ఏ గొడవా ఉండదు. ఎన్నికల్లో అక్రమాలు చోటుచేసుకోవడం ఇవాళ కొత్త కాదు. ఓటర్ల జాబితాలు తారుమారవుతాయి. అధికారంలో ఉన్నవారికి ప్రభుత్వ యంత్రాంగం ఊడిగం చేస్తుంది. తాను నియమించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని తనను ఆదుకోలేదని జగన్‌రెడ్డి ఆవేదన చెంది లాభం లేదు. నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా!

19న ఏం తేలుతుందో?

జాతీయ స్థాయిలో ఓట్ల తొలగింపు వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బిహార్ అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కమిషన్ అక్కడ 65 లక్షల ఓట్లను తొలగించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ ఆరోపణలకు బలం చేకూర్చే ఉదంతాలను ఇండియా కూటమి ముందు ఉంచి వారి మద్దతు కూడగట్టడంలో రాహుల్‌గాంధీ సఫలీకృతులయ్యారు. ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలో ర్యాలీ కూడా నిర్వహించారు. చివరికి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఓట్ల తొలగింపు అంశాన్ని తీవ్ర అంశంగా పరిగణించిన సుప్రీంకోర్టు మొత్తం తొలగించిన 65 లక్షల ఓట్ల వివరాలను ఈ నెల 19లోపు ఎన్నికల కమిషన్ ప్రకటించాలని గురువారం నాడు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాహుల్‌గాంధీ ఆరోపణల్లో పస ఉందా? లేదా? ఎన్నికల కమిషన్ నిజంగానే ఏదో ఒక పార్టీకి మేలు చేయడానికే భారీ స్థాయిలో ఓట్లను తొలగించినదీ లేనిదీ కూడా స్పష్టమవుతుంది. ఎన్నికల కమిషన్ తప్పు చేసినట్టు ఈ నెల 19 తర్వాత రుజువైతే రాహుల్‌గాంధీ ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ పాతాళానికి పడిపోతుంది. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు దారి తప్పితే దాని ప్రభావం తృతీయ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని చెప్పుకొనే భారత్‌పై పడుతుంది. ఎన్నికల వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లితే దేశంలో అరాచక పరిస్థితులు నెలకొంటాయి. మనకూ పాకిస్థాన్‌కూ పెద్ద తేడా ఉండబోదు. న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠ కూడా ఈ మధ్య మసకబారుతోంది. గురువారం నాటి ఆదేశాలతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. ఎన్నికల కమిషన్ నిజంగా తప్పు చేస్తే దాన్ని సరిదిద్దే బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. మిగతా వ్యవస్థలు పతనమైనప్పుడు న్యాయ వ్యవస్థపై ఆశలు పెట్టుకోవడంలో తప్పులేదుగా? బిహార్‌లో తొలగించిన 65 లక్షల ఓట్లు అక్కడి ఫలితాన్ని తారుమారు చేస్తాయి. తొలగింపునకు గురైన ఓటర్లు అందరూ అనర్హులే అయితే ఏ పేచీ ఉండదు. ఎన్నికల కమిషన్‌ను అభినందించవచ్చు. అలా కాకుండా ఏదైనా తిరకాసు జరిగి ఉంటే దాని ప్రభావం ఎన్డీయే ప్రభుత్వంపై కూడా పడుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సంబంధం ఉన్నా లేకపోయినా తప్పు జరిగి ఉంటే ప్రభుత్వమే ఒత్తిడి తెచ్చి ఎన్నికల కమిషన్‌తో తప్పు చేయించిందని ప్రజలు నిర్ధారణకు వస్తారు. అదే జరిగితే ఎన్డీయే కూటమి ఎంతో కొంత మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ అంశంలోనూ తలదూర్చి జగన్‌రెడ్డి తన రాజకీయ అపరిపక్వతను మరోసారి చాటుకున్నారు. రాహుల్‌గాంధీ ఏపీ గురించి మాట్లాడలేదని, రాహుల్– చంద్రబాబు– రేవంత్‌రెడ్డి ముగ్గురూ హాట్‌లైన్‌లో ఉంటారని పొంతనలేని వ్యాఖ్యలు చేసి నవ్వులపాలయ్యారు. మోదీ దయ కోసం పరితపిస్తున్న బేలతనంతో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలయ్యారు. తన మద్దతుదారులే తన రెస్క్యూకు రాని సంకట స్థితిలోకి జగన్ తనను తాను నెట్టుకున్నారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో జయాపజయాలు సహజం. తమకు ఓటమి ఉండకూడదు అని అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా భావించినప్పుడే అక్రమాలు, అరాచకాలకు తెరలేస్తుంది. తర్వాత కాలంలో అవే పార్టీలు బాధితులుగా మిగులుతాయి. ఒకప్పుడు కాంగ్రెస్ చేసిన తప్పులకు ఇప్పుడు ఫలితం అనుభవిస్తోంది. తరాలు మారినా చేసిన పాపం వెంటాడుతూనే ఉంటుంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, ప్రాంతీయ స్థాయిలో జగన్‌రెడ్డి ఇందుకు సజీవ తార్కాణాలు. అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అని పెద్దలు చెప్పారు. మాకు ఈ నీతులు, సుద్దులు అవసరం లేదని ఎవరైనా భావిస్తే ఇవాళ కాకపోయినా రేపైనా ఫలితం అనుభవించాల్సిందే!

దళిత రాజకీయ సాధికారిత ఏదీ?

దేశవ్యాప్తంగా రాజకీయ వేదికలలో దళితుల ఉనికి పెరిగింది. కానీ ఈ కనిపించే ఉనికి, దళిత రాజకీయ అధికార గొంతుగా మారలేదు. చాలా మటుకు రాజకీయ పార్టీలు దళిత నాయకులను నామమాత్ర ప్రాతినిధ్యానికే పరిమితం చేశాయి. ఇంకా చేస్తూనే ఉన్నాయి. ఏ పార్టీలోనూ దళితులు నిర్ణయాత్మక స్థానాల్లో లేరు. ఒకటి అర పార్టీలలో ఉన్నప్పటికీ వారికి నిర్ణయాధికారం ఉండదు, గౌరవం ఉండదు. ఒకవేళ ఏదైనా ప్రత్యేక పరిస్థితిలో ఏదైనా రాజకీయ పార్టీలో దళితుడు నిర్ణయాధికారం కలిగి నిర్ణయాత్మక స్థానంలోకి చేరుకుంటే ఆ నాయకుడికి దళిత స్పృహ కంటే దొరల స్పృహ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితి పార్టీలకే పరిమితం కాకుండా, ఆయా పార్టీలచే ఏర్పడిన ప్రభుత్వాలలో కూడా కొనసాగుతుంది. దళిత అభ్యర్థులు ఎన్నికల్లో సీటు పొందాలన్నా, ఆ తర్వాత గెలవాలన్నా అగ్రకులాల దయాదాక్షిణ్యాలు కావాలి. దీనికి ప్రధాన కారణం దళిత నాయకులను దళితులే ఎన్నుకొనే అవకాశం కోల్పోవటమే, పైగా దళిత నాయకులు ఇతరుల స్వార్థాలకు అనుగుణంగా ఎంపిక చేయబడటమే. దీనివల్ల దళిత సమాజ అభివృద్ధి కోసం పనిచేయాల్సిన దళిత నాయకులు అగ్రకుల నాయకుల ఆశీర్వాదాల కోసం ఆరాటపడాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి నిజాయితీగల దళిత నాయకులను అయోమయ స్థితిలోకి నెట్టివేస్తున్నది. ఇది ప్రస్తుత దళిత రాజకీయ చైతన్యానికి ఒక ముఖ్యమైన పార్శ్వం.

ఇప్పటి దళిత ఉద్యమాలు అంతర్గతంగా, బాహ్యంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దళిత విముక్తి, కుల వ్యవస్థ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాటం వంటి విస్తృత లక్ష్యాలు నేడు చీలికల వల్ల, అంతర్గత విభేదాల వల్ల మరుగునపడిపోయాయి. ఉద్యమంలోని విభజనలు అనేక రకాల పెడధోరణులను ముందుకు తెచ్చింది. పరస్పర విరుద్ధమైన లక్ష్యాలతో, వ్యూహాలతో దళిత ఉద్యమం దాని విప్లవాత్మక తేజస్సును కోల్పోయింది. రాజకీయ అధికార ఆకాంక్షలు కూడా చీలికలకు దారితీశాయి. పార్టీలు పెట్టే ప్రలోభాలతో దళిత నాయకుల మధ్య పోటీ తీవ్రమైంది. ఈ పరిస్థితిలో దళితులు పార్టీలవారీగా వేరైపోయారు.

దళితుల మధ్య ఈ చీలికలు ఒక లోతైన వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. రాజకీయ పార్టీల సిద్ధాంతాలకు, అగ్రకుల నాయకత్వానికి అంకితమై వ్యక్తిగత అభివృద్ధికి, అవకాశాల కోసం ఎదురు చూడటం ఒక వైపు కనిపిస్తుంది. మరోవైపు అశేష దళిత సమాజాలు తాము ఎదుర్కొంటున్న దౌర్భాగ్యం, అన్యాయం, ఆకలి, హింసలపై వ్యక్తం చేస్తున్న నిస్సహాయత, ఆందోళన కనిపిస్తాయి. రిజర్వేషన్ల లబ్ధిదారులైన మధ్యతరగతి దళితులు, దళిత మేధావులు కుల వ్యవస్థ అణచివేతను విస్మరించారు. ప్రాథమిక స్థాయి దళిత జనంలో మార్పును తేవడానికి దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందించటానికి బదులు– రిజర్వేషన్లు, ఉద్యోగాల వంటి పరిమిత లాభాలపై వీరు దృష్టి కేంద్రీకరించారు.

దళిత సమూహాలకి సంయుక్త ప్రతీకలు, భాషాయాసలు, విలువలు లేకపోవడం వివిధ దళిత సమాజాల మధ్య విభేదాలను తీవ్రతరం చేస్తోంది.




పార్లమెంటరీ రాజకీయాలు వ్యక్తిగత గుర్తింపునకు ప్రాధాన్యతనిస్తూ, దళిత జాతి ఉపకులాల మధ్య విభేదాలను ప్రోత్సహించాయి. ఫలితంగా దళితులు తమ పోరాటాల నుంచి వేరై రాజకీయ పార్టీలపై ఆధారపడే స్థితికి చేరుకున్నారు. ఈ పరిణామం దళిత ఉన్నత వర్గాలకు అనుకూలంగా మారి, వ్యక్తిగత స్థాయిలో వారు అధికారాన్ని, సౌకర్యాన్ని పొందే వీలు కల్పించింది. అందువల్ల వారు దళిత సమాజంపై కొనసాగుతున్న వ్యవస్థాపిత అన్యాయాలను ప్రశ్నించటం మానేశారు. అంబేద్కర్‌ను ఒక చిహ్నంగా మారుస్తున్న తీరూ సమస్యాత్మకమే. ఆయన పోరాట చైతన్యాన్ని ఒక విగ్రహంగా మార్చి వేశారు. ఆయన కుల నిర్మూలనా సిద్ధాంతానికున్న విప్లవాత్మక లక్షణాన్ని విగ్రహారాధనగా మార్చివేసారు.

దళిత నాయకత్వ సామర్థ్యాన్ని నిర్మాణంలోని పరిమితులు నిరోధిస్తున్నాయి. ప్రధాన రాజకీయ వ్యవస్థ దళిత నాయకత్వంలోని కొన్ని వర్గాలను తనలో కలుపుకొని, దళిత ఉద్యమ విప్లవాత్మక లక్ష్యాలను నీరుగార్చుతూ, ఉద్యమ స్వతంత్ర పోరాట లక్ష్యాలకన్నా పార్టీ రాజకీయాల మీద ఆధారపడే పరిస్థితిని సృష్టించింది. ఎన్నికల పరిమితులు, పార్టీలతో అనుబంధాలు ఉద్యమాన్ని విభజించి, కలిసికట్టుగా పనిచేసే శక్తిని దెబ్బతీస్తున్నాయి. అంతేగాక, దళిత నాయకత్వం ఎక్కువగా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల రాజకీయాలకు పరిమితమై, వ్యవస్థాపిత అసమానతలను ఎదుర్కొనేలా, విస్తృతమైన సామాజిక–ఆర్థిక మార్పును సాధించేలా దృష్టిని మళ్లించడంలో విఫలమవుతోంది. అణగారిన వర్గాల అభివృద్ధికి అనుకూలంగా రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొందిన మధ్య తరగతి దళిత సముదాయం తరచుగా ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలకు ప్రోత్సాహం ఇవ్వడంలో విఫలమవుతున్నది. ఇది దళిత నాయకత్వానికీ అశేష సామూహిక దళిత జనాభాకి మధ్య విభేదాన్ని పెంచుతున్నది.

దళితులు రాజకీయంగా లెక్కలోకి రావాలంటే, దళిత నాయకత్వం శక్తిమంతమైన రాజకీయ చర్యగా నిలవాలంటే, అది ఎన్నికల పరిమితులను అధిగమించి, ప్రాథమిక స్థాయి దళిత జన ఉద్యమాలను బలోపేతం చేయడం, భావజాల ఐక్యతను పెంపొందించడం, కుల ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను నిర్మించడం అవసరం. అంతేకాక, దళిత కులాల మధ్య – దళిత ఉద్యమాల మధ్య ఐక్యతను పెంపొందించడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, అంబేద్కర్ విప్లవాత్మక దృష్టిని కేవలం ప్రతీకాత్మక గుర్తింపుగా కాకుండా ఒక కార్యాచరణ మార్గంగా మార్చుకోవడం కీలకం. ఈ మార్గంలో మాత్రమే మరింత బలమైన, దృఢమైన దళిత రాజకీయ ఉద్యమాన్ని నిర్మించవచ్చు. ఒక సమగ్ర ప్రణాళిక ద్వారా మాత్రమే దళిత నాయకత్వం వ్యవస్థాపిత అణచివేతను పూర్తిగా విచ్ఛిన్నం చేసి, దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ మార్పును సాధించగలదు.

▪ లెల్లే సురేష్
దళిత కవి, సాంస్కృతిక కార్యకర్త





జేకేసీ రోడ్డులోని గోకుల క్షేత్రంలో గులాబీ పూలతో అభిషేకం చేస్తున్న మహిళలు

- ఉచిత ప్రయాణంపై హర్షం
- ఉచితంతో మహిళలకు ఆర్థిక భరోసా
- జిల్లాలో తొలిరోజు 4,800 జీరో టిక్కెట్ల జారీ
- పథకం అమలుపై నారీమణులు నీరాజనాలు
- ఆర్టీసీ బస్టాండ్లు, బస్సుల్లో మహిళల కోలాహలం

గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికుల కోలాహలం





3 జిల్లాలు.. 882 బస్సులు

గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల్లో మొత్తం 403 బస్సులు ఉండగా అందులో 302 మహిళలు ఉచితంగా ప్రయాణించే సర్వీసులు ఉన్నాయి. ఇందులో 241 పల్లెవెలుగు బస్సులుండగా, 53 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. ఇక బాపట్ల జిల్లాలో 260 బస్సులకు 220 సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 439 బస్సులు ఉండగా స్త్రీ శక్తికి అర్హత కలిగిన బస్సులు 360 అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

స్త్రీశక్తికి.. సలాం

ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకానికి మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హామీ ఇచ్చినట్లుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం మహిళలు ఎదురు చూస్తున్న క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా శుక్రవారం నుంచి పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పనులకు వెళ్లే వారు.. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లే చిరు వ్యాపారులు.. చిరు ఉద్యోగులు.. దుకాణాల్లో పనులకు వెళ్లే వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆర్థికంగా అండగా మారుతోంది. ప్రభుత్వ పథకాలెన్నో మహిళల పేరుతోనే ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. మహిళల కోసంగా ప్రత్యేకంగా స్త్రీ శక్తికి శ్రీకారం చుట్టడంపై మహిళా లోకంతో పాటు వివిధ వర్గాలు నీరాజనాలు పలుకుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం రైట్ చెప్పడంతో ఆర్టీసీ బస్టాండ్లలో, బస్సుల్లో మహిళల సందడి నెలకొంది. ఆధార్ గుర్తింపు కార్డుతో మహిళలు బస్సులు ఎక్కుతుండగా వారికి ఆర్టీసీ కండక్టర్లు జీరో టిక్కెట్ జారీ చేస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆయా డిపోల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో బస్సుల్లో గమ్య స్థానాలకు చేరుతున్నారు. స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు తమకు ప్రభుత్వం ఇచ్చిన వరంలా భావిస్తున్నారు.

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎప్పడెప్పుడా అని ఎదురు చూసిన ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రారంభంతో శుభకార్యా లకు, సొంతూళ్లకు వెళ్లే వారు ఆనందోత్సాహాలతో ప్రయాణం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకానికి నారీమ ణులు నీరాజనాలు పలుకుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళలు సంబరాలు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు కీలకమైన ఉచిత ప్రయాణం అమలుతో వారు శభాష్ చంద్రన్న అంటూ పాలకులపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పథకాన్ని ప్రారంభించగా శనివారం సెలవు రోజు కావడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో కిటకిటలాడాయి. ఈ పథకానికి మహిళల నుంచి ఊహించనంతగా స్పందన కనిపిస్తోంది. సాధారణంగా బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య ఈ పథకంతో పెరుగుతుందని (మిగతా 6లో)

- గుంటూరు జిల్లాలో శుక్రవారం పథకాన్ని ప్రారం భించిన తొలి రోజు 4800 మంది మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకున్నా రని ఆర్టీసీ అధికారులు తెలిపారు.
- పల్నాడు జిల్లాలో శుక్రవారం పథకాన్ని ప్రారంభించిన తొలి మూడు గంటల్లోనే 5,293 మంది అతివలు ఉచిత ప్రయాణం ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు. మహిళలు ప్రయాణించిన టిక్కెట్ల విలువ 2,00,900 అని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి అజితకుమారి తెలిపారు.
- బాపట్ల జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి స్త్రీశక్తి పథకం అందుబాటులోకి రాగా 4,200 మంది మహిళలు జీరో టిక్కెట్ ద్వారా ప్రయాణం చేసినట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు. శనివారంతో కలుపుకుంటే ఈ సంఖ్య 24,000 వరకు ఉండొచ్చనే అంచనా వేశారు.

స్త్రీశక్తితో సంతోషం



గుంటూరు నుంచి సత్తెనపల్లికి వివాహానికి వెళుతున్నాం. ఈ పథకం ప్రారంభం మహిళలకు సంతోషం కలిగిస్తోంది. ఎంతోమందికి స్త్రీ శక్తి పథకం ద్వారా మేలు జరుగుతోంది. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉంది. సూపర్ సిక్స్‌లో చెప్పినట్లుగా చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించారు. చంద్రబాబునాయుడుకు మహిళలందరి తరపున కృతజ్ఞతలు.

- వై పద్మావతి, గుంటూరు

ఆర్థిక భరోసా



గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్నాం. జీరో టిక్కెట్‌తో పల్లెవెలుగు బస్సులో ఉచితంగా ప్రయాణించడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం చాలా ఆనందంగా ఉంది. ఈ పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. ఉచిత ప్రయాణ అవకాశం కల్పించినం దుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- దుర్గ, గుంటూరు

హే కృష్ణా ముకుందా.. మురారి

జిల్లాలో అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు



ఏటి అగ్రహారం ఇస్కాన్ టెంపుల్లో రాధాగోవిందుని విశేషాలంకారం

హే కృష్ణా ముకుందా.. మురారి.. అంటూ జిల్లావ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. విష్ణాలయాలు, కృష్ణ మందిరాలతో పాటు ఇస్కాన్ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణ నామంతో భక్తులు పులకరించారు. స్వామి వారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల్లో వివిధ సంస్థల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి-బాల గోకులం కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థుల కోలాట బృంద నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన రాధా, కృష్ణులు, గోపికల నృత్య రూపకం ఆబాల గోపాలాన్ని ఆకట్టుకుంది. వాడవాడల్లో యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పోటీల్లో పాల్గొన్నారు. విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధా గోవిందుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు.

- (గుంటూరు - ఆంధ్రజ్యోతి)

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో.. రూ.10 లక్షలు మోసం

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.10 లక్షలు మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం చీటింగ్ కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మోర్ల కల్యాణి, మోహన వీరభద్రం, సుధాకర్, నీలిమారెడ్డి అనే నలుగురు అరండల్‌డల్‌పేట నాలుగో లేన్‌లో కార్యాలయం అద్దెకు తీసుకుని అనధికారికంగా ఆన్‌లైన్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే నాలుగు శాతం కమీషన్ ఇస్తామంటూ ఆశ కల్పించారు. దీంతో గోరంట్లకు చెందిన దొరడ్ల ప్రభావతి అనే మహిళ పది లక్షలు పెట్టుబడి పెట్టారు. రూ.9.50 లక్షలు కల్యాణి ఖాతాకు, మిగిలిన 50 వేలు నేరుగా వారికి నగదు అందజేసినట్లు బాధితురాలు తెలిపారు. నగదును ఎందులో పెట్టుబడి పెడుతున్నారనే విషయం చెప్పకుండా దాచడం, ట్రేడింగ్‌కు సంబంధించిన ఆధారాలు ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరాట యోధుడు గౌతు లచ్చన్న

నివాళులర్పించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ వీరుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు, ప్రజా సేవకుడు అని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా పోలీస్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం జిల్లా తాతిపూడిలో సామాన్య కుటుంబంలో జన్మించిన లచ్చన్న చిన్న వయసులోనే జాతీయోద్యమంలో అమూల్యమైన సేవలందించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పలు సార్లు మంత్రిగా పనిచేసి రైతులు, పేదలు, వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారన్నారు. ప్రజాసేవలో ఆయన చూపిన నిజాయితీ, త్యాగం, అంకితభావం కారణంగానే 'సర్దార్' అనే బిరుదు పొందారన్నారు. ఆయన చూపిన మార్గం నేటితరానికి ప్రేరణగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, సీఐలు బిలాలుద్దీన్, నిస్సార్‌బాషా, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు



పోలీస్ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

శ్రీకృష్ణుడి బోధనలతో సన్మార్గం

కృష్ణాష్టమి పూజల్లో మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి బోధనలు సన్మార్గంలో నడుపుతాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. నాజరుపేటలో శ్రీకృష్ణ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ, మోక్షం అంటే మనతో సహా అన్ని జీవులలో పరమాత్మను చూడటమేనన్నారు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను వదిలి పెట్టడమేనన్నారు. మనిషిగా మనం ధర్మాన్ని పాటించాలని భగవద్గీతలో పరమాత్మ బోధించారన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోశాలలో గోవులకు పశుగ్రాసం అందించారు.



అన్నదానం చేస్తున్న మంత్రి మనోహర్



భార్యాభర్తల మధ్య 'ఫోన్' చిచ్చు!

గుంటూరులో ఇద్దరు బిడ్డల్ని చంపి.. తండ్రి ఆత్మహత్య 2

రోజువారీ కూలీ.. ఏడుగురికి ప్రాణదాత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తెనాలి వాసి కంచర్ల సుబ్బరాజు



12

అన్నదాత సుఖీభవకు మరో అవకాశం 6

తిరుగు ప్రయాణానికి తిప్పలు

- చెన్నై మార్గంలోని రైళ్ల మళ్లింపు
- 18, 19, 20 తేదీల్లో కాజీపేట, విజయవాడ మీదుగా డైవర్షన్ 8

పేదల బియ్యానికి కన్నం

- దోపిడీ కేంద్రాలుగా ఎంఎల్ఎస్ పాయింట్లు
- మాఫియాతో చేతులు కలిపి అధికారుల అడ్డగోలు దోపిడీ
- బస్తాకు 4 కిలోల కోత.. ఒక్కో షాపునకు అర టన్ను తగ్గుదల

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం వివిధ రూపాల్లో మాయమై పెద్ద ల జేబులను నింపుతోంది. కార్డుదారులకు బియ్యం ఇవ్వ కుండా డీలర్లు అమ్ముకోవడం ఒక ఎత్తు కాగా అసలు డీలర్ల వద్దకు చేరే సమయంలోనే బియ్యానికి అధికారులే కన్నం వేయడం గమనార్హం. ఎంఎల్ఎస్ పాయింట్లే కేంద్రాలుగా అక్రమాల విషయం కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు తెలిసినా ఎవరూ నోరు మెదపకపోవడం విశేషం. ఎంఎల్ఎస్ పాయింటులో ఒక్కో బస్తాకు 2 నుంచి 5 కిలోల మేర బియ్యం తగ్గిపోతోంది. అలా తగ్గించిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ కేంద్రంలోని అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా బొక్కేస్తున్నారు. ప్రతీ నెలా ఒక్కో రేషన్ షాపునకు పది టన్నుల బియ్యం సరఫరా అవుతుండగా అందులో సగటున 5 శాతం బియ్యం మాయం అవుతోంది. ప్రభుత్వ నిబం ధనల ప్రకారం రేషన్ షాపునకు సరఫరా చేసే బియ్యం బస్తా ఒక్కొక్కటి 50 కిలోల 580 గ్రాములు ఉండాలి. సంచి బరువు 580 గ్రాములు ఉండగా, 50 కిలోల బియ్యం సంచిలో ఉండాలి. అయితే రేషన్ షాపులకు వెళ్లే బియ్యం సంచి 45 నుంచి 48 కిలోలు మాత్రమే ఉంటోంది.

దిక్కుతోచని రేషన్ డీలర్లు

పౌర సరఫరాల శాఖకు ప్రతి నెలా డీలర్లు రేషన్ ఇండెంట్ ఇస్తారు. ఆ ఇండెంట్ ప్రకారం ఎంఎల్ఎస్ పాయింటు నుంచి ఆయా షాపులకు ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా సరుకులను సరఫరా చేస్తుంది. అయితే ఇక్కడ తూకంలో తేడాను డీలర్లు గుర్తించి ప్రశ్నించినా వారిని అధికారులు భయపెట్టో, మభ్యపెట్టో నోరు మూయిస్తున్నారు. ఇలా ఒక్కో ఎంఎల్ఎస్ పాయింటు పరిధిలో ప్రతి నెలా వంద నుంచి 200 టన్నుల మేర బియ్యం మాయమవుతోంది. ఇదే అవకాశంగా తూకంలో మోసంతో డీలర్లు కూడా పేదల బియ్యాన్ని కాజేస్తున్నారు. ఇలా అన్ని దశల్లో దోపిడీ సాగుతుండడంతో పేదలకు దక్కాల్సిన బియ్యం వారికి దక్కకుండా పోతోంది.



గుంటూరు ఎంఎల్ఎస్ పాయింటు పరిధిలోని రేషన్ షాపులో 45.68 కిలోల బియ్యం బస్తా

ఒకవైపే ప్రయాణం

- ప్రమాదాలతో వాహన చోదకుల ఇక్కట్లు
- అంకిరెడ్డిపాలెం చెరువు వద్ద డివైడర్‌కు ఒకవైపే రోడ్డు



అంకిరెడ్డిపాలెం చెరువు వద్ద డివైడర్‌కు ఒక వైపు నిర్మించిన రోడ్డు

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో చెరువు పక్కన మెయిన్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. చెరువుని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసి దాని పక్కనే సెంట్రల్ డివైడర్‌తో నిర్మాణం తలపెట్టిన ప్రధాన రహదారిని సగం నిర్మించి వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులు 14 నెలలుగా పునఃప్రారంభం కాలేదు. దీంతో అంకిరెడ్డిపాలెం బస్టాప్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వచ్చే మార్గంలో డివైడర్‌కు ఒకవైపునే వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోన్నది. దీంతో ఈ మార్గంలో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్‌కు రెండో వైపున మెటల్‌తో రోడ్డు నిర్మాణం చాలావరకు చేశారు. ఇక హాట్‌మిక్స్ వేసి చదును చేస్తే సరిపోతుంది. అలానే డివైడర్ మధ్య రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని పక్కకు మారిస్తే కీలకమైన రోడ్డు అందుబాటులోకి వస్తుంది. అయితే అటు అధికారులు, ఇటు పాలకులు ఈ రోడ్డు పట్టించుకోకపోతుండటంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.నగర మేయర్, కమిషనర్ తక్షణమే తమ గ్రామాన్ని సందర్శించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డివైడర్‌కు రెండో వైపున రోడ్డును నిర్మించకుండా, ట్రాన్స్‌ఫార్మర్ తొలగించకుండా వదిలేసిన కార్పొరేషన్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేట, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఉప్పలపాటి చెన్నకేశవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామ మాత్రపు ఫీజుతో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) దూర విద్యను చదువుకోవచ్చునని, రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమైన ఈ విద్యను వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి 14 ఏళ్ల వయస్సు నిండిన అభ్యర్థులు పదో తరగతిలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 94922 48937 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

అన్నదాత సుఖీభవకు మరో అవకాశం

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాల వల్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ కాని వారికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. అర్హత ఉండి కూడా పథకం వర్తించకపోతే అర్జీలు స్వీకరించేందుకు అవకాశం కల్పించింది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ అర్జీలను అందించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు తెలిపారు. ఈ నెల 20 వ తేదీ వరకు అర్జీలు స్వీకరించేలా ప్రభుత్వం గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులో ఉంచిందని వెల్లడించారు. లబ్ధి చేకూరని రైతులు రైతు సేవా కేంద్రాలను వెంటనే సంప్రదించాలని డీ ఏ ఓ తెలిపారు.

ఆసుపత్రుల్లో..

ఆహార సరఫరాకు టెండర్ల ఆహ్వానం

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య చికిత్స నిమిత్తం వచ్చే వారికి, వైద్య సిబ్బంది కి ఆహార సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి తెలిపారు. నరసరావుపేట (200పడకలు), సత్తెనపల్లి (100పడకలు), చిలకలూరిపేట(100 పడకలు), అమరావతి (30పడకలు), గురజాల (30పడకలు) ఆసుపత్రుల కోసం ఈ టెండర్ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హ త కలిగిన వ్యక్తులు, సంస్థలు, స్వయం సహాయక సంఘాల నుంచి నిర్ణీత నమూనాలో సీల్డ్ టెండర్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. టెండర్ నమూనా ఫారం లోనే అన్ని వివరాలు ఉంటాయని, ఈ నెల 18వ నుంచి 23వ తేదీ వరకు టెండర్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 23న సాయంత్రం 5 గంటలకు జాయింట్ కలెక్టర్ సమక్షంలో టెండర్లు ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● రూ.13 లక్షల సొత్తు రికవరీ

రొంపిచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో నామాల మీనా అనే మహిళ ఇంట్లో ఏప్రిల్‌లో జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని రొంపిచర్ల పోలీసులు శనివారం అదుపులో తీసుకున్నారు. గ్రామానికి చెందిన గాలం రాజేష్ అరెస్ట్ చేసి, సుమారు రూ.13 లక్షల మేర సొమ్మును రికవరీ చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. గాలం రాజేష్ వైసీపీ యువజన విభాగంలో పదవిని పొందాడు. ఎస్ఐ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో అతన్ని అరెస్టు చేసి సొత్తును రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిశీలనలో..తిరుమలకు ఉచిత బస్సు ప్రయాణం

● భక్తుల మనోభావాలను దెబ్బతీసిన గత పాలకులు

● అడగకుండా వరాలిచ్చే నాయకుడు సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు మెంబరు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి తదితరులు

రెంటచింతల,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు తిరుమల కొచ్చే భక్తుల మనోభావాలను కల్తీ ఆవు నెయ్యితో దారుణంగా దెబ్బతీసి అపవిత్రం చేశారని ఎమ్మెల్సీ, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి విమర్శించారు. కలియుగదైవమైన వేంకటేశ్వరస్వామి కళ్లు తెరవడంతో పాపాలు చేసిన వారంతా పాతాళలోకానికి పోయారన్నారు. తిరుమల కొండపైకి మహిళా భక్తులకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విషయాన్ని పాలకవర్గం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. అడగకుండా వరాలిచ్చే నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. శనివారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని రెంటచింతలలోని శ్రీకృష్ణదేవాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో వేద పండితులు జంగా కృష్ణమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి ఇచ్చిన హామికి కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక సీఎం చంద్రబాబేనన్నారు.స్త్రీశక్తి పథకంతో మహిళలు ఆనందబాష్పాలు రాలుస్తున్నారని తెలిపారు. ఆస్తి హక్కులో వాటా కల్పించి, ఆర్టీసీలో మహిళా కండక్టర్లకు 1996 అవకాశం కల్పించిందని అప్పటి సీఎం చంద్రబాబు, రవాణ మంత్రి దివంగత హరికృష్ణేనని జంగా గుర్తు చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను నభూతో నభవిష్యతి అనే రీతిలో నిర్వహించబోతున్నామన్నారు.దాదాపు పది వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా పీఏసీ+5ను త్వరలో అందుబాటులోకి తెస్తున్నామని ప్రీమియం బడ్జెట్ వెయిటింగ్ హాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏకీకృత పరిపాలన భవనాన్ని నిర్మించబోతున్నట్లు ప్రకటించారు.”సంక్షేమ నిధికి ఇచ్చిన రూ.6 కోట్లు మొత్తాన్ని ఉద్యోగులకు చెల్లించేందుకు బోర్డు నిర్ణయించిందన్నారు. ఆ సమావేశంలో సైదులు యాదవ్, మాజీ సర్పంచ్ సుంకయ్య, నాగరాజు, ప్రభురాజు యాదవ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, నీలం మల్లయ్య పాల్గొన్నారు.

20 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



20 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

విజయపురిసౌత్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. శనివారం శ్రీశైలం నుంచి 1,99,544 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 20 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.40 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6006, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,516, 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,56,540 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో 1,94,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 40.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఉలిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,86,722 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, ఆరు గేట్ల ద్వారా 1,79,587 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,96,587 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ప్రకాశం బ్యారేజి వద్ద..కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,46,884 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదు అయిందని ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా మొత్తం 50 గేట్లను 6 అడుగులు, 20 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 2,44,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. తూర్పు డెల్టా కాల్వకు 2, 118, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు వదులుతుండగా గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు. దిగువ ప్రాంతాల ప్రజలు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు నదిలోకి వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.

హైకోర్టును ఆశ్రయించిన సీపీఎస్ ఉద్యోగులు

గుంటూరు సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని సీపీఎస్ (కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం) ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రీ బ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పఠాన్ బాజీ ఈ నెల 13న పిటీషన్ దాఖలు చేశారు. 2018 జూలై నుంచి రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు డీఏ, ఏపీజీఎల్ఐ, ఆర్జిత సెలవులు, పీఆర్ సీ బకాయి రూపేణా ప్రభుత్వం సుమారు రూ.6వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం హయాంలో బకాయిలు ఇవ్వకుండా, వాళ్లు దాచుకున్న సొమ్మును కూడా దారి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. సీపీఎస్ ఉద్యోగులు రావాల్సిన బకాయిల కోసం గట్టిగా అడిగిన సందర్భంలో జీఓలు విడుదల చేసి వాటిని అమలు పరచలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొంత సొమ్మును విడుదల చేసినప్పటికీ సీపీఎస్ ఉద్యోగుల బకాయి మాత్రం జమ కాలేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓలు అమలు పరచేలా ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు.

రైతుల అభ్యున్నతికి పాటుబడుతున్న ప్రభుత్వం

●జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు



హరిబాబునాయుడిని సత్కరిస్తున్న అధికారులు, కూటమి శ్రేణులు

తెనాలిరూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని దండుగ కాదు పండుగ చేస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితికి అన్నదాతలను దిగజార్చిందని జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆది నుంచి రైతులకు అవసరమైన అన్ని పనిముట్లు, సాగు సాయం అందిస్తూ అండగా నిలుస్తుందని చెప్పారు. శనివారం మండలంలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో రైతులతో హరిబాబునాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. దెబ్బతిన్న పైర్లలో రైతాంగం తిరిగి సాగు పనులు చేపట్టేందుకు.. సన్నద్ధం కావాలన్నారు. ఆయా గ్రామాల్లోని గోడౌన్‌లను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఏరువులను అందుబాటులో ఉంచామని చెప్పారు. తొలుత గ్రామానికి వచ్చిన హరిబాబు నాయడికి కూటమి శ్రేణులు స్వాగతం పలికి దుశాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆపరేటీవ్ ఆఫీసర్ రామారావు, బిజినెస్ మేనేజర్ శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్త్రీశక్తికి.. సలాం

(5వ పేజీ తరువాయి)

ఊహించిన ప్రభుత్వం అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంతరాలు లేకుండా మహిళల ఉచిత ప్రయాణం సాఫీగా జరిగింది. పథకాన్ని ప్రారంభించిన రెండో రోజు శనివారం ఉదయం నుంచే బస్టాండ్లలో మహిళల సందడి కనిపించింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అత్యధికంగా మహిళా ప్రయాణికులు కనిపించారు. వివాహ శుభకార్యాల కోసమని కొందరు, సెలవులతో పుట్టింటికి వెళుతున్నామని మరికొందరు, రోజువారీ పనులకు వెళ్తున్నామని ఇంకొందరు మహిళలు జీరో ఫేర్ టిక్కెట్ తీసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. వరుసగా మూడు రోజులు సెలవులు రోజులు కావడంతో సోమవారం నుంచి బస్సుల్లో మహిళల రద్దీ పెరుగుతుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. ఇందుకు తగ్గట్టుగా ముందస్తు చర్యలు చేపట్టనుంది. ఈ పథకం అమలు చేయడం వల్ల నెలకు రూ.2,000 నుంచి 2,500 వరకు మిగిలినట్లేనని చిరు ఉద్యోగులు, వివిధ పనుల కోసం ప్రయాణాలు చేసే మహిళలు తెలిపారు. ఈ మిగుల మొత్తాలను తాము ఇతర కుటుంబ అవసరాలకు వినియోగించుకునే అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం వల్ల భద్రత కూడా ఎక్కువగా ఉంటుందని మహిళలు చెబుతున్నారు. స్త్రీశక్తితో ఆర్టీసీలో ప్రయాణించే మహిళల సంఖ్య 20 నుంచి 30 శాతం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఉచిత ప్రయాణానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది.

అదుపుతప్పి..కాల్వలోకి దూసుకెళ్లి

కర్లపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం గణపవరం రోడ్డులో వాహనం శనివారం అదుపుతప్పింది. పాతూరు వంతెన వద్ద మహీంద్ర థార్ వాహనం ఇసుక చానల్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేనందున తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎవరైతే ధర్మాన్ని అనుసరిస్తారో వారు నిజంగా శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహాన్ని పొందుతారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తాడేపల్లి మెయిన్ రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లి మందిరంలో దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మం కోసం ఆలోచించాలని, ధర్మంలో మానవత్వం న్యాయం ఉందన్నారు. అనంతరం జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులుతో కలిసి శ్రీనివాసరావు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 6వేల మంది అన్నదానంలో పాల్గొన్నారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, దానబోయిన సుందరరావుయాదవ్, ఏపీ టూరిజం డిపార్టుమెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉంటే విజయాలు సాధ్యం

● హాస్టల్లో జర్మన్ లాంగ్వేజ్ తరగతులను ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

● హాజరైన సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విజన్ ఉంటే విద్యార్థులు విజయాలు సాధించవచ్చని, ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి నాయక్ అన్నారు. స్థానిక కోడిగుడ్డు సత్రంలోని ఎస్సీ ఇంటి గ్రేటెడ్ హాస్టల్లో శనివారం జర్మన్ భాషా తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి మేయర్ కోవెలమూడి నాని, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రధానమని, సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కోడిగుడ్డు సత్రంలో ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో 400 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం ఉందన్నారు. జర్మన్ లాంగ్వేజ్ శిక్షణకు 42 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరిలో ఒకరిని విదేశాలకు పంపించేందుకు పీ-4 కార్యక్రమం ద్వారా తాను దత్తత తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో స్కిల్ కమ్యూనికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయడంతో పారంభమైందని తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. తాను ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి సంబంధించిన ఫైల్‌ను సీఎం చంద్రబాబు వద్దకు తీసుకొని వెళ్లానని తెలిపారు. రూ.1.80 కోట్ల నిధులు విడుదల చేయడంతో హాస్టల్ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి, డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, స్కిల్ కమ్యూనికేషన్ ఈడీ మనోహర్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

విద్యతోనే అసమానతలు లేని సమాజం

● రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజం ఏర్పడాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. స్థానిక గోరంట్ల, శ్రీరఘుపతి వెంకటరత్నం నాయుడు కాపు విద్యార్థి వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు ప్రశంసనీయమన్నారు. కాపు విద్యార్థులకు, యువతకు ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలను వినియోగించుకోవాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా సంప్రదించ వచ్చని విద్యార్థులకు సూచించారు. ఇతర జిల్లా లో కూడా పేద కాపు విద్యార్థుల కోసం వసతి గృహలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో వసతి గృహ అధ్యక్షుడు బాలశెట్టి విజయ కుమార్, సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, తెలగ అభ్యుదయ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ పొంగళ్ళ మహోత్సవాలు

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట పోలేరమ్మ తల్లి శ్రావణ మాస పొంగళ్ళ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తొలి రోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా 108 బిందెలతో పంచామృత స్నానాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అమ్మవారికి పల్లకీ సేవ, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. మేళతాళాలతో కనకతప్పట్లు జయ జయహో వంటి నినాదాలతో అమ్మ వారి ఊరేగింపు మహోత్సవం జరిగింది. భక్తులు రథాన్ని ముందుకు లాగేందుకు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఆదివారం పొంగళ్ళతో పాటు జాతర మహోత్సవం, మధ్యాహ్నం అన్న సంతర్పణ, రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చుట్టుగుంట పోలేరమ్మ ఆలయంలో అమ్మవారి ఊరేగింపు

పోలేరమ్మ సేవలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ఆర్ అగ్రహారం పోలేరమ్మ గుడిలో ఆదివారం జరిగిన ప్రత్యేక పూజలు, కొలుపుల కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులతో గుంటూరు ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో లచ్చన్న పాత్ర మరువలేనిది

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో గౌతు లచ్చన్న కీలక పాత్ర పోషించారని, వెనుకబడిన వర్గాల సంక్షేమం, రైతులు, కార్మికుల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగం నేటి తరాలకు స్ఫూర్తి అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ పోరాటయోధుడు : ఎమ్మెల్యే నసీర్



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలను ఎదురించి నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న రైతాంగ పోరాట యోధుడని అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్, సుద్దపల్లి డొంక వద్ద ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న అంటే కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని పేద, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పోరాడిన నాయకుడని తెలిపారు.

ప్రజానేత లచ్చన్న : కోవెలమూడి



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, కేసన తదితరులు

గుంటూరు, కార్పొరేషన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కి అంకిత భావంతో కృషి చేసిన ప్రజానేత గౌతు లచ్చన్న అని నగర మేయర్ కోవెలమూ డి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సంద ర్భంగా నగరంలోని బస్టాండ్ సెంటర్లో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయో ధుడు, నిస్వార్థ రాజకీయ నాయకుడు అని అన్నారు. ఆయన జీవితం నిత్యం పోరాటాలతో ప్రజాసేవకు అంకితమైందన్నారు. భావితరాలు ఆయన పోరాట పటిమ, పేదలపై ఆయన చూపిన సేవానిరతిని స్ఫూర్తిగా తీసుకొని సమాజసేవలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్ర మంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్యదక్షతకు ప్రతీక గౌతు లచ్చన్న : ఆనందబాబు



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యమస్ఫూర్తి, కార్యదక్షత, సాహసానికి ప్రతీక సర్దార్ గౌతు లచ్చన్న అని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. బస్టాండు ఎదుట ఉన్న లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ లచ్చన్న జయంతిని అధికారికంగా జరిపే అవకాశం కూటమి ప్రభుత్వానికి రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ నాయకుల నివాళులు



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు క్రాంతి కుమార్, హనుమంతరావు తదితరులు

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు బీసీల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన సర్ధార్ గౌతు లచ్చన్న ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా బస్టాండ్ ఎదుటనున్న ఆయన విగ్రహానికి శనివారం నాయకులు ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో కోలా అశోక్, కొల్లూరి హనుమంతరావు, యేటి కోటేశ్వరరావు, గౌస్, గురుప్రసాద్ తదితరులున్నారు.

● ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుటనున్న గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, వట్టికూటి సాంబయ్య, ఖాజావలి, తాటికొండ నరసింహరావు, మత్తయ్య, సాంబయ్య, ప్రకాష్ ఉన్నారు.

దార్శనిక నేత.. వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు (తూర్పు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భారత అభివృద్ధి గమనంలో నవశకానికి నాంది పలికిన దార్శనిక నేత అటల్ బిహారీ వాజ్ పేయి అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ లు కొనియాడారు. స్థానిక లాలుపురం, బీజేపీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని వాజ్ పేయి వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. మృదువైన శైలితో అజాతశత్రువుగా వాజ్‌పేయి ఖ్యాతి పొందారని గుర్తుచేసుకు న్నారు. ప్రధాని మంత్రిగా పనిచేసే సమయంలో జాతీయ రహదారి ప్రాజె క్టులు, సార్వత్రిక విద్యా అభియాన్, ప్రధాన్ మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి గొప్ప పథకాలను రూపకల్పన చేశారన్నారు. మహిళా సాధికారత, సామాజిక సమానత్వం, వంటి మౌలిక విలువ లకు అంకితభావం కలిగిన గొప్ప వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. ఆయన సమయస్ఫూర్తిని నేటి తరం రాజకీయ నాయకులు అలవరు చుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీని వాసరెడ్డి, భీమినేని చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాస్, చరక కుమార్‌గౌడ్, డాక్టర్ టీవీ రావు, దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ, సాధు రామకృష్ణ, మేరీ సరోజిని, విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే యానాదుల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల అభ్యున్నతి సాధ్యమవుతుందని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య అన్నారు. స్థానిక మల్లికార్జునపేట, యానాది కాలనీలోని కమ్యూనిటీ హాల్లో జరిగిన యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన జాతుల్లో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు నేటికి అన్ని విధాలా వెనుకబడి ఉన్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బంది పడు తున్న యానాదులకు ఎస్సీ వర్గీకరణ మాదిరిగానే ఎస్టీ వర్గీకరణ చేసి ఉద్యోగ, రిజర్వేషన్ పరంగా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల బ్రహ్మయ్య, అధికార ప్రతినిధి పొన్నూరు అంకమరావు, బాకుల మురళీ, మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి : జంగాల

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి రెండు రోజుల పాటు గుంటూరులో జరిగే సీపీఐ జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కు మార్ పిలుపునిచ్చారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ స్టేడియం నుంచి కొత్తపేట, విజయటాకీస్ వరకు భారీ ర్యాలీ, అనంతరం అక్కడే బహి రంగసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18న మల్లయ్య లింగంభవన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుందని చెప్పారు. ఈ రెండు రోజుల సభల్లో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు సహా పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొనున్నట్లు వెల్లడిం చారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో అకిటి అరుణ్‌కు మార్, కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, షేక్ వలి, జంగాల చైతన్య పాల్గొన్నారు.

కృష్ణ నామం.. స్మరణీయం

● భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



కొత్తపేటలోని గౌడియా మఠంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని నగరంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ నామంతో భక్తులు పులకరించారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తుల కోసం ఆలయ పాలకవర్గ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మందిరాల్లో తెల్లవారుజామున సుప్రభాత సేవ, నవ నీత హారతి, స్వామి వారికి పంచామృత అభిషేకం, నిజరూప దర్శనం, విశేష అలంకరణ, విశేష సంతాన వేణుగోపాల మూలమంత్ర హోమం నిర్వహించారు. అనంతరం స్వామికి అష్టోత్తర సహిత సహస్రనామ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం ఉట్టి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్ట మి పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రథోత్సవం వైభవం గా నిర్వహించారు. ఏటుకూరులో త్రైతా సిద్ధాంత ప్రభోధ సేవ సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కృష్ణ భగవానుడు ఊరేగింపు జరిగింది.



ఏటీ అగ్రహారం, ఇస్కాన్ టెంపుల్లో స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాష్టమి సందర్భంగా శనివారం పాతగుంటూరులో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కృష్ణాష్టమి అనేది భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన పండుగల్లో ఒకటి అని చెప్పారు.

సాయి ఆదిత్యలో....

గుంటూరు (విద్య) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగ్‌రోడ్డులోని సాయి ఆదిత్య స్కూల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యా ర్థులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ మోదేపల్లి రవీంద్రబాబు, సూరే రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సీతామహా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారి

బృందావన్ గార్డెన్స్‌లో...


గుంటూరు (తూర్పు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణమండ పంలో సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి-బాల గోకులం వేడుక గా జరిగింది. తొలుత విద్యార్థులకు కోలాట బృంద నృత్య పోటీ, భాగవతం క్విజ్ వక్తృత్వ పోటీలు, చిత్ర లేఖనం, భగవద్గీత, శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన రాధా కృష్ణులు, గోపికల నృత్య రూపకం ఆబాల గోపాలాన్ని ఆకట్టుకుంది.

ఏపీయూడబ్ల్యూజే నగర కమిటీ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్లో శనివారం ఏపీయూ డబ్ల్యూజే నగర కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా అధ్యక్షత వహించగా, సంఘ రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు యేచూరి శివ, కౌన్సిల్ సభ్యుడు పి.భక్త వత్సలరావు, జిల్లా కార్యదర్శి కె.రాంబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నగర అధ్యక్షుడిగా కొంగర వెంకయ్య, గౌరవాధ్యక్షుడిగా కె.తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా బి.కార్తిక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, సహాయ కార్యదర్శులుగా జి.అప్పారావు, సుజిబాబు, రామ్ భాస్కర్, కోశాధికారిగా షేక్ సుభాని, కార్యవర్గ సభ్యులుగా దూపాటి ప్రకాష్, చెరుకూరి సుబ్బారావు, పి.లూర్థురాజు, వహీద్, రఘునాధరెడ్డి, పి.కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగులకు 20 అవార్డులు

గుంటూరు సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లోని 20 మంది ఉద్యోగులకు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు దక్కాయి. అవార్డులు అందుకున్న వారిలో జిల్లా పరిషత్ ఏవోలు పి.శామ్యూల్ పాల్, వి.చంద్రమోహన్, జూనియర్ అసిస్టెంట్ అత్తోట పృథ్వీ తదితరులు ఉన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థకు కూడా ఉత్తమ ఉద్యోగుల అవార్డులు దక్కాయి. డ్వామా పీడీ సీసీ మల్లెం సునీల్ ప్రకాష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రాజా, ఫీల్డ్ అసిస్టెంట్ విశాలాక్షికి అవార్డులు దక్కాయి.



మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవా ర్డు అందుకుంటున్న డ్వామా పీడీ సీసీ మల్లెం సునీల్ ప్రకాష్

ఎమ్మెల్యే వీడియో కాల్ లీక్ కేసులో నిస్పక్షపాతంగా విచారణ

● కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ వీడియో లీక్ కేసులో నిస్పక్షపాతంగా విచారణ జరుపుతున్నట్లు కొత్తపేట సీఐ ఎం వీరయ్య చౌదరి స్ప ష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బుచ్చయ్యతోటకు చెందిన గుడిపల్లి నవీన్‌కృష్ణ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసామన్నారు. ఈ కేసు ఈస్ట్ డీస్పీ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి నేతృత్వంలో, సాంకేతిక బృందం సహకారంతో కొనసాగుతోందన్నారు. అయితే 15న షేక్ సుఫియా అనే మహిళ మీడియా ముందు పోలీసులపై తాను, తన కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురవుతు న్నారని, తనను కేసులో ఇరికించబోతున్నారంటూ కొన్ని ఆరోపణలు చేసిందన్నారు. ఎవరి మీదా ఎలాంటి బెదిరింపులు, ఇరికించే ప్రయత్నాలు జరగడం లేదని, దర్యాప్తు చట్టపరం గా, నిష్పాక్షికంగా కొనసాగుతోందని, నిజమైన నిందితులను త్వరలోనే గుర్తిస్తామన్నారు.

వైభవంగా శ్రీవెంకయ్య స్వామి ఆరాధన మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, ఒకటో లైన్‌లో కొలువైన శ్రీవెంకయ్య స్వామి వారి 26వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు స్వామికి పంచామృతాభిషేకాలు, అగ్నిగుండ హోమాలు నిర్వహించారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో మూలవిరాట్‌కు విశేష పూజలు జరిగాయి. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్ని శ్రీవెంకయ్య స్వామి భక్త బృందం పర్యవేక్షించారు.



పర్యావరణ హితం.. ప్రతిరూపం

● 19 అడుగుల మట్టి గణనాథుని విగ్రహం

గుంటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గణాధిపతి.. సకల దేవతల సమాహారం. పర్యావరణ హితం. చవితి వేడుకలకు ఆదర్శం ఈ 19 అడుగుల మట్టి గణనాథుడు. విశేషంగా ఆకట్టుకుంటున్న లంబోధరుడి విగ్రహాన్ని చూడగానే ఎవరైనా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసింది అనుకుంటారు. వేడుకలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్న ఉత్సవ కమిటీలు.. మనసు పెడితే ఇలాంటి ప్రకృతి ప్రతిమలను కొలుదీర్చవచ్చు. చూడటానికి రెండు కళ్లు సరిపోని.. ఈ మట్టి గణపతి విగ్రహాన్ని పర్యావరణ హితంగా హైదరాబాదులో తయారు చేయించామని వాసవి యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు తెలిపారు. ఏటుకూరు రోడ్డులోని కార్యాలయంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు నిర్వహించనున్న గణపతి మహోత్సవాల బ్రోచర్లను విడుదల చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట గణపతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆటంకాల మధ్య ఆడేదెలా?

● నిరుపయోగంగా తెనాలి ఇండోర్ స్టేడియం ● ప్రైవేట్ పరం.. క్రీడా విహీనం
● ఆదాయానికే పరిమితమైన శాప్ ● వర్షమొస్తే..మైదానం తటాకమే..



మోకాలి లోతు నీటితో నిండిన మైదానం

తెనాలి క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : తెనాలిలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతోంది. 2013లో రూ.1.50 కోట్లతో నిర్మించిన స్టేడియాన్ని అప్పటి స్పీకర్, నేటి మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. 2017లో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు వాకింగ్ ట్రాక్, గ్రౌండ్ మెరక వంటి పనులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ రూ.2 కోట్లతో పూర్తి చేయించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వాకింగ్ ట్రాక్ లైటింగ్, బిల్డింగ్‌పై హాలు నిర్మాణం, క్రీడాకారుల కోసం 4 రూములు, మున్సిపాలిటీ సహకారంతో అవుట్ డోర్ వెయిట్ లిఫ్టింగ్ పరికరాలు అందించారు. ఈ స్టేడియం ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులను అందించడంతో పాటు పట్టణ ప్రజల ఆదరణ పొందింది. ప్రతిరోజు వివిధ క్రీడల్లో 150 మంది క్రీడాకారులతో పాటు 200 మందికి పైగా వాకర్స్ స్టేడియంను వినియోగించుకుంటున్నారు.

ప్రైవేట్ పరం.. శాపం

అయితే గత ప్రభుత్వం ఈ స్టేడియం ప్రైవేట్ పరం చేయడంతో దాని ఆలనా పాలనా కరువైంది. కోర్టుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. గ్రౌండ్ పూర్తి



ఇండోర్ స్టేడియం

స్థాయిలో మెరక వేయకపోవడంతో వర్షం వస్తే రోజుల తరబడి మోకాలి లోతు నీరు నిల్వ ఉండిపోతున్నాయి. ప్రస్తుతం హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు, ఒక నైట్ వాచ్‌మెన్ అందుబాటులో ఉన్నారు. రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే బాస్కట్‌బాల్ కోర్టు అసంపూర్తిగా మిగిలింది. గతంలో ఇక్కడ వాలీబాల్ కోచ్ అందుబాటులో ఉండేవారు. అతను బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. స్పోర్ట్స్ అథారిటీస్ ఆఫ్ ఏపీ (శాప్) గతలో ఈ స్టేడియంను నెలకు లక్షల రూపాయల వంతున మూడు సంవత్సరాలకు లీజుకు ఇచ్చింది. లీజు ద్వారా శాప్ రూ.40 లక్షల మేర లాభపడింది. ప్రస్తుతం స్టేడియం నిర్వహణకు శాప్ పైసా కూడా విదిలించడం లేదు. దీనితో ఈ ఇండోర్ స్టేడియం అనాథగా మారింది. కనీసం క్రీడా పరికరాల కొనుగోలు, గ్రౌండ్ మరమ్మతులకు గతంలో శాప్ పొందిన రూ.40 లక్షలలో సగం సొమ్ము కేటాయించినా స్టేడియం మెరుగు పడుతుందని ఇక్కడి క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సౌకర్యంగా లేని వాకింగ్ ట్రాక్

చెరువును తలపిస్తున్న కోర్టుల భాగం

ఆటగాళ్లకు చేయూత..

ఆటగాళ్లకు చేయూత నివ్వాలని పట్టణానికి చెందిన పలువురు దాతలు గతంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి వారికి కావాల్సిన ఉచిత వసతి, భోజనం, ప్రత్యేక శిక్షణ ఇప్పించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించడానికి తర్ఫీదు సొంత ఖర్చులతో ఇప్పించారు. ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు తెనాలి పుట్టినిల్లు. ప్రోత్సాహం కరువు కావడంతో అలనాటి కీర్తి మసకబారుతోంది. అగ్గి పెట్టెలాంటి భవంతులు, ఇరుకు ఇరుకు గదుల్లో పాఠాలు చెబుతున్న అనేక ప్రైవేట్ పాఠశాలలో పిల్లలకు ఆటవిడుపు కరువైంది. వ్యాయామ విద్యకు దూరమవుతున్న బాల్యం రాను రాను మానసికంగా, శారీరకంగా దుర్భరమవుతుంది. వాటిని దృష్టిలో ఉంచుకుని అంకిత భావం కలిగిన పాలకులు నిద్రాణ స్థితికి చేరిన తెనాలి ఇండోర్ స్టేడియానికి పునరుజ్జీవం కల్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా కృషి చేయాలని ఈ ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

తిరుగు ప్రయాణానికి తిప్పలు



ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో చెన్నైకి టిక్కెట్లన్నీ బుకింగ్ అయిపోయినట్లుగా డిస్‌ప్లే



ఓ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థ స్లీపర్‌క్లాస్ టిక్కెట్ రూ. 6 వేలకు పైగా చేసిన బుకింగ్ లేఅవుట్

● చెన్నై మార్గంలోని రైళ్ల మళ్లింపు
● 18, 19, 20 తేదీల్లో కాజీపేట, విజయవాడ మీదుగా డైవర్షన్
● సెలవులకు వచ్చి.. ప్రయాణికుల అవస్థలు

గుంటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం చెన్నైకి గుంటూరు/న్యూగుంటూరు మీదగా ప్రయాణించే రైళ్లను చుండూరు వద్ద మూడో రైలు మార్గం పనుల కారణంగా రైల్వే శాఖ దారి మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుంటూరు నుంచి చెన్నై సెంట్రల్‌కి టిక్కెట్ బుకింగ్ చేసుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే నో ట్రైన్ ఫౌండ్ అనే సందేశం ఐఆర్‌సీటీసీలో ప్రత్యక్షమవుతోంది. చెన్నై, జనశతాబ్ధి, సర్కారు ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నప్పటికీ ఇదేమిటని ఆశ్చర్యపోతున్నారు. తీరా వాకబు చేస్తే ఈ మూడు రైళ్లను కాజీపేట, విజయవాడ, తెనాలి మార్గంలో దారి మళ్లించారని తెలిసి మథనపడుతున్నారు. చెన్నైకి ఏపీఎస్ఆర్టీసీ కేవలం ఒకే ఒక్క సూపర్ లగ్జరీ బస్సుని నడుపుతోంది. ప్రైవేటు ట్రావెల్స్ 22 సర్వీసులు ఉన్నప్పటికీ టిక్కెట్ చార్జీ రూ. 2,500 నుంచి రూ. 3,500 వరకు ఉండటంతో బెంబేలెత్తిపోతున్నారు.

సెలవు దినాల్లో వచ్చి..

12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ నిత్యం నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి మీదగా ప్రయాణిస్తుంది. ఈ రైలు ఎంతో అనువుగా ఉంటుంది. రాత్రి వేళ బోర్డింగ్ చేస్తే మరుసటి రోజు వేకువజామునకు చెన్నై సెంట్రల్‌కు చేరుకొంటుంది. ఇందులో టిక్కెట్‌లు లభించకపోతే ప్రత్యామ్నాయంగా జనశతాబ్ధి, సర్కారు, కాత్రా, లక్నో రైళ్ల కోసం చూస్తారు. ఈ రైళ్లను గుంటూరుకు రాకుండా మూడు రోజుల పాటు దారి మళ్లించారు. దీంతో ఈ నెల 15, 16, 17 సెలవుదినాల కోసం గుంటూరుకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం విజయవాడ/తెనాలి వెళ్లి రైలు ఎక్కుదామన్నా ఆదివారం వరకు జనరల్ కోటాతో సహా తత్కాల్, ప్రీమియం తత్కాల కోటా టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి.

రెగ్యులర్, స్పెషల్ బస్సుల్లో టిక్కెట్లు సోల్డ్ అవుట్

చెన్నైకి ఆదివారం డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్‌తో పాటు గుంటూరు డిపో-1 నుంచి ఒకటి, డిపో-2 నుంచి రెండు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. అవి ఇప్పటికే సోల్డ్ అవుట్ అయిపోయాయి. అలానే విజయవాడలో బయలుదేరి ఆటోనగర్ మీదగా వెళ్లిపోయే నాలుగు బస్సులు కూడా బుకింగ్ అయిపోయాయి. ప్రైవేటు ట్రావెల్స్‌లో స్లీపర్ బెర్తులు కొన్ని రూ. 6,199గా నిర్ణయించారు. కొన్ని బస్సుల్లో బెర్తులు ఖాళీలున్నా వాటి చార్జీలు చూస్తే కళ్లు తిరగాల్సిందే. ఈ నేపథ్యంలో ఆర్టీసీ మరికొన్ని స్పెషల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చూడండి ఒకసారి చంద్ర వంక



గుర్రపు డెక్కతో చంద్రవంక నది

● మాచర్లకు పొంచి ఉన్న వరద ముప్పు
● గుర్రపుడెక్క, ముళ్ల కంపతో నీటి ప్రవాహానికి ఆటంకం
● నీరు కనిపించనంతగా కప్పేసిన వైనం
● ఆక్రమణలతో కోల్పోయిన రూపురేఖలు

మాచర్లటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణం గుండా ప్రవహించే చంద్ర వంక ముళ్ల చెట్లతో, గుర్రపుడెక్కలో నిండిపోయింది. దీంతో వరద ప్రవాహానికి ఆటంకంగా మారింది. గత అనుభవాల దృష్ట్యా మాచర్ల పట్టణానికి వరద ముప్పు పొంచి ఉంది. ఏళ్ల తరబడి చంద్రవంక నది ఆధునికీకరణ నోచుకోకపోవడం వల్ల వర్షాకాలంలో వరద ప్రవాహం ముంచెత్తి పట్టణ ప్రజలపై విరుచుకుపడుతోంది. దీంతో తీవ్ర ఆస్తినష్టం జరిగిన ఘటనలు చాలా ఉన్నాయి. 1964లో వరద ప్రవాహానికి.. ప్రాణ, ఆస్థి నష్టం, మూగజీవాలు కోల్పోయిన ఘటన ఇప్పటికీ ఎవరూ మరిచిపోలేదు. ఆ తదుపరి 2016, 2018, 2023లో వరద ప్రవాహానికి పట్టణంలో ఆస్తినష్టం బాగా జరిగింది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరంతా చంద్రవంక నదికి చేరి మాచర్ల పట్టణం గుండానే ఎత్తిపోతలకు చేరాల్సి ఉంది. ఈ తరుణంలో వరద ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉంటే పట్టణానికి నష్టం జరగకుండా ఉంటుంది.



రూపురేఖలు కోల్పోయిన చంద్రవంక

కాల క్రమంలో చంద్రవంక ఆక్రమణలకు గురై రూపురేఖలను కోల్పోయింది. నదికి ఇరువైపులా ఇటుకబట్టీలు, నివాసాలు, కల్వర్టులు, లోచప్టాలు, బ్రిడ్జిలు వంటివి ఏర్పాటు చేయడం వల్ల సహజత్వం కోల్పోయి వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. దీనికితోడు ఇరువైపులా బండ్స్ సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో వరద వచ్చినప్పుడు పట్టణ ప్రజలు బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితి నెలకొంది. వెల్దుర్తి మండలంలో పట్లవీడు చెరువు, బ్రహ్మనాయుడు చెరువు, బోదలవీడు చెరువు, దుర్గి మండలం ఆత్మకూరు చెరువు నిండిన తరువాత అకస్మాత్తుగా గండి పడితే ఆ వరద నీరంతా చంద్రవంక ద్వారా మాచర్ల పట్టణం గుండా ఎత్తిపోతల ద్వారా కృష్ణానదికి చేరాల్సి ఉంటుంది. ఈ తరుణంలో వరద ఉధృతి పెరిగి పట్టణంపై విరుచుకుపడ్డ సంఘటనలు గత అనుభవాలు ఎన్నో ఉన్నాయి. చంద్రవంక నది పరివాహక ప్రాంతంలో ముళ్ల పొదలను, గుర్రపుడెక్కను తొలగించి బండ్స్‌ను పునరుద్దరిస్తే వరద ముప్పు నుంచి బయటపడవచ్చు.

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి



నాగార్జున కొండను సందర్శించి వస్తున్న పర్యాటకులు

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.1,78,450

విజయపురిసౌత్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం వస్తుండడంతో సాగర్‌కు శనివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. నాగార్జున కొండకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కేరింతలు కొడుతూ లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం వీక్షించారు. అలాగే అనుపులోని యాంపీ థియేటర్, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి దేవాలయం, అనంతరం 60 అడుగుల ఎత్తునుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ. 1,78,450 ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

బాలికా విద్యకు భరోసా

● అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు
● కేజీబీవీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

సత్తెనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్య కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలను వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. జూనియర్ కళాశాల స్థాయికి.. అప్‌గ్రేడ్ చేసినా వసతులను మాత్రం పట్టించు కోలేదు. నాడు - నేడులో భాగంగా నిధులు కేటాయించిన బిల్లులు చెల్లించక పోవటంతో పనులు నిలిచి పోయాయి. తాజాగా వాటిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. కేజీబీవీల్లో డార్మెంటరీతో పాటు అదనపు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోంది. జిల్లాలో ఉన్న 24 కేజీబీవీలు ఉన్నాయి. వాటిలోని సగానికిపైగా అదనపు భవనాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాల నిర్మాణాలు.. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మిగతా కేజీబీవీల్లో వచ్చే విద్యా సంవత్సరంలో అదనపు గదులతో పాటు డార్మిటరీలు ఏర్పాటు చేయనున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి విద్యార్థినులకు వసతి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా అధికారులు పనులు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఒక్కో తరగతిలో సగటున 40 సీట్ల వరకు ఉంటాయి. అన్ని కేజీబీవీల్లో అడ్మిషన్‌లు జరిగాయి. ప్రతి కేజీబీవీలో ఆరు డార్మిటరీ గదులు, రెండేసి మరుగు దొడ్ల బ్లాక్‌లు నిర్మించనున్నారు. ప్రధానంగా విద్యార్థినిలకు వసతి సమస్య లేకుండా చేయటమే ప్రభుత్వ లక్ష్యం. ఇతర మౌలిక సదుపాయలు కూడా కల్పించనుంది. ఎంపిక చేసిన కేజీబీవీల్లో రూ.18.5 లక్షల వ్యయంతో కంప్యూటర్ ల్యాబ్, రూ.23.10 లక్షలతో గ్రంథాలయం, రూ.18.05 లక్షలతో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ గది నిర్మించనున్నారు. చిన్న చిన్న మరమ్మతులు కూడా చేయించనున్నారు. దీని వల్ల బాలికల విద్యకు మరింత భరోసా లభించనుంది.



కేజీబీవీలో చదువుతున్న బాలికలు

అనారోగ్య కేంద్రం

● ప్రారంభం కాకముందే నీరు కారుతున్న భవనం
● గత ప్రభుత్వంలో గుత్తేదారు నిర్వాకం
● ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చినుకుపడితే చిత్తడి

ప్రత్తిపాడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం.. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని చందంలా తయారైంది. హాస్పిల్ భవన నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోలేదు. కానీ, చినుకు పడితే నీరు కారుతూ వైద్యశాల చిత్తడిగా మారుతోంది. గత ప్రభుత్వంలో ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం జరిగింది. నిధులు విడుదల చేయక పోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశాడు. కొద్ది పాటి వర్షానికే బిల్డింగ్ జాయింట్స్ నుంచి నీరు విపరీతంగా వైద్యశాలలోకి వస్తోంది. పైన సింగిల్ స్లేర్ ఉన్నప్పటికీ లోపల గదిలోనికి విపరీతంగా నీరు కారుతోంది. కొత్త బిల్డింగ్‌తోపాటు పాత బిల్డింగ్‌లోనూ నీరు కారుతుండటంతో కొంత వరకు బకెట్లు పెట్టి నీరు పడుతున్నారు. ఎక్సరే రూమ్‌తో పాటు మరి కొన్ని రూమ్‌లు నీటితో నిండి పోతున్నాయి. దీంతో అటు వైద్య సిబ్బందితో పాటు వచ్చే రోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా కొత్త బిల్డింగ్‌లో కొన్ని లోపలి గది గోడల నుంచి చెమ్మ దిగుతూ లేబరేటరీ గదిలోనికి వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే వైద్య సిబ్బంది అనేక మార్లు ఫిర్యాదులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది.



ఆరోగ్య కేంద్రంలో జాయింట్స్ వద్ద కారుతున్న నీరు



లేబరేటరీ రూమ్ గోడ నుండి వస్తున్న చెమ్మ



ఎక్సరే గదిలోపలికి చేరిన వర్షపు నీరు



జాయింట్స్ వద్ద నీరు కారుతున్న దృశ్యం

ఢిల్లీ ఎన్‌సిఆర్ వీధుల నుంచి వీధి కుక్కలను తొలగించి షెల్టర్‌కు పంపించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పలు విమర్శలు, వాదనలకు తెర లేపిన విషయం అందరికీ తెలిసిందే! నిజానికి వీధి కుక్కలను పెంపుడు కుక్కలుగా ఆదరించినప్పుడు ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు తక్కువ. ఈ దిశగా ఆలోచించి వాటిని అక్కున చేర్చుకున్న కొందరు ప్రముఖుల గురించి తెలుసుకుందాం!

వీరికి ప్రేమ ఎక్కువే!



రతన్ టాటా

దివంగత పారిశ్రామికవేత్త రతన్ టాటా, వీధి కుక్కలను ఆదరించడమే కాకుండా, వాటి సంరక్షణ, పునరావాస కార్యక్రమాలు కూడా చేపట్టారు. తన పెంపుడు కుక్కను జీవితాంతం జాగ్రత్తగా చూసుకోవాలని తన వీలునామాలో కూడా రాసుకున్నారాయన. జంతువుల ఆస్పత్రి, ఆశ్రయాలను స్థాపించి, విలాసవంతమైన తన తాజ్ హోటల్‌లో ప్రత్యేకమైన ప్రవేశాన్ని కూడా కల్పించారు. గతంలో రతన్ టాటా గోవాలో పర్యటిస్తున్నప్పుడు, ఒక వీధి కుక్క తననే వెంబడిస్తూ ఉండడాన్ని గమనించి, దాన్ని వెంట తెచ్చుకుని 'గోవా' అనే పేరుతో ప్రేమగా పెంచుకున్నారు.

హృతిక్ రోషన్

ఈ బాలీవుడ్ నటుడు 2022లో 'మోగ్లి' అనే వీధి కుక్కను దత్తత తీసుకున్నారు. ముంబయి వీధుల్లో కారు కింద కనిపించిన ఈ వీధి కుక్కను ఒక వ్యక్తి కాపాడినప్పుడు, అతన్నుంచి దాన్ని హృతిక్ దత్తత తీసుకున్నారు.



జాన్ అబ్రహామ్

బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహామ్‌కు 'బెయిలీ అబ్రహామ్' (తల్లి కుక్క), 'సియా అబ్రహామ్' (కుక్క పిల్ల) అనే రెండు వీధి కుక్కలున్నాయి. జంతు ప్రేమికుడైన జాన్ అబ్రహామ్, లాభాపేక్షలేని జంతు హక్కుల సంస్థ పెటాతో కలిసి పని చేస్తున్నాడు.



సిద్ధార్థ్ మల్హోత్ర

సిద్ధార్థ్ మల్హోత్రకు 'జెర్రీ' అనే ఇండీ డాగ్ ఉంది. కుక్కల పట్ల తనకున్న ప్రేమను సామాజిక మాధ్యమాల్లో చాటుకునే ఈ హీరో, శాంతి అనే రెస్క్యూ డాగ్ ఫొటో షూట్‌లో మోడల్‌గా కూడా నటించాడు.



సోహా అలీ ఖాన్

సోహా, ఆమె భర్త కునాల్‌కు... 'నిమ్కి, మిష్టి, మస్తి, ఆరియో' అనే వీధి కుక్కలున్నాయి. వీళ్లు వీధి కుక్కల దత్తత క్యాంపులు, ఆశ్రయాలకు కార్యకర్తలుగా వ్యవహరిస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా భారతీయ వీధి కుక్కల దత్తతను ప్రోత్సహిస్తూ ఉంటారు.



ఆదిత్య రాయ్ కపూర్

తన ఫామ్ హౌస్ దగ్గర కనిపించిన వీధి కుక్కను మరో ఆలోచన లేకుండా ఇంటికి తెచ్చి పెంచుకున్నారు హిందీ నటుడు, ఆదిత్య రాయ్ కపూర్. దాని పేరు 'లూనా'.

సన్నీ లియోన్

నటి సన్నీ లియోన్ 'లిలు' అనే వీధి కుక్కతో పాటు ఏడు కుక్కలను దత్తత తీసుకుంది. గతంలో సన్నీ లియోన్ పెటాకు ప్రచారకర్తగా వ్యవహరించి, జంతు హక్కుల పట్ల అవగాహనా కార్యక్రమాలు చేపట్టింది.



మాధురి దీక్షిత్

2019లో మాధురి, ఒక ఇండీ డాగ్‌ను దత్తత తీసుకుంది. 'ఈ కుక్కపిల్ల మా మనసునెంతగా దోచుకుందో మా ముఖాల మీద విరబూసే ఈ చిరునవ్వులే చెబుతున్నాయి' అంటూ తన పెంపుడు కుక్క గురించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ కూడా పెట్టారామె. అలాగే జంతు ప్రేమికులందరూ వీధి కుక్కలను దత్తత తీసుకుని, జీవితాల్లో ఆనందం నింపుకోవాలని కూడా కోరారు.



రణదీప్ హుడా

ఈ నటుడికి 'బాంబి' అనే ఇండీ డాగ్ ఉంది. 2018లో ఈ కుక్కను దత్తత తీసుకున్న రణదీప్, పలు సందర్భాల్లో కుక్కలను కొనుక్కోవద్దు, దత్తత తీసుకోమని అభిమానులను కోరాడు.


ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...


ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
రివర్స్ ఆఫ్ ఫేట్	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 20
హోస్టేజ్	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 21
అమెజాన్ ప్రైమ్		
రోడ్ ఆన్ ఏ మిలియన్ సీజన్ 2	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 22
జియో హాట్‌స్టార్		
పీస్ మేకర్ సీజన్ 2	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 21
ఆహా		
కొత్తపల్లిలో ఒకప్పుడు	తెలుగు సినిమా	ఆగస్టు 22
ఆపిల్ టీవీ		
ఇన్వేషన్: సీజన్ 3	హాలీవుడ్ సిరీస్	ఆగస్టు 22







సండే సెలబ్రిటీ



ఇప్పుడు ఆ దశ దాటేశా

తన నటనతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న నటీమణులలో **ప్రగతి** ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో అనేక వందల సినిమాల్లో నటించిన ప్రగతి... ఇటీవల పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ గెలిచారు. త్వరలో జరగనున్న 'పవర్ లిఫ్టింగ్ ఆసియా ఛాంపియన్‌షిప్స్'లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రగతిని 'నవ్య' పలకరించింది.

ఎలా ఉన్నారు?

బాగున్నాను. కొత్త సవాళ్లు, వాటిని ఎదుర్కోవటం, గెలవటం... జీవితం చాలా ఎక్సైటింగ్‌గా ఉంది.

పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం గెలిచి అందరిని ఆశ్చర్యంలో ముంచారు.. ఈ క్రీడలోకి ఎలా ప్రవేశించారు?

చిన్నప్పటి నుంచి నాకు ఫిట్‌గా ఉండటమంటే ఇష్టం. అన్ని ఆటలూ ఆడేదాన్ని. కాలేజీలో నేను ఎన్‌సీసీలో ఉండేదాన్ని. ఎన్‌సీసీలో నాకు జాతీయ స్థాయి సైక్లింగ్‌లో గోల్డ్‌మెడల్ వచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతిరోజూ నడక తప్పనిసరిగా ఉండేది. అయితే గత 15 ఏళ్ల నుంచి ఫిట్‌నెస్ కోసం రోజూ జిమ్‌కు వెళ్లేదాన్ని. కొత్త రకాల ఎక్సర్‌సైజ్‌లు, కొత్త వర్కవుట్లు చేస్తూ ఉండేదాన్ని. సుమారు మూడేళ్ల క్రితం అనుకుంటా... నేను నివసించే కమ్యూనిటీలో ఒకావిడ పవర్‌లిఫ్టింగ్ శిక్షణతీసుకొనేవారు. ఆవిణ్ణి చూసి పారు అనే నా స్నేహితురాలు ఆ శిక్షణలో చేరింది. తను వచ్చి - "నీకు పవర్ లిఫ్టింగ్ బాగా నచ్చుతుంది" అని తనతో పాటు శిక్షణకు రమ్మంది. "సరే.. ఒక రోజు చూద్దాం" అని నేనూ చేరాను. అలా నా పవర్‌లిఫ్టింగ్ ప్రస్థానం ప్రారంభమయింది.

మూడేళ్లలో జాతీయ స్థాయిలో పతకం గెలవటం కష్టం కదా...

అవును. ఈ మూడేళ్లూ చాలా కష్టపడ్డా. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. నేను 2022లో మొదలుపెట్టాను. 2023లో కొన్ని సదరన్ స్టేట్స్ పోటీల్లో, నేషనల్స్‌లో పాల్గొన్నాను. 2024లో నా కాలికి సర్జరీ అయింది. దాంతో ఆ సంవత్సరమంతా పవర్‌లిఫ్టింగ్ చేయలేకపోయాను. ఈ ఏడాది ప్రారంభంలో మళ్లీ ట్రైనింగ్ మొదలుపెట్టా. ఈ నెలలో జరిగిన నేషనల్స్‌లో బంగారు పతకం వచ్చింది. డిసెంబర్‌లో ఆసియా ఛాంపియన్‌షిప్స్ ఉంది. దాన్లో మన దేశం నుంచి పాల్గొంటున్నా.

ఫైటింగ్ ప్రధానంగా ఉన్న సినిమా పాత్రలేమైనా చేశారా?

రెండు, మూడు సినిమాలు చేశాను. తెలుగులో 'ప్రేమ ఖైదీ' సినిమాను కన్నడంలో తీశారు. తెలుగులో శారదగారు చేసిన పాత్ర అక్కడ చేశాను. తెలుగులో ఆ పాత్రను వయస్సులో పెద్దదిగా చూపించారు. కన్నడంలో ఆ పాత్రకు తక్కువ వయస్సు ఉంటుంది. ఆ సినిమాలో ఫైట్స్ ఉంటాయి. సినిమా కోసం ఫైట్స్ చేయటం అదే తొలిసారి. ఆ తర్వాత విష్ణువర్ధన్ హీరోగా తీసిన 'హృదయవసంత' అనే సినిమాలో పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్ వేశాను. దానిలో కూడా కొన్ని ఫైట్స్ ఉంటాయి. ఆ తర్వాత నేను అమెరికా వెళ్లిపోయాను. సినిమాలకు బ్రేక్ వచ్చింది. అమెరికా నుంచి వచ్చి మళ్లీ సినిమాలు చేయటం మొదలుపెట్టిన తర్వాత ఫైటింగ్ పాత్రలు చేయలేదు.

మీరు ఎప్పుడూ మీడియాకు ఎందుకు దూరంగా ఉంటారు? సోషల్ మీడియాలో మీ అప్‌డేట్స్ ఎందుకు కనిపించవు?

నేను గతంలో రెండు, మూడు ఇంటర్వ్యూలు ఇచ్చాను. వాటి ద్వారా నా గురించి ప్రజలకు తెలుసు. నేను చెన్నైలో చదువుకున్నా. చిన్నప్పుడే పెళ్లి అయిపోయింది. నాకు ఇద్దరు పిల్లలు. నేను సింగిల్ మదర్‌ని. ఇంతకన్నా నా జీవితంలో చెప్పుకోదగ్గ విషయం కానీ, ప్రేక్షకులు తెలుసుకోవాల్సిన విషయాలు కానీ ఏమి లేవు. గతంలో చెప్పిన విషయాలనే పదే పదే ఎందుకు చెప్పాలి? దానివల్ల ప్రయోజనం ఏముంటుంది? అందుకే నేను మీడియాకు దూరంగా ఉంటా.

> **"ఆసియా ఛాంపియన్‌షిప్‌లకు వెళ్లటానికి చాలా ఖర్చవుతుంది. స్పాన్సర్లతో మాట్లాడుతున్నా. కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి. కానీ ఇంకా ఏదీ ఫైనల్ కాలేదు."**

కానీ చాలా మంది సినీ తారలు తమ వ్యక్తిగత జీవితాల గురించి సోషల్ మీడియాలో పంచుకుంటూనే ఉంటారు కదా...

నా వృత్తి జీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసుకున్నాను. నా వ్యక్తిగత జీవితం గురించి నా కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సన్నిహితులకు తెలిస్తే చాలు. ఒక విధంగా అది వారికి నేను ఇచ్చే గౌరవం. నాతో కలిసి ప్రయాణం చేస్తున్నందుకు వారికి నేను పంచే ప్రేమ. ఆ వివరాలను అందరితో పంచుకోవటం నాకు ఇష్టం ఉండదు. ప్రేమించే వ్యక్తులకు నేను ప్రత్యేకంగా ఇచ్చే స్పేస్ అది. ఇక ఆర్టిస్టుగా ప్రగతి గురించి ప్రేక్షకులకు ఎంత తెలియాలో అంత తెలిస్తే చాలు. ప్రగతి వ్యక్తిగత విషయాలు తెలియాల్సిన అవసరం లేదనేది నా భావన.

మీరు చాలా ఎమోషనలా?

అవునండి. నేను చాలా ఎమోషనల్. నేను మనుషులను చాలా త్వరగా నమ్మేస్తాను. త్వరగా హర్ట్ అవుతాను. బహుశా అందుకే నేను ఎక్కువమందికి దూరంగా ఉంటా. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మంచిది కదా!

మరి క్రీడల్లో గెలుపోటములు సహజం కదా! అంత ఎమోషనల్‌గా ఉంటే ఎలా ఆడగలుగుతారు?

> **"నేను పవర్ లిఫ్టింగ్ మొదలుపెట్టిన మొదటి రెండు నెలలు నరకం చూశాను. శరీరంలో ప్రతి అణువణువు నొప్పి పుట్టేది. ఆ నొప్పుల వల్ల రాత్రి నిద్ర పట్టేది కాదు. నొప్పితో, నిద్ర రాక ఏడ్చిన రాత్రులు ఎన్నో ఉన్నాయి. 'మళ్లీ ప్రాక్టీసుకు వెళ్లకూడదు' అని పడుకొనేదాన్ని, కానీ ఉదయం మామూలే! ప్రాక్టీసు వెళ్తే కలిగే తృప్తి వేరే ఉండేది. అది ఈ నొప్పులు, బాధల కన్నా గొప్పది. ఈ విషయం తెలిసిన తర్వాత నాలో మార్పు వచ్చింది. పవర్ లిఫ్టింగ్‌ను ప్రేమించడం నేర్చుకున్నా!**



నేను శారీరకంగా చాలా బలంగా ఉంటాను. మానసికంగా కొద్దిగా వీక్‌గా ఉండవచ్చు. అయితే ప్రతి రోజూ మూడు గంటల పాటు క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేయటం, గెలవాలనే పట్టుదలతో పాజిటివ్ ఆలోచనలతో ఉండటం వల్ల నేను అనేక పాఠాలు నేర్చుకున్నా. ఇప్పుడు మానసికంగా కూడా బలంగా ఉండగలుగుతున్నా! పవర్ లిఫ్టింగ్‌లోకి రాకముందు చాలా సెన్సిటివ్‌గా ఉండేదాన్ని. నన్ను ఎవరూ ఏమీ అనకపోయినా- 'అన్నారేమో' అనే ఆలోచనలు నన్ను పీకుతూ ఉండేవి. పవర్ లిఫ్టింగ్‌లోకి వచ్చిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది.

మీరు కొద్దిగా లేటు వయస్సులో పవర్ లిఫ్టింగ్‌లోకి ప్రవేశించారు కదా... ఇబ్బంది అనిపించలేదా?

లేదండి. పవర్ లిఫ్టింగ్ నన్ను శారీరకంగా.. మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతోంది. ప్రతి మహిళ జీవితంలో మోనోపాజ్ ఒక కీలకమైన దశ. ఆ సమయంలో మూడ్ స్వింగ్స్ ఉంటాయి. శారీరకంగా కూడా అనేక మార్పులు వస్తాయి. వాటన్నిటినీ తట్టుకోవటం చాలా కష్టం. ఈ దశలో నాకు పవర్ లిఫ్టింగ్ చాలా సాయం చేసింది. మోనోపాజ్ సమస్యలు ఎదుర్కొనేవారికి నేను ఇచ్చే సలహా ఏమిటంటే- "మీరు కూడా ఏదో ఒక యాక్టివిటీ ప్రారంభించండి. దీనివల్ల శారీరకంగా.. మానసికంగాను చాలా ప్రశాంతత లభిస్తుంది. మోనోపాజ్ వల్ల కలిగే రకరకాల మూడ్ స్వింగ్స్ తగ్గుతాయి. ఒక పని చేశామనే తృప్తి కలుగుతుంది. నా ఉద్దేశంలో 40 నుంచి 50 ఏళ్ల వయస్సు మధ్యలో ఉన్న మహిళలు అందం మీద కన్నా ఫిట్‌నెస్ మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఒక మనిషికి ఆరోగ్యాన్ని మించిన సంపద ఇంకోటి ఉండదు. ఈ సంపదను మనం మాత్రమే సంపాదించుకోవాలి. ఎవ్వరూ ఇవ్వరు.

ఒక వైపు సినిమాలు.. మరో వైపు ప్రాక్టీసు... ఎలా సాధ్యమయింది?

నేను సినిమాలు చాలా తగ్గించేసుకున్నా. నాకు బాగా నచ్చిన పాత్రలు వస్తేనే చేస్తున్నా. నాకు పవర్ లిఫ్టింగ్ ఎంత సంతృప్తి ఇస్తోందో... అంత సంతృప్తి ఇచ్చే పాత్ర వస్తేనే చేస్తాను. దీనికి నేను మానసికంగా సిద్ధపడ్డా.

అలా అయితే ఎక్కువ సినిమాలు చేయలేరు కదా...

నేను మంచి ఆర్టిస్టుని. నా జీవితంలో ఎన్నో కష్టనష్టాలు చూశాను. నన్ను నేను తీర్చిదిద్దుకుంటూ ఈ స్థితికి వచ్చాను. ఇప్పుడు నాకు సంతృప్తి చాలా అవసరం. మంచి పాత్రలు వచ్చినప్పుడు తప్పకుండా చేస్తాను. డబ్బుల కోసం చేయను. నాది మిడిల్ క్లాస్ జీవన విధానం. ఉన్నంతలోనే బతుకుతాను. ఒకప్పుడు మంచి దుస్తులు, మేకప్ సామాన్లు, వాచీలు.. ఇలాంటి వాటిపై ఆసక్తి ఉండేది. ఇప్పుడు ఆదశ దాటేశాను. వాటికి అయ్యే ఖర్చును పవర్‌లిఫ్టింగ్ శిక్షణమీద పెడుతున్నా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

• టీజర్

బాలీవుడ్‌కు మరో విశ్వసుందరి

ఇతర పరిశ్రమల నుంచి బాలీవుడ్‌కు దిగుమతి అయిన మరో తార... హర్నాజ్ సంధు. చేసింది రెండే పంజాబీ చిత్రాలు. అయినా అందంతో పాటు నటనపరంగానూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పటి విశ్వసుందరిగా సుపరిచితురాలైన ఆమె... ఇప్పుడు 'బాగీ4'లో టైగర్ షరాఫ్‌కు జోడీగా అదరగొట్టడానికి సిద్ధమవుతోంది.



కొస్త ఆలస్యమైనా మెగా ప్రాజెక్ట్‌తో హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తోంది హర్నాజ్. వచ్చే నెల ఐదున విడుదలవుతున్న 'బాగీ4'లో సూపర్‌స్టార్లు సంజయ్‌దత్, టైగర్ షరాఫ్‌తో పాటు పంజాబీలో అగ్రతార సోనమ్ బజ్వా నటిస్తోంది. వారందరితో కలిసి తెరపై మురిపించే అరుదైన అవకాశం రావడంతో, దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తీవ్రంగా కష్టపడుతోంది హర్నాజ్. సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమాలో ఆమెది యాక్షన్ సన్నివేశాలతో కూడిన గ్లామరస్ పాత్ర. అందుకే దానిపై ఎన్నో ఆశలు పెట్టుకుంది. తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ దక్కుతుందని ఆశిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లలో హర్నాజ్‌ను చూసి ఫిదా అవుతున్నారు అభిమానులు.

కల నిజమైన రోజు...

"డిసెంబరు 12... నా జీవితంలో ఎంతో అమూల్యమైనది. ఆ రోజునే నేను 'విశ్వసుందరి' కిరీటాన్ని గెలుచుకున్నాను. మూడేళ్ల తరువాత మళ్లీ అదే రోజున 'బాగీ4' లాంటి భారీ ప్రాజెక్టులో భాగస్వామిని అయ్యాను. ఇది నా కొత్త ప్రయాణానికి నాందిగా భావిస్తున్నాను" అని ఓ సందర్భంలో తన సంతోషాన్ని పంచుకుంది హర్నాజ్. అంతేకాదు... నిర్మాత సాజిద్‌కూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. "నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు దార్శనికుడైన సాజిద్ సర్‌కు రుణపడి ఉంటాను. ఆ నిర్మాణ సంస్థ కుటుంబంలో నేనూ ఒక సభ్యురాలిని అవడం ద్వారా నా కల నిజమైంది. నాపై నమ్మకం ఉంచి, ఎన్నో ఏళ్ల నా బాలీవుడ్ కలను నిజం చేసినందుకు ధన్యవాదాలు" అంటూ భావోద్వేగానికి లోనైంది.

చదువుకొంటూనే...

పంజాబ్ గురుదాస్‌పూర్ జిల్లా కోహలిలో పుట్టిన హర్నాజ్‌కు మొదటి నుంచి గ్లామర్ ప్రపంచంపై మక్కువ ఎక్కువ. ఆ దిశగానే ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. ఆమె తండ్రి ప్రీతమ్ పాల్ సింగ్ సంధు రియల్‌ఎస్టేట్ వ్యాపారి. తల్లి రబీందర్‌కౌర్ గైనకాలజిస్టు. కొంతకాలం బ్రిటన్‌లో ఉన్న ఆమె కుటుంబం, తిరిగి భారత్‌కు వచ్చాక చండీగఢ్‌లో స్థిరపడింది. హర్నాజ్... అక్కడి శివాలిక్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసింది. ప్రభుత్వ పీజీ కళాశాల నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందింది. పంజాబీతోపాటు హిందీ, ఇంగ్లీష్ కూడా అనర్గళంగా మాట్లాడగలదు. చదువుకొంటూనే మోడల్‌గా ప్రయత్నాలు మొదలుపెట్టింది. తల్లిదండ్రులు కూడా ఆమె అభిరుచిని కాదనలేదు.



మలుపు తిప్పిన మజిలీ...

కొంత కాలానికి హర్నాజ్ ప్రయత్నాలు ఫలించాయి. 2017లో స్థానిక అందాల పోటీల్లో పాల్గొని 'మిస్ చండీగఢ్' టైటిల్‌ను గెలుచుకుంది. ఏడాది తరువాత 'మిస్ మాక్స్ ఎమర్జింగ్ స్టార్ ఇండియా' కిరీటం దక్కింది. 2019లో పంజాబ్ రాష్ట్రం నుంచి 'ఫెమినా మిస్ ఇండియా'కు ఎంపికైంది. కానీ టాప్ 12కే పరిమితమైంది. అయితే 2021లో 'మిస్ దివా' టైటిల్ సాధించడంతో ఆమె ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. ఆమె కెరీర్‌ను అనూహ్య మలుపు తిప్పింది. అదే ఏడాది జరిగిన 'మిస్ యూనివర్స్' పోటీల్లో నెగ్గి, చిరకాల కోరికను నెరవేర్చుకుంది. ఈ ఘనత సాధించిన మూడో భారతీయురాలిగా రికార్డులకు ఎక్కింది. 'మిస్ యూనివర్స్'గా ఇజ్రాయిల్, అమెరికా, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, వియత్నాం, దక్షిణాఫ్రికా తదితర దేశాలు చుట్టివచ్చింది. అదే ఏడాది పంజాబీ చిత్రంతో నటిగా కెరీర్‌ను ఆరంభించింది. 'బాగీ4'తో హిట్ కొడితే బాలీవుడ్‌లో ఇక తనకు తిరుగులేదని భావిస్తోంది ఈ భామ. మరి ఆమె కోరిక నెరవేరుతుందా..? సెప్టెంబరు 5 వరకు... వెయిట్ అండ్ సీ!



ఈ రోజుల్లో కోటి రూపాయలంటే చాలా పెద్ద మొత్తమే. అంత డబ్బుంటే విలాసంగానే బతికేయొచ్చు. మంచి ఇళ్లు కొనుగోలు చేయొచ్చు. పిల్లల్ని విదేశాల్లో చదివించవచ్చు. ఆర్భాటంగా పెళ్లిళ్లూ చేయొచ్చు. మరి పాతికేళ్ల తర్వాత మాటేమిటి..? 2050లోనూ రూ.కోటితో ఇవన్నీ సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే, ధరాఘాతం కరెన్సీ విలువను కరిగించేస్తోంది. ఏటేటా ధరలు పెరుగుతూ పోతున్న నేపథ్యంలో కరెన్సీ నోటు కొనుగోలు సామర్థ్యం కూడా అదే స్థాయిలో తగ్గుతూ వస్తోంది. గతంలో మనం చూసిన 5 పైసలు, 10 పైసలు, 20 పైసలు, పావలా, అర్ధ రూపాయి నాణేలు ధరాఘాతం కారణంగా కాలక్రమేణా కనుమరుగైపోవడమే ఇందుకు మంచి ఉదాహరణ. ప్రస్తుతం చలామణిలో ఉన్న రూపాయి, రూ.2, రూ.5, రూ.10 నాణేలదీ భవిష్యత్‌లో అదే పరిస్థితి. కాబట్టి మన ఆర్థిక భవిష్యత్‌ను మెరుగుపర్చుకోవాలంటే.. ధరల పరుగును మించిన వేగంతో ఆదాయాన్ని, పొదుపు సొమ్ము విలువను పెంచుకోవడమే మన ముందున్న మార్గం. అదెలాగో తెలుసుకుందాం..

నేడు రూ. కోటి..

మరి పాతికేళ్ల తర్వాత?

ప్రస్తుతానికి ఆర్థికంగా బలంగానే ఉన్నా.. ద్రవ్యోల్బణం కారణంగా భవిష్యత్‌లో బలహీనపడే ప్రమాదం ఉంది. మీ ప్రస్తుత సంపద విలువను ఏటేటా పెంచుకుంటూ పోవడం ద్వారానే ఈ ముప్పు నుంచి తప్పించుకోగలరు. అది కూడా ద్రవ్యోల్బణం కంటే వేగంగా. ధరల వార్షిక పెరుగుదల రేటునే ద్రవ్యోల్బణం అంటారు. గత 20-25 ఏళ్లలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సగటు 6 శాతం పైమాటే. ప్రస్తుతం ఇది కాస్త తగ్గి 5 శాతానికి దిగివచ్చింది. వచ్చే 25 ఏళ్లూ ద్రవ్యోల్బణం సగటు 5 శాతంగా ఉండవచ్చనుకుంటే, నేటి కోటి రూపాయల వాస్తవిక విలువ 2050లో రూ.30 లక్షల దిగువకు (రూ.29.53 లక్షలు) పడిపోనుందన్నమాట. అలాగే, ప్రస్తుతం రూ.కోటితో పొందగలిదేదైనా 2050లో కావాలంటే దాదాపు రూ.3.4 కోట్లు చెల్లించాల్సి రావచ్చు. అంటే, వచ్చే పాతికేళ్లలో ధర దాదాపు మూడున్నర రెట్లు కానుందన్నమాట. అందుకే, మీ దగ్గరున్న సొమ్ము విలువను కాపాడుకోవాంటే ధరల పరుగుతో పోటీపడాల్సిందే.

సంపద లేదా పెట్టుబడుల విలువను పెంచుకునేందుకు పలు మార్గాలున్నాయి. ఈక్విటీ మార్కెట్లో నేరుగా లేదా మ్యూచువల్ ఫండ్ పథకాల ద్వారా పెట్టుబడులు మీ సంపద విలువను వేగంగా పెంచే అవకాశం ఉంది. అయితే, ఇది అధిక రిస్క్‌తో కూడుకున్నది. స్థిరాస్తి, బంగారం లేదా వెండి వంటి విలువైన లోహాల్లో పెట్టుబడులూ దీర్ఘకాలంలో ఆకర్షణీయ ప్రతిఫలాలు అందించగలవు. అయితే, వీటిలోనూ ఎంతో కొంత రిస్క్ ఉంటుంది. ప్రభుత్వ సెక్యూరిటీలు, బాండ్లలో పెట్టుబడులు భద్రమైనవి. పైగా ద్రవ్యోల్బణం కంటే అధిక రిటర్నులు లభిస్తాయి. వీటితో పాటు రిస్క్ లేని మరిన్ని పెట్టుబడి సాధనాలు..

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్‌సీసీ)

చిన్న మదుపరులు పన్ను రాయితీ ప్రయోజనాలతో దీర్ఘకాలం పెట్టుబడులు పెట్టేందుకు ఎన్‌సీసీ మంచి ప్రత్యామ్నాయం. ప్రభుత్వ హామీతో కూడిన ఈ ఐదేళ్ల కాలపరిమితి పథకంపై వార్షిక వడ్డీ రేటు ప్రస్తుతం 7.7 శాతంగా ఉంది.

కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)

కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకమైన కేవీపీపై ప్రస్తుత వార్షిక వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. ఈ పథకంలో పెట్టుబడి 115 నెలల్లో (9.5 సంవత్సరాలు) రెట్టింపు అవుతుంది.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్)

60 ఏళ్లు దాటిన వారికోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకమిది. ప్రభుత్వ హామీ, సెక్షన్ 80సీ కింద పన్ను రాయితీ వంటి ప్రయోజనాలున్న ఈ పథకంపై వార్షిక వడ్డీ రేటు 8.2 శాతంగా ఉంది. దీంట్లో గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ)

బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలూ సురక్షితమైనవే. అయితే, దీర్ఘకాలపరిమితి డిపాజిట్లపైనే ఆకర్షణీయ వడ్డీ లభించేందుకు అవకాశం ఉంటుంది.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)

దీర్ఘకాల వ్యూహంతో సురక్షిత పెట్టుబడి కోసం పీపీఎఫ్ మంచి ఆప్షన్. చక్రవడ్డీ ద్వారా మంచి ప్రతిఫలాలూ లభిస్తాయి. ప్రస్తుతం పీపీఎఫ్‌పై వార్షిక వడ్డీ రేటు 7.10 శాతంగా ఉంది. పన్ను రహిత వడ్డీ, ఐటీ చట్టంలో సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు వంటి ప్రయోజనాలూ ఉన్నాయి.


ఎస్‌బీఐ గృహ రుణ రేటు 0.25% పెంపు

తక్కువ క్రెడిట్ స్కోర్ కలిగిన కొత్త రుణగ్రహీతలపై ప్రభావం

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త రుణగ్రహీతలకు గృహ రుణాల (టర్మ్ లోన్) వడ్డీ రేటు శ్రేణిని 0.25 శాతం పెంచింది. ఈ నెల 1 నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. జూలైలో ఎస్‌బీఐ గృహ రుణాల వడ్డీ రేట్ల శ్రేణి 7.5-8.45 శాతంగా ఉంది. తాజా పెంపుతో 7.5-8.70 శాతానికి చేరుకుంది. వడ్డీ శ్రేణిలో దిగువ స్థాయిని యథాతథంగా కొనసాగించిన బ్యాంకు.. ఎగువ స్థాయిని మాత్రం పెంచిన నేపథ్యంలో తక్కువ క్రెడిట్ స్కోర్ కలిగిన రుణగ్రహీతలపై అధిక భారం పడనుంది. ఎందుకంటే, బ్యాంకులు రుణగ్రహీత క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగా రుణంపై వడ్డీని నిర్ణయిస్తాయి. సాధారణంగా మంచి స్కోర్ కలిగిన వారికి తక్కువ వడ్డీకే రుణం లభిస్తుంది. క్రెడిట్ స్కోర్ అంతంత మాత్రంగా ఉన్న వారి నుంచి బ్యాంకులు గరిష్ఠ పరిమితి వడ్డీని వసూలు చేస్తుంటాయి. లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకు ఎస్‌బీఐ తీసుకున్న తాజా నిర్ణయాన్ని మిగతా బ్యాంకులు అనుసరించే అవకాశం ఉంది.

ఎస్‌బీఐ గృహ రుణ సంబంధిత వడ్డీ రేట్ల వివరాలు..

గృహ రుణం (టర్మ్ లోన్)	7.50-8.70%
హోమ్‌లోన్ మ్యాక్స్‌గెయిన్ (ఓడీ)	7.75-8.95%
టాప్ అప్ లోన్	8.0-10.75%
టాప్ అప్ (ఓడీ) లోన్	8.25-9.45%
స్థిరాస్తి తనఖాపై రుణం	9.20-10.75%
రివర్స్ మార్టిగేజ్ లోన్	10.55%
యోనో ఇన్‌స్టా హోమ్ టాప్ అప్ లోన్	8.35%



ఆదాయం పన్ను పరిమితికి లోబడి ఉన్నా

రిటర్నులు దాఖలు చేయాల్సిందే...

ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నుల ఫైలింగ్ గడువు దగ్గర పడుతోంది. ఏటా జూలై ఆఖరు వరకు ఉండే గడువును ఈ సంవత్సరం ప్రభుత్వం సెప్టెంబరు 15 వరకు పొడిగించింది. చాలా మంది మన ఆదాయం పన్ను పరిమితికి లోబడే ఉంది కదా.. రిటర్న్ ఫైల్ చేయాల్సిన అవసరం ఏముందని అనుకుంటారు. అయితే ఆదాయం, పన్ను మినహాయింపు పరిధికి లోబడి ఉన్నా.. ఈ కింది సందర్భాల్లో రిటర్న్ ఫైల్ చేయక తప్పదు. అవేమిటంటే..

విదేశీ ప్రయాణ ఖర్చులు: ఆదాయం తక్కువగా ఉన్నా చాలా మంది విదేశీ పర్యటనల్లో జోరుగా ఖర్చు చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈ ఖర్చులు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే వారి ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ దాఖలు చేయాలి.

విదేశీ ఆస్తులు: ప్రపంచీకరణ పుణ్యమానీ భారతీయులూ పెద్దఎత్తున విదేశాల్లో ఆస్తులు కూడబెడుతున్నారు లేదా విదేశీ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో మదుపు చేసి వాటిపై వచ్చే డివిడెండ్, వడ్డీ ఆదాయం పొందుతున్నారు. ఇలాంటి వ్యక్తుల ఆదాయం మన దేశంలో పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా.. తప్పనిసరిగా తమ విదేశీ ఆస్తులు, పెట్టుబడులు, ఆదాయ వివరాలతో ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

టీడీఎస్, టీసీఎస్: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మీ ఆదాయం నుంచి టీడీఎస్ లేదా టీసీఎస్ రూ.25,000 లేదా అంతకు మించి ఉన్నా ఐటీ రిటర్న్ చేయడం తప్పనిసరి.

వ్యాపార టర్నోవర్, రాబడి: ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి వ్యాపార అమ్మకాలు, టర్నోవర్, ఆదాయం రూ.60 లక్షలు మించితే..ఆ వ్యక్తి తప్పనిసరిగా రిటర్న్ ఫైల్ చేయాలి. అదే వృత్తి నిపుణులైతే వార్షిక ఆదాయం రూ.10 లక్షలు మించితే తప్పనిసరిగా రిటర్న్ దాఖలు చేయాలి.

కరెంట్ బిల్లు: కరెంట్ బిల్లు కూడా మీరు ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలా? వద్దా? అనే విషయాన్ని నిర్ణయిస్తుంది. ఆర్థిక సంవత్సరంలో మీ వార్షిక కరెంటు బిల్లు రూ.2 లక్షలు లేదా అంతకు మించి ఉంటే తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఐటీ రిఫండ్: మీ వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా, ట్యాక్స్ రిఫండ్ ఏమైనా ఉంటే, ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం తప్పనిసరి. ఈ రిటర్న్‌లోని సమాచారాన్ని సరిచూసుకునే ఆదాయ పన్ను శాఖ రిఫండ్ జారీ చేస్తుంది.

డిపాజిట్లు: ఏ వ్యక్తికైనా ఒక ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు కరెంట్ ఖాతాలో అయితే రూ.కోటి లేదా అంతకు మించి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలో అయితే రూ.50 లక్షలు లేదా అంతకు మించి డిపాజిట్లు ఉంటే.. వారు తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఎల్‌టీసీజీ మినహాయింపు కోరితే: వార్షిక ఆదాయం పన్ను మినహాయింపు పరిమితికి లోబడి ఉన్నా పెట్టుబడి లాభాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) మినహాయింపు కోరుకునే వ్యక్తులూ తప్పనిసరిగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17 తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,180 ▼	92,750 ▼	1,26,200 ▲
విజయవాడ	1,02,600 ▼	96,500 ▼	1,17,400 ▼
విశాఖపట్నం	1,01,350 ▼	92,750 ▼	1,26,200 ▲
రాజమండ్రి	1,01,180 ▼	92,750 ▼	1,17,600 ▼
ప్రొద్దుటూరు	1,00,650 ▼	92,600 ▼	1,17,300 ▼
ముంబై	1,00,023 ▲	91,621 ▲	1,14,933 ▼

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

ఫైనల్లో అనహత్



న్యూఢిల్లీ: భారత టీనేజ్ స్క్వాష్ సంచలనం అనహత్ సింగ్ మరో అంతర్జాతీయ టైటిల్ అందుకునేందుకు అడుగు దూరంలో నిలిచింది. 17 ఏళ్ల అనహత్.. ఆస్ట్రేలియాలోని బేగాలో జరుగుతున్న ఎన్ఎస్‌డబ్ల్యూ స్క్వాష్ ఓపెన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో అనహత్ 3-2తో నూర్ కఫాగీ (ఈజిప్టు)పై గెలిచింది. టైటిల్ కోసం ఈజిప్టుకు చెందిన హబిబా హనితో అనహత్ తలపడనుంది. మరో సెమీస్‌లో హబిబా 3-1తో భారత క్రీడాకారిణి ఆకాంక్ష సాలుంఖేను ఓడించింది.

తాన్యాకు 'సైపన్' టైటిల్



న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ తాన్యా హేమంత్ అంతర్జాతీయ వేదికపై మెరిసింది. యూఎస్ఏలోని నార్తర్న్ మరియానా ఐలాండ్స్‌లో జరిగిన సైపన్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తాన్య మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో తాన్య 15-10, 15-8తో కనాయి సకాయి (జపాన్)ను ఓడించి ట్రోఫీ అందుకుంది. 21 ఏళ్ల తాన్యకు ఇది కెరీర్‌లో నాలుగో ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్.

మ్యాక్స్‌వెల్ మెరుపుల్

మూడో టీ20లో సఫారీలపై ఆసీస్ గెలుపు

2-1తో సిరీస్ కైవసం



కెయిన్స్: నరాలు తెగే ఉత్కంఠ మధ్య మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 62 నాటౌట్) అర్ధ శతకంతో మెరవడంతో.. దక్షిణాఫ్రికాతో మూడో టీ20లో ఆస్ట్రేలియా 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడు టీ20ల సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకొంది. చివరి రెండు బంతుల్లో ఆసీస్ గెలుపునకు 4 పరుగులు కావాల్సి ఉండగా.. ఎన్‌గిడి బౌలింగ్‌లో మ్యాక్సీ రివర్స్ స్వీప్ బౌండ్రీతో జట్టుకు థ్రిల్లింగ్ విక్టరీని అందించాడు. శనివారం జరిగిన సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 172/7 స్కోరు చేసింది. డివాల్డ్ బ్రెవిస్ (53), డుస్సెన్ (38 నాటౌట్) రాణించారు. నాథన్ ఎల్లీస్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్లకు 173 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మార్ష్ (54) హాఫ్ సెంచరీ సాధించాడు. కార్బిన్ బాష్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆసీస్‌కు ఇది వరుసగా ఏడో ద్వైపాక్షిక టీ20 సిరీస్ విజయం కావడం విశేషం.

స్పోర్ట్స్

ఫిట్‌నెస్ టెస్ట్‌లో సూర్య పాసయ్యాడు




బెంగళూరు: ఆసియాకప్ టీ20 టోర్నీకి ముందు టీమిండియాకు శుభవార్త. గాయం నుంచి కోలుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ టెస్టులోనూ పాసయ్యాడు. జూన్‌లో హెర్నియా సర్జరీ తర్వాత అతను సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ పునరావాస శిబిరంలో చేరాడు. ఇటీవలే పూర్తి స్థాయిలో కోలుకున్న సూర్య బ్యాటింగ్ ప్రాక్టీస్ కూడా ఆరంభించాడు. ఇక తాజా ఫలితంతో అతను ఆసియాకప్ బరిలో దిగడం ఖాయమైంది. అలాగే ఈనెల 19న ఆసియాకప్ జట్టు ఎంపికలో పాల్గొనేందుకు సూర్య ముంబైకి వెళ్లనున్నట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

అండర్ 19 వరల్డ్‌కప్‌లో యూఎస్ఏ

రైడల్ (జార్జియా): వచ్చే ఏడాది జరిగే అండర్-19 పురుషుల వరల్డ్‌కప్‌లో చివరి బెర్త్‌ను యూఎస్ఏ జట్టు దక్కించుకుంది. జింబాబ్వే-నమీబియా ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. అమెరికన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా కెనడా, బెర్ముడా, అర్జెంటీనాలపై గెలిచిన యూఎస్ మరో మ్యాచ్ ఉండగానే మెగా టోర్నీకి అర్హత సాధించింది.

ఆసీస్ క్రికెట్ దిగ్గజం బాబ్ సింప్సన్ ఇకలేరు



సిడ్నీ: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ బాబ్ సింప్సన్ (89) అనారోగ్యంతో మృతి చెందారు. జట్టు కెప్టెన్‌గానే కాకుండా ఆసీస్ తొలి కోచ్‌గా సింప్సన్ పని చేశారు. 1957-1978 మధ్య కాలంలో 62 టెస్టులు ఆడిన సింప్సన్ 4,869 రన్స్ సాధించారు. ఇందులో 10 సెంచరీలు ఉన్నాయి. లెగ్ స్పిన్నర్ కూడా అయిన ఆయన 71 వికెట్లు పడగొట్టారు. ఇక, వన్డేల్లో మాత్రం రెండు మ్యాచ్‌లే ఆడారు. సింప్సన్ 60వ దశకంలో అద్భుత స్లిప్ ఫీల్డర్‌గా పేరుతెచ్చుకున్నారు. అలెన్ బోర్డర్, మార్క్ టేలర్ కెప్టెన్లుగా ఉన్నప్పుడు సింప్సన్ కోచ్‌గా వ్యవహరించి జట్టును ఉన్నత స్థితిలో నిలిపారు. సింప్సన్ తొలిసారిగా 1968లో ఆటకు వీడ్కోలు పలికారు. కానీ, మరో తొమ్మిదేళ్ల తర్వాత 41 ఏళ్ల వయస్సులో కెప్టెన్‌గా పునరాగమనం చేసి ఏడాది పాటు జట్టుకు ఆడారు.

గుకేష్‌కు ఆరో స్థానం

చాంపియన్ అరోనియన్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన సెయింట్ లూయిస్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేష్ (18 పాయింట్లు) ఆరో స్థానంలో నిలిచాడు. ఇక..అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ లెవాన్ అరోనియన్ (24.5 పాయింట్లు) టోర్నీ విజేతగా నిలిచాడు. అమెరికాకే చెందిన కరువానా (21.5)కు రెండో స్థానం దక్కింది. చివరి ఐదు గేమ్‌లలో మూడింటిని డ్రా చేసిన గుకేష్ రెండు గేమ్‌లలో ఓడాడు. దాంతో మొత్తం 18.5 పాయింట్లతో లీమ్ లే (వియత్నాం)తో కలిసి ఆరో స్థానాన్ని పంచుకున్నాడు.

ఛెత్రికి దక్కని చోటు

కాఫా నేషన్స్ కప్‌నకు భారత ప్రాబబుల్స్



న్యూఢిల్లీ: కాఫా నేషన్స్ కప్ కోసం భారత ఫుట్‌బాల్ కొత్త కోచ్ ఖాలిద్ జమీల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ టోర్నీ కోసం ప్రకటించిన 35 మంది ప్రాబబుల్స్‌లో దిగ్గజ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రికి చోటు దక్కలేదు. ఈ విషయమై అటు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్), కోచ్ నుంచి ఎలాంటి వివరణ రాకపోవడం గమనార్హం. ఆగస్టు 29 నుంచి తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లలో ఈ టోర్నీ జరుగుతుంది. భారత్‌తో పాటు తజకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్ ఈ టోర్నీలో తలపడుతున్నాయి. 40 ఏళ్ల ఛెత్రి వాస్తవానికి గత జూన్‌లోనే ఆటకు వీడ్కోలు పలికాడు. అయితే అప్పటి కోచ్ మార్క్వెజ్ వినతి మేరకు ఈ ఏడాది మార్చిలో ఆసియాకప్ క్వాలిఫయర్స్‌లో ఆడాడు. కానీ తాజా పరిస్థితుల నేపథ్యంలో ఛెత్రి కెరీర్ ఇక ముగిసినట్టే.



ఏసీఏలోకి మళ్లీ చిన్ని, సానా

అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవ ఎన్నిక

కొలువుదీరిన నూతన కార్యవర్గం

తాడేపల్లి (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కార్యదర్శిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో ఏసీఏ నూతన కార్యవర్గాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ప్రకటించారు. చిన్ని, సతీష్‌తో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను రమేష్‌కుమార్ అందజేశారు. ఉపాధ్యక్ష పదవి ఎన్నికపై కొన్ని అభ్యంతరాలు రావడంతో దానిపై తుది నిర్ణయం త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా విజయకుమార్, కౌన్సిలర్‌గా దండు గౌర్ విష్ణుతేజ్ కూడా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

విహారి ఆల్‌రౌండ్ షో

ఏపీఎల్‌లో లయన్స్‌పై రాయల్స్ విజయం

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో కెప్టెన్ హనుమ విహారి (62 నాటౌట్, 2/32) ఆల్‌రౌండ్ షో ప్రదర్శించడంతో అమరావతి రాయల్స్ 7 వికెట్లతో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై గెలిచింది. తొలుత లయన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులు చేసింది. వీరారెడ్డి (41), రోషన్ (30) మినహా ఎవరూ రాణించ లేదు. సందీప్ 3, విహారి, అయ్యప్ప, సంతోష్ తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో రాయల్స్ 15 ఓవర్లలో 140/3 స్కోరు చేసి నెగ్గింది. విహారికి తోడు ప్రణీత్ (44), ప్రసాద్ (21 నాటౌట్) అదరగొట్టారు. ఇక, వర్షం కారణంగా ఏడు ఓవర్లకు కుదించిన రెండో మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ 10 వికెట్ల తేడాతో కాకినాడ కింగ్స్‌ను ఓడించింది.



విహారి

ఒకరికి గాయమైతే మరొకరు ఆడొచ్చు

బీసీసీఐ కీలక నిర్ణయం

ఆటగాడికి సబ్‌స్టిట్యూట్ నిబంధన

ఈ దేశవాళీ సీజన్‌లో అమలు



న్యూఢిల్లీ: ఈ దేశవాళీ సీజన్ (2025-26) 'ప్లేయింగ్ కండీషన్స్'కు సంబంధించి బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కీపర్ రిషభ్ పంత్ తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని..తీవ్రంగా గాయపడిన ఆటగాడి స్థానంలో మరో క్రికెటర్‌ను అనుమతించే విషయంలో నూతన నిబంధనను వెలువరించింది. 'ఏదైనా మ్యాచ్‌లో ఆటగాడు తీవ్రంగా గాయపడితే అతడికి బదులు మరో ఆటగాడిని అనుమతిస్తాం' అని బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఈమేరకు 'ఆట నిబంధనల'లో మార్పు చేసినట్టు తెలిపింది. రంజీట్రోఫీ, దులీప్ ట్రోఫీ, సీకే నాయుడు అండర్-19 ట్రోఫీ టోర్నమెంట్లకు కొత్త నిబంధన వర్తిస్తుంది. అయితే ఆ క్రికెటర్ సదరు మ్యాచ్‌కు మైదానంలో ఉన్న సమయంలో గాయపడినప్పుడే సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతిస్తారు. ఫ్రాక్చర్ లేదా శరీరంపై లోతైన గాయం అయినప్పుడే ఈ నిబంధన అమలవుతుంది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఇటీవల ముగిసిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్ నాలుగు, ఐదు టెస్టుల సమయంలో కీలక ఆటగాళ్ల గాయంతో రెండు జట్లు సమస్యలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. నాలుగో టెస్ట్‌లో భారత్ కీపర్ పంత్ పాదానికి, ఐదో టెస్ట్‌లో ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ భుజానికి ఫ్రాక్చర్ అయ్యింది. వీరిద్దరి గాయం రెండు జట్లపై పెద్ద ప్రభావం చూపింది. కాగా..కంకషన్ సమయంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతించే విధానం క్రికెట్‌లో ఎప్పటినుంచో ఉంది. కానీ ఇలా తీవ్రంగా గాయపడిన సందర్భంలో సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించే నిబంధన మాత్రం అంతర్జాతీయ క్రికెట్‌లో లేదు.

అలా చర్చ మొదలై..

ఇటీవల ఇంగ్లండ్, భారత్ టెస్ట్ సిరీస్‌లో పంత్, వోక్స్ ఉదంతాల దరిమిలా.. తీవ్రంగా గాయపడిన ఆటగాడికి బదులు మరో క్రికెటర్‌ను అనుమతించాలనే చర్చ కూడా జరిగింది. ఆ చర్చను టీమిండియా కోచ్ గంభీర్ స్వాగతించాడు. 'ఒక ఆటగాడు తీవ్రంగా గాయపడ్డాడని అంపైర్లు, రెఫరీ భావించినప్పుడు అతడి స్థానంలో మరొకరిని అనుమతించాలి. లేదంటే సదరు జట్టును శిక్షించినట్టే. హోరాహోరీగా సాగే మ్యాచ్‌లో 11 మంది జట్టుతో 10 మంది సభ్యులు గల టీమ్ తలపడడం సబబేనా' అని గంభీర్ ప్రశ్నించాడు. 'ఒక ఆటగాడికి బదులు మరో క్రికెటర్‌ను అనుమతించడంలో తప్పులేదు' అని గౌతమ్ స్పష్టంజేశాడు. కానీ గంభీర్ అభిప్రాయంతో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ విభేదించాడు. 'గాయపడిన ఆటగాడి స్థానంలో సబ్‌స్టిట్యూట్ అనే విషయంపై చర్చే అసంబద్ధం. గాయాలనేవి క్రికెట్‌లో భాగం. కంకషన్ అంటారా..క్రికెటర్ క్షేమం రీత్యా ఆ నిబంధన ఓకే. కానీ గాయపడిన ఆటగాడికి సబ్‌స్టిట్యూట్ అంశంలో లొసుగులుంటాయి' అని వ్యాఖ్యానించాడు.









చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నిర్మాతలే సమస్యను పెంచుతున్నారు

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినీ కార్మికుల సమ్మె 13వ రోజుకు చేరుకుంది. కానీ నిర్మాతలు సంప్రదింపుల పేరుతో కాలయాపన చేస్తున్నారు. మేము షరతులకు అంగీకరించట్లేదని బయట మాట్లాడుతున్నారు' అని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అన్నారు. సినీ కార్మికుల సమ్మె.. వారి వేతనాల పెంపుపై శనివారం ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ స్పందించారు. 'మమ్మల్ని మీడియా ముందు మాట్లాడవద్దు అని చెప్పి, నిర్మాతలు మాత్రం శుక్రవారం ప్రెస్ మీట్ పెట్టారు. మేము రెండు పాత షరతులను అంగీకరించట్లేదని అన్నారు, అది తప్పు. మాతో చర్చించకుండానే మేము షరతులకు అంగీకరించట్లేదు అని ఎలా చెబుతారు. 50 ఏళ్ల నుంచి లేని కండిషన్స్ ఇప్పుడు పెడితే ఎలా. మీరు ఎంత వేతనం ఇస్తారో కచ్చితంగా చెబితే, కార్మికులతో చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే స్పష్టం చేశాం. బ్లాంక్ పేపర్ కూడా తీసుకొచ్చి వారికి ఇచ్చాం. మీకు నచ్చినట్లు రాయండి అని చెప్పాం. నిర్మాతలు కూడా కష్టాల్లో ఉన్నారని తెలుసు. అందుకే దిగి వచ్చి చర్చలకు సిద్ధం అని మరోసారి చెప్తున్నాము. కానీ వారు చర్చలకు అందుబాటులో ఉండడం లేదు. షూటింగ్ చేసుకునేవాళ్లకు ఎలా సహకరించాలో.. షూటింగ్ చేయని వారి నుంచి ఎలా డబ్బులు రాబట్టాలో మాకు తెలుసు. గౌరవ వేతనం అనేది సినిమాను, కష్టాన్ని బట్టి.. అలాగే, ఛాంబర్, కౌన్సిల్ నిర్ణయాలను బట్టి ఉంటుంది. వేతనాల గురించి మాట్లాడితే ఏవేవో పాయింట్లు తెస్తున్నారు. గతం గురించి మాట్లాడితే మేమూ మాట్లాడాల్సి ఉంటుంది. నిర్మాతలే సమస్యను పెంచుతున్నారు. వారి నిర్ణయం చెబితే మా కార్యాచరణ మేము ప్రకటిస్తాం' అని అన్నారు.




తరాలు మారినా తగ్గని క్రేజ్

ఐదు దశాబ్దాల అద్భుతమైన సినీ జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రజనీ తన శిఖర సమానమైన నటనతో లక్షలాది మందిని అలరించడమే కాకుండా సమాజచైతన్యానికి తన సినిమాలను మాధ్యమంగా చేసుకున్నారని చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. వెండి తెరపై సూపర్ స్టార్ రజని అని టైటిల్స్‌లో కనిపించగానే థియేటర్ ఏ విధంగా మారుమోగుతుందో పలు మార్లు తాను స్వయంగా చెన్నైలో చూశానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. సినీ జీవితంలో స్వర్ణోత్సవం చేసుకుంటున్న సూపర్ స్టార్ రజనీకాంత్‌కు శనివారం ఒక ప్రకటన ద్వారా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తరాలు మారుతున్నా సినీప్రియుల్లో ఆ ఆనందోత్సాహాల వన్నె తగ్గలేదని, ఆ స్థాయి అభిమానులను దక్కించుకున్న అగ్రశ్రేణి కథానాయకుడు రజనీకాంత్ ఒక్కరే అని కొనియాడారు. - అమరావతి (ఆంధ్రజ్యోతి)

అలరించే సుందరకాండ



నారా రోహిత్, విర్తి వాఘని జంటగా నూతన దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బేనర్‌పై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నారా రోహిత్ మాట్లాడుతూ 'సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. వినాయక చవితి రోజు కుటుంబమంతా కలసి థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నా' అని అన్నారు. నటుడు నరేశ్ వీకే మాట్లాడుతూ 'ఇలాంటి రొమాంటిక్ కామెడీ ఇప్పటి వరకూ రాలేదు. తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'నా మొదటి సినిమా ఒక డ్రీమ్ మూమెంట్. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసుకీ, శ్రీదేవి విజయ్ కుమార్, నిర్మాత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కన్మణి... కనువిందు

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వం వహిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ఓజీ'. సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓజాస్ గంభీర్ అనే గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో పవన్ కల్యాణ్ కనిపించనున్నారు. ఆయనకు జోడీగా ప్రియాంక అరుళ్ మోహన్ నటించారు. ఆమె ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. కన్మణి పాత్రలో ప్రియాంక అలరించనున్నారు. త్వరలో ఈ చిత్రం నుంచి రెండో పాటను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇమ్రాన్ హష్మీ, అర్జున్‌దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస, ఎడిటర్: నవీన్ నూలి

నటుడిగా నాకు సవాల్ విసిరే పాత్ర



సాయిపల్లవి, రణ్‌బీర్‌కపూర్ సీతారాములుగా నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న బాలీవుడ్ చిత్రం 'రామాయణ'. సన్నీడియోల్ ఇందులో హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. త్వరలో ఆయన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా సన్నీడియోల్ మాట్లాడుతూ 'హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు ఆనందంతోపాటు భయం కూడా కలుగుతోంది. త్వరలోనే రామాయణ సెట్స్‌లోకి అడుగుపెట్టబోతున్నాను. నటుడిగా నాకు సవాల్ విసిరే పాత్ర ఇది. హనుమంతుని పాత్రలో జీవించాలి. ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పదనాన్ని మరోసారి తెలుసుకుంటుంది' అని చెప్పారు.

ఆమెలోని గొప్ప నటిని చూస్తారు

- దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల



'భావోద్వేగాలతో అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రం 'పరదా'. సినిమా చూస్తున్న ప్రేక్షకుల కళ్లలో నీళ్ల తిరుగుతాయి. ఈ చిత్రం ఒక చర్చకు తావిస్తుంది. జనం మాట్లాడుకునే సినిమా అవుతుంది. ఇందులో అనుపమలోని గొప్ప నటిని చూస్తారు' అని అన్నారు దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఆయన తెరకెక్కించిన 'పరదా' ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రవీణ్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకొన్నారు. 'ఈ కథ వినగానే అనుపమ చాలా భావోద్వేగానికి గురయ్యారు. 'నేను చేయాలని అనుకుంటున్నది ఇలాంటి సినిమానే' అని చెప్పారు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. చిత్రీకరణకు దాదాపు మూడేళ్లు పట్టింది. మనాలి, ధర్మశాల ఇలా ఎన్నో అద్భుతమైన ప్రదేశాల్లో వందలాది మందితో చిత్రీకరించాం. ఎక్కడా గ్రీన్ మ్యాట్ వాడలేదు. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని ఇవ్వాలనే ప్యాషన్‌తో చేసిన సినిమా ఇది. ఇప్పటి వరకు చూసిన అనుపమ వేరు ఈ సినిమాలో చూసే అనుపమ వేరు. నిర్మాత సురేశ్ బాబు సినిమా చూసి బాగుందని మెచ్చుకున్నారు. నేను చిన్నప్పటి నుంచి మాస్ కమర్షియల్ సినిమాలు చూస్తునే పెరిగాను. అలాంటి సినిమాలు చేయడం నాకు ఇష్టం. ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

వినోదం పంచే కథతో



యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన చిత్రం 'ఫైటర్ శివ'. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో ఉన్నం రమేశ్, నర్సింహ గౌడ్ నిర్మించారు. సునీల్ కీలకపాత్ర పోషించారు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ చేతుల మీదుగా చిత్రబృందం శనివారం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రభాస్ నిమ్మల మాట్లాడుతూ 'సామాజిక అంశానికి వాణిజ్య హంగులు జోడించి తెరకెక్కించిన చిత్రమిది. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. మణికాంత్ డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్ర చేస్తున్నారు. ఆయన నటన అందర్నీ అలరిస్తుంది అని నిర్మాతలు తెలిపారు. 'ఊహకందని మలుపులతో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వంద శాతం వినోదాన్ని పంచుతుంది' అని మణికాంత్ తెలిపారు.



సస్పెన్స్ థ్రిల్లర్

రియా సచ్‌దేవ, సత్యం రాజేశ్ జంటగా నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫ్రెండ్లీ ఘోస్ట్'. జి. మధుసూధన్‌రెడ్డి దర్శకుడు. విశ్వనాథ్ డీకే నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మంచు మనోజ్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా 'ఫ్రెండ్లీ ఘోస్ట్' సినిమా థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమాతో సత్యం రాజేశ్, మధుసూధన్ రెడ్డి, విశ్వనాథ్ గారికి మంచి పేరు రావాలి' అని ఆకాంక్షించారు. భయపెట్టి, ఊపిరిసలపని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను మెప్పించేలా సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. "ఫ్రెండ్లీ ఘోస్ట్' నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో టీజర్, ట్రైలర్ విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. ఈ చిత్రంలో శ్రీనివాస్‌రెడ్డి, సప్తగిరి, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

ఉత్కంఠభరితంగా బెంగాల్ ఫైల్స్



'ద కశ్మీర్ ఫైల్స్' ఫేమ్ వివేక్‌రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కిస్తున్న చిత్రం 'ద బెంగాల్ ఫైల్స్'. అభిషేక్ అగర్వాల్, పల్లవి జోషీ, వివేక్‌రంజన్ అగ్నిహోత్రి నిర్మిస్తున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఆలోచన రేకెత్తించే సంభాషణలు, సంగీతం, హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఉత్కంఠభరితంగా సాగింది ట్రైలర్. వాస్తవిక సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదలవుతోంది.

పల్లెటూరి ప్రేమ కథ



శ్రీచరణ్ రాచకొండ, గీత్ సైనీ జంటగా సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కన్యాకుమారి'. నటి మధు శాలిని సమర్పించారు. ఈనెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. మధు శాలిని మాట్లాడుతూ సృజన్ తీసిన 'పుస్తక విమానం' నాకు బాగా నచ్చింది. అలాంటి కొత్త టాలెంట్‌ని సపోర్ట్ చేయాలనిపించింది. సృజన్ చాలా కష్టపడి ఈ సినిమా చేశారు. మంచి థియేట్రికల్ అనుభూతినిచ్చే చిత్రమిది' అని తెలిపారు. దర్శకనిర్మాత సృజన్ మాట్లాడుతూ 'సహజ పాత్రలతో ఆద్యంతం వినోదం అందించే చిత్రమిది. మంచి అనుభూతిని పొందాలంటే తప్పకుండా థియేటర్లలో చూడాలని ప్రేక్షకులను కోరుతున్నా. ఈ సినిమాని ముందుకు తీసుకొస్తున్న మధు శాలినికి కృతజ్ఞతలు' అని అన్నారు. దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది అని అన్నారు. చిత్ర కథానాయిక గీత్ సైని మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమ కథ ఇది. వర్షం పడినప్పుడు వచ్చే మట్టి సువాసన అంత స్వచ్ఛంగా ఉంటుంది. కన్యాకుమారి పాత్రలో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

జగన్.. మోదీ కాళ్లు మొక్కారు

- వైఎస్సార్ ఎవరి కాళ్లూ పట్టుకోలేదు
- వైసీపీలో వైఎస్సార్ పేరు తొలగించాలి: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాళ్లు మొక్కిన వైఎస్ జగన్, తన పార్టీలోని వైఎస్సార్ పేరును తొలగించాలని ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ డిమాండ్ చేశారు. వైఎస్సార్ ఎన్నడూ ఏ ప్రధానమంత్రి కాళ్లూ పట్టుకోలేదని, ఇకపై జగన్ పార్టీలో వైఎస్సార్ పేరు ఉంచడం అర్థరహితమని శనివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. జగన్‌కు ప్రజల కంటే ప్రధాని మోదీనే ఎక్కువని విమర్శించారు. ఓట్ చోరీ అంశంపై దేశవ్యాప్తంగా చర్చకు వస్తే ఏపీలో మాత్రం ఈ విషయంపై మౌనంగా ఉన్నారని, దీంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. కేంద్రం కనుసన్నల్లో బాబు, జగన్ పార్టీలు నడుస్తున్నాయని ఆరోపించారు. బాబు పార్టీ+జగన్ పార్టీ=బీజేపీ అని కామెంట్ చేశారు. క్షేత్రస్థాయిలో ఇరు పార్టీలూ మోదీకి మద్దతు ఇస్తున్నాయి. కీలకమైన బిల్లులకు ఇద్దరూ మద్దతు తెలిపారు. పార్లమెంటులో 239మంది ప్రతిపక్ష ఎంపీలు ఓట్ చోరీపై చర్చకు పట్టుబడుతుంటే వైసీపీ ఎంపీ గురుమూర్తి దానికి మద్దతుగా నిలిచారు. పైకి మాత్రం ఏదో జరిగిపోయినట్టుగా.. ఎన్నికల్లో తాము మోసపోయామంటూ వైసీపీ ఫిర్యాదులు చేస్తోంది. వైసీపీ డబుల్ స్టాండర్డ్ పాలిటిక్స్ చేస్తోంది' అని విమర్శించారు. కాంగ్రెస్ పక్షాన తాము వనరులు, ప్రజల ఓటు హక్కు కోసం పోరాడుతున్నామని, టీడీపీ, వైసీపీ మాత్రం మోదీని ఆకాశానికెత్తే పనిలో నిమగ్నమయ్యాయని ఆరోపించారు.

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

- హామీల అమలు అరచేతిలో వైకుంఠమే: షర్మిల

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయ్యిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. శనివారం ఈమేరకు ఆమె ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యిందని సీఎం చంద్రబాబును ఆమె ప్రశ్నించారు. 'ఇరవై లక్షల ఉద్యోగాల్లో ఒక్కరికైనా ఇచ్చారా? పద్దెనిమిదేళ్లు నిండిన ఒక్క యువతికైనా నెలకు రూ.1,500 అందజేశారా? కేంద్రం ఇచ్చిన రూ.ఆరు వేలతో లింకు పెట్టి.. రాష్ట్రంలోని ఇరవై లక్షల మంది రైతులకు సున్నం పెట్టారు. తల్లికి వందనంలో ఇరవై లక్షల మంది తల్లులకు కోతపెట్టారు. 14 నెలల తర్వాత ఫ్రీ బస్సు పథకం అమలుచేసి సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటారా? రాష్ట్రంలో సంక్షేమం సన్నగిల్లింది. అభివృద్ధి అటకెక్కింది. సుపరిపాలన కొండెక్కింది. కూటమి ఏడాది పాలనలో హామీల అమలుకు మంగళం పాడింది' అని షర్మిల విమర్శించారు.

ఆడబిడ్డల ఆర్థిక ప్రగతే టీడీపీ విధానం: సుజాత

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 'ఆడబిడ్డలు, అక్కాచెల్లెమ్మల ఆర్థిక స్థితిని వృద్ధిలోకి తీసుకురావాలన్నదే టీడీపీ విధానం' అని మాజీ మంత్రి, ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ చైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'గతంలో డ్వాక్రా ద్వారా కోటి మంది మహిళలు, వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచిన చంద్రబాబు... ఇప్పుడు స్త్రీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు స్త్రీశక్తి పథకం పేరుతో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఇలాంటి మంచి పథకాన్ని కూడా వైసీపీ వ్యతిరేకిస్తోంది. జగన్ సతీమణి భారతి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేసి, ఈ పథకం ప్రయోజనం ఏమిటో తెలుసుకోవచ్చు' అని సుజాత అన్నారు.

జగన్ మానసిక పరిస్థితి బాగోలేదు: అఖిలప్రియ

కర్నూలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ మానసిక పరిస్థితి బాగోలేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం కర్నూలులోని మహిళా సబ్ జైలును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటమిపై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. గత వైసీపీ పాలనలోని అరాచకం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితోనే టీడీపీ ఘన విజయం సాధించింది. ప్రతిపక్ష పార్టీకి డిపాజిట్లు గల్లంతయ్యాయి. జగన్‌కు భయం పట్టుకుంది. అందుకనే సీఎం చంద్రబాబుపై నోరు పారేసుకుంటున్నారు. ఎన్నికల్లోపు ఆయన జైలుకెళ్లడం ఖాయం' అని అన్నారు.

దేవదాయ శాఖలో 7 పోస్టులకు నోటిఫికేషన్

- 127 పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టని అధికారులు


అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖలో ఏడు గ్రేడ్-3 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ శాఖలో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉండటంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలతో పాటు ప్రధాన కార్యాలయంలోనూ జూనియర్ అసిస్టెంట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటితోపాటు డిప్యూటీ కమిషనర్ పోస్టులు 6, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు 5, గ్రేడ్-1 ఈవో పోస్టులు 12, గ్రేడ్-3 ఈవో పోస్టులు 104 కలిపి మొత్తం 127 ఖాళీలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన సమీక్షలో ఖాళీ పోస్టులు భర్తీ వెంటనే చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినప్పటికీ దేవదాయ, ఆర్థిక శాఖ అధికారులు ఏడాది పాటు ఫైల్‌ను అటూ, ఇటూ తిప్పి చివరికి ఏడు గ్రేడ్-3 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేశారు. మిగిలిన ఖాళీల ఊసే ఎత్తడం లేదు.

21న మంత్రివర్గ సమావేశం

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని 21న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మంత్రులు, కార్యదర్శులకు సాధారణ పరిపాలన శాఖ నుంచి సమాచారం అందించారు. సమావేశంలో పెట్టే అంశాలకు సంబంధించి ప్రతిపాదనలను ఆయా శాఖాధిపతులు 19 నాటికి పంపించాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు.

రెండు శ్లాబ్‌ల జీఎస్టీతో ఎంఎస్ఎంఈలకు ఉపశమనం: ఏపీ చాంబర్స్

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సరళీకృత రెండు శ్లాబ్‌ల జీఎస్టీ విధానంతో ఎంఎస్ఎంఈలకు చాలా ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. రెండు శ్లాబ్‌ల జీఎస్టీ విధానంపై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్కువ రేటు శ్లాబ్‌లతో ఎంఎస్ఎంఈలకు వర్గీకరణ వివాదాలు, కార్యాచరణ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఉపాధి, గ్రామీణాభివృద్ధికి మరింత మద్దతు ఇవ్వడానికి ఆహార ప్రాసెసింగ్, వస్త్రాలు, హస్తకళలు, గ్రామీణ పరిశ్రమలు తదితరాలను 5 శాతం జీఎస్టీ శ్లాబ్ కింద మార్చాలని వారు కోరారు.



విజేతను ప్రకటిస్తున్న స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి, సోనోవిజన్ ఎండీ భాస్కరమూర్తి

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలు వీరే..

- మొదటి బహుమతిగా విజయవాడ వాసికి హోండా అమేజ్

విజయవాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సోనోవిజన్ ఇండిపెండెన్స్ డే సేల్ లక్కీ డ్రాలో విజయవాడ వాసి హోండా అమేజ్ కారును సొంతం చేసుకున్నారు. సోనోవిజన్ కొనుగోలుదారులకు ఇచ్చిన లక్కీ డ్రా కూపన్‌ల నుంచి శనివారం రాత్రి విజేతను ఎంపిక చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలను ప్రకటించారు. ఈ లక్కీ డ్రాలో నగరానికి చెందిన ఉమామహేశ్వరరావు హోండా అమేజ్ కారును గెలుచుకున్నారు. పెనమలూరుకు చెందిన షేక్ మీరావలి ఎల్ఈడీ టీవీని, ప్రసాదంపాడుకు చెందిన బిందుపావని రిఫ్రిజిరేటర్, కట్టుబడిపాలెంకు చెందిన డి.దుర్గాప్రసాద్ వాషింగ్ మెషీన్ గెలుచుకున్నారు. దేశంలోని అతిపెద్ద కంపెనీల నుంచి ఎల్ఈడీ, మొబైల్స్, ల్యాప్‌టాప్స్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్స్, ఏసీ, కిచెన్ అప్లయెన్స్‌లపై గతంలో ఎన్నడూ లేనంతగా డిస్కౌంట్ ఇస్తున్నామని సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి ఈ సందర్భంగా తెలిపారు. రూ.30 వేల క్యాష్‌బ్యాక్, ఒక ఈఎంఐ రిఫండ్ ఆఫర్లు ఇస్తున్నామని చెప్పారు.

రోజువారీ కూలీ.. ఏడుగురికి ప్రాణదాత

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గుంటూరు జిల్లా వాసి కంచర్ల సుబ్బరాజు
- బ్రెయిన్ డెడ్ అని ప్రకటించిన వైద్యులు
- అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం

తెనాలి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకుంటేనేగానీ రోజు గడవని పేద కుటుంబం వారిది. అయినా వారు చూపిన మానవత్వం ఏడుగురి జీవితాల్లో వెలుగు నింపింది. గుంటూరు జిల్లా తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన కంచర్ల సుబ్బరాజు (60), కంచర్ల వెంకటలక్ష్మి దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూనే సుబ్బరాజు కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. సొంత స్థలం, ఉండటానికి ఇల్లు కూడా లేదు. వయసు పైబడటంతో గ్రామంలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటున్నారు. పక్షవాతంతో ఇటీవల సుబ్బరాజు మంచం పట్టారు. ఈనెల 10న గుంటూరులోని రమేశ్ హాస్పటల్‌ను సంప్రదించగా.. అక్కడి వైద్యులు సుబ్బరాజుకు బ్రెయిన్ డెడ్ అని ధ్రువీకరించారు. అవయవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. పెద్దదిక్కును కోల్పోయిన బాధలో ఉన్న భార్య, పిల్లలు మరికొందరి ప్రాణాలు నిలబడతాయనే సదుద్దేశంతో అవయవదానానికి అంగీకరించారు. దీంతో సుబ్బరాజు ఊపిరితిత్తులను చెన్నైలోని రెండు ప్రాంతాలకు, కిడ్నీల్లో ఒకటి రమేశ్ ఆస్పత్రికి, మరొకటి ఎయిమ్స్‌కు, కాలేయాన్ని రమేశ్ ఆస్పత్రికి, కళ్లు ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. ఏడుగురికి పునర్జీవితాన్ని అందించేలా ముందుకు వచ్చిన సుబ్బరాజు కుటుంబానికి కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు మానవతావాదులు అభినందించారు. సుబ్బరాజు మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహానికి ఎమ్మెల్సీ ఆలపాటి నివాళులు అర్పించారు. అవయవదానంతో సుబ్బరాజు చిరంజీవిగా నిలిచారన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ కూడా సుబ్బరాజు మృతదేహానికి నివాళులర్పించారు. అవయవదానానికి సంబంధించిన సర్టిఫికెట్లు, మట్టి ఖర్చులకు రూ. 10 వేలు అందించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని వ్యక్తిగత కార్యదర్శి గ్రామంలోనే ఉండి అంతిమ సంస్కారాల ఏర్పాట్లకు పర్యవేక్షించారు.





మృతుడి భార్యకి అవయవదానం సర్టిఫికెట్లు, మట్టిఖర్చులు అందిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చదువు వారికి సాహసమే!

- అడవిలో ఆరు కిలోమీటర్లు నడిచి బడికి..
- బిల్డింగ్ కట్టి బడిని మరిచిన వైసీపీ
- 40ఏళ్లుగా పాఠశాల కోసం ఎదురుచూస్తున్న బెల్లంకొండలోని రామాంజనేయపురం
- న్యాయంచేయాలని లోకేశ్‌కు విన్నపం

(గుంటూరు సిటీ, బెల్లంకొండ- ఆంధ్రజ్యోతి)



రామాంజనేయపురం గ్రామ దృశ్యం



మన్నె సుల్తాన్‌పాలెంలోని పాఠశాలకు నడచి వెళ్తున్న విద్యార్థులు

రామాంజనేయపురం. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతాల నుంచి తరలివచ్చిన గిరిజనులతో ఏర్పడిన గ్రామం. ఈ గ్రామం ఏర్పడి నలభై ఏళ్లు దాటింది. అయినా, ఈ ఊరికి బడి లేదు. గత ప్రభుత్వం బిల్డింగ్ కట్టి బడి విషయం మరిచిపోయింది. దీంతో బడిని వెతుక్కొంటూ రామాంజనేయపురం చిన్నారులు ఊరు దాటిపోతున్నారు. బడికి వెళ్లే దారి అడవి మార్గం కావడంతో రోజూ భయం భయంగా నడక సాగించాల్సిన పరిస్థితి! రోజుకు కనీసం ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లి నడిచి వస్తున్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి పాఠశాలను కేటాయించాలంటూ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను విద్యార్థులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒకప్పుడు రామాంజనేయపురం ఉమ్మడి గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు)లో కలిసి ఉన్న బెల్లంకొండ మండలంలోనే ఉంది. 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారిలో ఎక్కువ మంది గిరిజనులు. పోడు వ్యవసాయం చేసుకునే కుటుంబాలు. పోడు కోసం అడవిలో చెట్లు కొడుతున్నారంటూ చాలా కాలం వీరిపై అటవీ శాఖ అధికారుల వేధింపులు కొనసాగాయి. ఈ క్రమంలో గ్రామంలోకి నక్సల్ ఉద్యమం ప్రవేశించింది. నక్సల్ రాకతో అటవీ అధికారుల వేధింపులు తగ్గిపోయాయి. అయితే, గ్రామంపై పోలీసుల దాడులు పెరిగాయి. ఈ దాడులు, వేధింపులను తట్టుకోలేక చాలామంది యువకులు నక్సల్ ఉద్యమంలో చేరిపోయారు. నక్సల్ గ్రామంగా పేరు పడటంతో రామాంజనేయపురం అభివృద్ధికి నోచుకోలేదు. 2004లో ఉమ్మడి ప్రభుత్వానికి, నక్సల్‌కు మధ్య చర్చల సమయంలో.. గ్రామంలోని గిరిజనులకు అధికారులు పట్టాభూములు కేటాయించారు. సదుపాయాలు కూడా మెరుగుపడ్డాయి. ఈ సమయంలోనే పాఠశాల ఏర్పాటు చేయాలని ప్రజలు అభ్యర్థించారు. కానీ, ఎందుకనో అప్పటినుంచి ఇప్పటిదాకా గ్రామంలో పాఠశాల ఏర్పాటు కాలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు స్కూల్ బిల్డింగ్ నిర్మించారు. కానీ పాఠశాలను మాత్రం ప్రారంభించలేదు.

కదిలించలేకపోయిన 'బాలిక ఎన్‌కౌంటర్'

రామాంజనేయపురానికి చెందిన నర్సమ్మ అనే 11 ఏళ్ల బాలిక 2004 మార్చి 23న ఎన్‌కౌంటర్‌లో మరణించడం.. అప్పట్లో కలకలం రేపింది. పిల్లలకు బడి సౌకర్యం లేకపోవడంవల్ల చదువులకు దూరమై నక్సల్ ఉద్యమంలోకి పోతున్నారని పోలీసులు ఆనాడు పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి కూడా 21 ఏళ్లు దాటిపోయింది. కానీ, పోలీసులు ముందుకు తెచ్చిన సమస్యకు మాత్రం పరిష్కారం చూపలేదు. మంత్రి లోకేశ్ స్పందిస్తేనే తమ కష్టాలు తీరతాయని కారుమంచి కోటమ్మ ఆవేదనతో చెప్పారు.

మాకు బడి కావాలి



"రోజూ పక్క ఊరికి వెళ్లి రావాలంటే భయం వేస్తుంది. మా ఊరిలోనే బడి పెట్టి చదువు చెప్పాలి. ఒక్కోరోజు ఆటోలు అసలు రావు. అంత దూరం నడవాలంటే కాళ్లు నొప్పులు పుడుతున్నాయి."

- మేడా శైలజ, మూడో తరగతి, రామాంజనేయ పురం

100 మంది పిల్లలు ఉన్నారు



"సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామంలో సర్వే నిర్వహించాం. సుమారు 100 మంది వరకు చదువుకునే పిల్లలు ఉన్నారు. గత ప్రభుత్వం బిల్డింగ్ నిర్మించింది. కానీ పాఠశాల మంజూరు చేయలేదు. ఈ విషయాన్ని మా యూనియన్ తరఫున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం."

- మక్కెన శ్రీనివాసరావు, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నేత

సీఎం సహాయ నిధి పక్కదారి!

- ఓ విద్యాసంస్థల అధినేత భార్యకు 'రిలీఫ్'
- రూ.10 లక్షల సాయం మంజూరు
- ఈ ఘటనపై కూటమి నేతల్లో తీవ్ర అసంతృప్తి
- సీఎంవో దృష్టికి చేరిన వ్యవహారం

ఆకివీడు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదవారికి అందాల్సిన సీఎం రిలీఫ్ ఫండ్ సంపన్నులకు అందింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన నక్కా సూర్యకుమారి అనారోగ్య కారణాలతో సాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. ఆమెకు రూ.10లక్షలు మంజూరయ్యాయి. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు చేతుల మీదుగా ఆ సొమ్మును సూర్యకుమారి కుమారుడు ఇటీవల అందుకున్నారు. సూర్యకుమారి భర్త సత్యనారాయణమూర్తికి కార్పొరేట్ స్థాయి విద్యా సంస్థలున్నాయని టీడీపీ నాయకుడు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు బత్తుల రవి ఆరోపిస్తున్నారు. నగర పంచాయతీ కార్యాలయం వెనుక జీ ప్లస్ ఫ్లోర్ బిల్డింగ్‌లో సుమారు 1,100 మంది విద్యార్థులు ఆ విద్యాసంస్థల్లో చదువుతున్నారని, ఈ కుటుంబానికి ముస్లిం వీధిలో మరో విద్యాసంస్థ కూడా ఉందని చెబుతున్నారు. ఆర్థికంగా స్థిరపడిన ఈ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ రావడానికి జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి కారంపూడి సుమంత్ కారణమని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం జనసేన కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులుకు రవి ఫిర్యాదు పత్రం అందజేశారు. విద్యాసంస్థల అధినేత సత్యనారాయణమూర్తికి ఆదాయం (సంవత్సర ఆదాయం) కేవలం రూ.1,75,000 మాత్రమే అని ధ్రువీకరణ పత్రం రెవెన్యూ అధికారులు అందించారని ఆ ఫిర్యాదులో తెలిపారు. ధనవంతులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడంలో అధికారులను, నాయకులను సుమంత్ తప్పుదోవ పట్టించారన్నారు. ఈ ఫిర్యాదు జిల్లాలో ఉన్నతాధికారులు దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు. కాగా, ఈ వ్యవహారమంతా సీఎంవో కార్యాలయం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది.

లచ్చన్న జీవితం ఆదర్శం



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

- గీత కార్మికులకు ఆదరణ 3.0 ద్వారా మోపెడ్లు
- హార్టీకల్చర్ కేంద్రంలో తాటి ఉత్పత్తుల తయారీ
- లచ్చన్న జయంత్యుత్సవంలో మంత్రి ఎస్. సవిత

విజయవాడ(వన్‌టౌన్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న తన జీవితాంతం పాటుపడ్డారని మంత్రి సంజీవరెడ్డిగారి సవిత అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న 116వ రాష్ట్ర స్థాయి జయంత్యుత్సవం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. త్వరలో ఆదరణ 3.0 పథకాన్ని ప్రారంభించనున్నామని, ఈ పథకం ద్వారా గీత కార్మికులకు మోపెడ్, ద్విచక్ర వాహనాలు అందజేయబోతున్నామని తెలిపారు. గౌతు లచ్చన్న స్ఫూర్తితో బీసీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందుకే బీసీలందరూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలవాలని సూచించారు. గీతకార్మికులకు తాటి చెట్లు ఎక్కడానికి అధునాతన పరికరాలు అందజేయనున్నామన్నారు. రంపచోడవరంలోని హార్టీకల్చర్ పరిశోధనా కేంద్రంలో నూతన తాటి ఉత్పత్తులు తయారుచేసి, గీత కార్మికులకు ఉపాధి, ఆర్థిక వృద్ధి మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు సవిత తెలిపారు. గౌతు లచ్చన్నతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 2018లో సీఎం చంద్రబాబు తోటపల్లి ప్రాజెక్టుకు గౌతు లచ్చన్న పేరు పెట్టారని గుర్తు చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధికి ఈ కార్యక్రమమే నిదర్శనమని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో గౌతు శిరీషపై ఎన్నో కేసులు పెట్టినా ఆమె భయపడకుండా పోరాటం చేశారని గుర్తుచేశారు. టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజల కోసం, సమాజం కోసం పాటుపడిన వ్యక్తులను ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ.. ఆచార్య ఎన్‌జీ రంగాను పార్లమెంటు సభ్యునిగా శ్రీకాకుళంలో నిలబెట్టి గెలిపించిన వ్యక్తి లచ్చన్న అని తెలిపారు. గౌతు లచ్చన్న మనవరాలు, శాసనసభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ.. ప్రజా పోరాటాలు చేసిన నాయకులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. చిన్నప్పుడు తాను తాత దగ్గర పెరగడం వల్ల.. ఆయన ఆశయాలు, ఆలోచనలు తనపై ప్రభావం చూపించాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, పితాని సత్యనారాయణ, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు సీఎం, లోకేశ్ నివాళి

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నివాసంలో సీఎంతోపాటు, మంత్రి లోకేశ్ కూడా లచ్చన్నకు నివాళులర్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు లచ్చన్నకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవులు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



డీజీపీకి డాక్టరేట్ అందిస్తున్న జస్టిస్ మహదేవన్

జ్ఞాన విస్తరణకు పుస్తకాలు కీలకం

- సమగ్రత లేని విజయం నిజమైనది కాదు
- వీఐటీ 40వ స్నాతకోత్సవంలో సుప్రీం జడ్జి జస్టిస్ మహదేవన్

వేలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 'జ్ఞాన విస్తరణకు పుస్తకాలు ఎంతో కీలకం. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు అభ్యాసాన్ని కొనసాగించాలి' అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహదేవన్ సూచించారు. శనివారం వేలూరులోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) 40వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... 'వీఐటీ తన విద్య, పరిశోధన, పరిపాలనా విధుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, తిరుక్కురళ్ గురించి ప్రస్తావించిన విషయాన్ని ఉటంకిస్తూ.. నిపుణులుగా మారడానికి విలువల పరిజ్ఞానం చాలా అవసరం. సమగ్రత లేని విజయం నిజమైన విజయం కాదు' అని అన్నారు.

అవినీతి నిర్మూలనకు విద్యార్థులు పోరాడాలి: కులపతి విశ్వనాథన్

'భారత జీడీపీలో 6 శాతం విద్యకు కేటాయించాలన్నది దీర్ఘకాలిక డిమాండ్. ప్రస్తుతం జీడీపీలో కేవలం 3 శాతం మాత్రమే వ్యయం చేస్తున్నారు. కేంద్రం తన రూ.55 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయిస్తోంది' అని వీఐటీ వ్యవస్థాపకులు, చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, 'ప్రస్తుతం ఉన్నతవిద్యలో 4.3 కోట్ల మంది విద్యార్థులు చేరారు. కొత్త విద్యావిధానం 50 శాతం స్థూల నమోదు నిష్పత్తి సాధించడం లక్ష్యంగా పెట్టుకుంది. దీని వలన విద్యార్థుల సంఖ్య 8 కోట్లకు పెరుగుతుంది. పన్ను ఎగవేత వల్ల ఏటా రూ.8-9 లక్షల కోట్లు, అవినీతి వల్ల రూ.6 లక్షల కోట్లు కోల్పోతున్నాం. ఈ సమస్యలను నిర్మూలించడానికి విద్యార్థి సమాజం పోరాడాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా టైమ్స్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివకుమార్ సుందరం, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వం, ట్రస్టీ రమణి బాలసుందరం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్య పెంటారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి ఎస్.విశ్వనాథన్, ఉపకులపతి వీఎస్ కాంచన భాస్కరన్, అసోసియేట్ వైస్ చాన్స్‌లర్ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ టి.జయభారతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. పీహెచ్‌డీ డిగ్రీ పొందిన వారిలో తమిళనాడు పోలీస్ అకాడమీ డైరెక్టర్ డీజీపీ సందీప్ రాయ్ రాథోడ్ కూడా వుండడం విశేషం.

సిబ్బంది కళ్లు గప్పి.. గోడదూకి.. రిమాండ్ ఖైదీ పరార్

- ప్రొద్దుటూరు సబ్ జైలులో భద్రతా వైఫల్యం
- పలు జిల్లాల్లో 25కు పైగా దొంగతనం కేసులు
- 3 రోజుల క్రితమే ఓ చోరీ కేసులో అరెస్టు
- సబ్‌జైలును సందర్శించిన జైళ్ల శాఖ ఐజీ
- విచారణకు ఆదేశం.. గాలింపు ముమ్మరం

ప్రొద్దుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి మహ్మద్ రఫీ అనే రిమాండ్ ఖైదీ శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో సిబ్బంది కళ్లు గప్పి గోడ దూకి పరారయ్యాడు. దీంతో సబ్‌జైలులోని భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మహ్మద్ రఫీ మూడు రోజుల క్రితం రాజుపాళెం మండలం టంగుటూరులో పట్టపగలే ఓ ఇంట్లో దూరి చోరీ చేసి ఇంటి యజమానిపై దాడిచేసి పారిపోతుండగా గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీంతో 13వ తేదీన మహ్మద్ రఫీని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ప్రొద్దుటూరు సబ్‌జైలులో ఇతడితో పాటు మరో నలుగురు మాత్రమే రిమాండ్ ఖైదీలు ఉన్నారు. ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం బ్యారక్‌ను శుభ్రం చేస్తుండగా క్షణాల వ్యవధిలో మహ్మద్ రఫీ వెంటిలేటర్‌ను పట్టుకుని గోడదూకి పరారయ్యాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. జైళ్ల శాఖ ఐజీ రవికిరణ్ ప్రొద్దుటూరు వచ్చి సబ్ జైలు ఆవరణను పరిశీలించారు. ఆయన ఆదేశాలతో కడప జైలర్ అమర్ బాషా విచారణ చేపట్టారు. ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి సబ్ జైలును సందర్శించి ఇతర రిమాండ్ ఖైదీలను, సిబ్బందినీ విచారించి కేసు నమోదు చేశారు. రఫీని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసుల బృందాలతో గాలింపు చేపట్టారు. రఫీ 2021లో జమ్మలమడుగు సబ్‌జైలు నుంచి కూడా తప్పించుకుని పారిపోయాడు. అయినా జైలులో సిబ్బంది అప్రమత్తంగా ఉండకపోవడం వల్లే పరారైనట్లు తెలుస్తోంది.





తప్పించుకున్న మహ్మద్ రఫీ(ఫైల్)


అనంతపురం ఆర్టీసీ బస్టాండులో మహిళలు


అనంతపురం బస్టాండులో ఆధార్ కార్డులు చూపిస్తున్న మహళలు


విశాఖలో ఫ్రీ ఫేర్ టికెట్లు చూపుతున్న మహిళలు


రాజమహేంద్రవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ఫ్రీ బస్.. సూపర్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

జీరో ఫేర్ టికెట్ జారీ చేయడం కనిపించింది. ప్రభుత్వం అనుమతించిన గుర్తింపు కార్డులను మరిచి బస్సు ఎక్కిన మహిళలకు ఫ్రీ బస్ పట్ల అవగాహనను సిబ్బంది కల్పించారు. ఇలాంటివారు ఐదుశాతం కంటే తక్కువ ఉంటారని అంచనా! వారికి కేటాయించిన ఐదు రకాల బస్సుల్లో శనివారం సాయంత్రం నాటికి దాదాపు 12 లక్షలమంది మహిళలు ప్రయాణించారు. జిల్లాల్లో కొత్త జోష్‌ను 'స్త్రీ శక్తి' పథకం నింపింది. విశాఖ జిల్లాలో శనివారం బస్సుల్లో సగానికి పైగా మహిళలే ప్రయాణించారు. అన్నమయ్య జిల్లాలో 5 ఆర్టీసీ డిపోలలో 422 బస్సుల్లో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న బాపట్ల జిల్లాలో శనివారం ఒక్కరోజే 4,200 జీరో టికెట్లు జారీ చేసినట్లు ఆర్టీసీ తెలిపింది. మొత్తం 212 ఆర్టీసీ సర్వీసుల్లో ఈ పథకం అమలు జరుగుతోందని పేర్కొన్నారు. శనివారం ప్రకాశం రీజియన్‌లో 90శాతం మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు.

'స్త్రీ శక్తి' సత్తా...

విశాఖలో ఫ్రీ బస్సుల్లో కొద్దిమందిని పలకరించగా తాము వీధిలో చిన్న దుకాణం నిర్వహిస్తుంటామని, సరుకులు కొనడానికి ఇంతకు ముందు ఆటోలో హోల్‌సేల్ మార్కెట్‌కు వెళ్లేవారమని, ఇప్పుడు బస్సులో ఉచితంగా వెళుతున్నామని చెప్పారు. బ్యూటీపార్లర్ నడుపుతున్న ఒకామె మాట్లాడుతూ, తనకు అవసరమైన సరుకులు స్థానికంగా కొంటున్నానని, ఇప్పుడు ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో విజయనగరం వంటి ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటామని, గిట్టుబాటు అవుతుందని వివరించారు. స్త్రీశక్తి పథకం వల్ల ఖర్చులు తగ్గడంతో పాటు ఆదాయం పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని దాదాపుగా అందరు మహిళలు అభిప్రాయపడ్డారు.

శభాష్ చంద్రన్న

గుంటూరు నుంచి పిడుగురాళ్లకు పుట్టింటికి వెళుతున్నామని, తమ లాంటి చిన్న కుటుంబాలకు ఫ్రీ బస్‌తో ఆర్థికంగా ఎంతోమేలు కలుగుతుందని శైలజాబాయి అనే మహిళ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను చంద్రన్న నిలుపుకున్నారని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ కోసం పల్లె పల్లె తిరిగి బట్టలు అమ్ముకుంటానని, రోజూ బస్సుల్లో ప్రయాణం భారంగా ఉండేదని అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన సిద్దమ్మ గుర్తుచేసుకున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్థిక భారం తగ్గిందని, ఇలాంటి ప్రభుత్వం ఎప్పటికీ అధికారంలో ఉండాలన్నారు.

ఒక్కరోజులోనే ఎంత తేడా...

అనంతపురం రీజియన్‌లో 470 బస్సులు ఉన్నాయి. నిన్నటివరకు బస్సుల్లో మహిళలు 40 శాతం, పురుషులు 60 శాతం మంది ప్రయాణించేవారు. శనివారం ఈ నిష్పత్తిలో అనూహ్యమైన మార్పు కనిపించింది. మహిళలు, పురుషుల ఆక్యుపెన్సీ సమానమైంది. ఈ నిష్పత్తి కూడా మారి.. రాబోయే రోజుల్లో పురుషుల కంటే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రకాశం జిల్లా రీజియన్‌లో 374 బస్సులను ఫ్రీబస్ పథకం కోసం కేటాయించారు.

నెలకు పద్దైదు నూర్లు మిగులుతాయి



"మా ఊరి నుంచి రోజూ చిర్రాకు కట్టలు కట్టుకుని కోటకు వచ్చి అమ్మితేనే మాకు ఇల్లు జరిగేది. కడివేడు నుంచి కోటకు వచ్చి పోవల్లంటే యాభై రూపాయలు అవుతుంది బస్సుకు. అదే ఆటోలో పోయి రావల్లంటే డెబ్బై రూపాయలవుతుంది. ఇపుడు చంద్రబాబు మా ఆడోళ్లకు బస్సు ఫ్రీ చేసినాడు. కాబట్టి నెలకు బస్సు చార్జీలకయ్యే పద్దైదు నూర్లు మిగులుతాయి."

- ఇందిరమ్మ, కడివేడు, చిల్లకూరు మండలం, ఉమ్మడి చిత్తూరు జిల్లా

కండక్టర్ అవతారం ఎత్తిన గోరంట్ల



ఫ్రీబస్ పథకానికి మరింత జోష్‌ను పెంచుతూ.. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కండక్టర్ అవతారం ఎత్తారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్‌లో నిలిచిన ఉచిత బస్సు ఎక్కి స్వయంగా ఆయనే మహిళలకు టికెట్లు అందించారు. అనంతరం ఆ నియోజకవర్గ తెలుగు మహిళలతో కలిసి సీఎం చంద్రబాబుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాగా, టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ కొద్దిసేపు బస్సు స్టీరింగ్ పట్టారు.

గతంలో ఈ రీజియన్ పరిధిలో 484 బస్సులు ప్రతిరోజు 2 లక్షల కి.మీ. నడవగా, రోజు వారీగా 1.5 లక్షల మంది ప్రయాణించేవారు. అందులో 40శాతం మంది మహిళలు ఉండగా, 60శాతం మంది పురుషులు ఉండేవారు. అయితే స్త్రీశక్తి పథకం ప్రారంభంతో ఆర్టీసీ అధికారులు ఉచిత ప్రయాణానికి 316 బస్సులు కేటాయించారు. వీటిలో శనివారం అత్యధికంగా 90శాతం మంది మహిళలు ఉచితంగా ప్రయాణించడం ఇదే తొలిసారి. ప్రత్యేకించి పెళ్శిళ్ల సీజన్, వరుస సెలవులు కావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లుగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.


లెక్కలేసుకుని ఊరట..

కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన బోరా దేవి ఫ్రీబస్సులో ప్రయాణించి పిఠాపురంలోకి బంధువుల ఇంటికి వెళ్లారు. గతంలో ఒక ప్రయాణం చేయాలంటే ఎంతో ఆలోచించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ బాధ తప్పిందని దేవి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రులు, ఇతర అవసరాల నిమిత్తం వెళ్లాలంటే ఒక్కొక్కరికి కనీసం నెలకు వేయి రూపాయల వరకూ వ్యయం అయ్యేదని, ఇప్పుడు అది మిగిలినట్టేనని సంతోషంగా తెలిపారు. పైడితల్లి అనే మహిళ నిత్యం కూరగాయలను విజయనగరానికి తెచ్చి విక్రయిస్తారు. ఆమెతో పాటు కూరగాయల లగేజీ టికెట్లు ఒక వైపు రూ.120 కాగా.. రెండు వైపులా రూ.240గా అవుతుండేది. రోజూ కూరగాయలు విక్రయించగా రూ.500 వరకూ ఆదాయం సమకూరేది. ఇందులో సగం డబ్బులు రవాణాకే అయిపోతాయి. కానీ, ఉచిత ప్రయాణ పథకంతో ఇప్పుడు తనకు నెలకు రూ.3,600 ఆదా అవుతుందని పైడితల్లి సంతోషం వ్యక్తం చేశారు.

టెస్ట్ చేద్దామని..

నూతన పద్మది బాపట్ల జిల్లా నరసయ్యపాలెం. వ్యవసాయ పనులు చేసుకుని జీవించే కుటుంబం ఆమెది. ఫ్రీబస్‌ను టెస్ట్ చేయాలని శనివారం ఉదయం ఆమె రోడ్డెక్కారు. రాజమండ్రిలో ఉండే చెల్లెలు దగ్గరకు బయలుదేరారు. ఉదయం ఎనిమిది గంటలకు నరసయ్యపాలెంలో పల్లెవెలుగు ఎక్కారు. బాపట్ల, గుంటూరు, విజయవాడల్లో బస్సులు మారి ఏలూరుకు వచ్చారు. అక్కడ రాజమండ్రి బస్సెక్కి చెల్లెలు ఇంటికి చేరుకున్నారు.

ఏపీఎస్ఆర్‌టీసీ అంటే...



ఏ - ఆడపడుచులు..
పీ - పైసా ఖర్చులేకుండా
ఎస్ -సంతోషంగా
ఆర్ - రాష్ట్రమంతటా
టీ - తిరిగేందుకు..
సీ - చంద్రబాబు కల్పించిన అద్భుతమైన అవకాశం

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టు ఇది.

విన్నపాలు వినవలె..

రూట్ల సంఖ్య పెంచాలి.
బస్సు వేళల్లో సమయపాలన పాటించాలి
ఫ్రీ బస్సులకు ప్రత్యేక రంగు ఉండాలి

అటెన్షన్..

ఘాట్ రూట్లలో మొదట నిరాకరించినా, తర్వాత ప్రభుత్వం అనుమతించింది.
డిజిటల్ కార్డులు చూపించినా అనుమతిస్తున్నారు

టికెట్ ఫ్రీ..

తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి రాజమండ్రి వచ్చిన ప్రయాణికుల్లో సగం కంటే ఎక్కువ మంది ఉచిత ప్రయాణం చేశారని ఒక కండక్టర్ తెలిపారు. ఓ పది మంది వద్ద ఏవిధమైన గుర్తింపుకార్డులు లేకపోవడం వల్ల టికెట్లు తీసుకున్నారని, వారికి ఉచిత ప్రయాణం గురించి అవగాహన కల్పించామని మరో కండక్టర్ తెలిపారు.

ఘాట్ రోడ్లలోనూ అనుమతి

▸▸ 'స్త్రీ శక్తి' సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం అమలును సీఎం చంద్రబాబు శనివారం సమీక్షించారు. ఫ్రీబస్సుకు మహిళల నుంచి ఎలాంటి స్పందన వస్తోందని ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆరా తీశారు. 'కండక్టర్ ఎక్కడికి వెళ్లాలి అని అడగ్గానే.. మాకు ఫ్రీ కదా.? అంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. టికెట్‌కు డబ్బులు ఇవ్వక్కర్లేదు.. ప్రభుత్వమే ఇస్తుంది.. మీరు గమ్యం చెప్పండి అని అడిగి జీరో ఫేర్ టికెట్ కండక్టర్ చేతిలో పెట్టగానే సంతోషం వ్యక్తం చేస్తున్నారు' అని ముఖ్యమంత్రికి వారు వివరించారు. ఘాట్ రోడ్లలో ఉచిత ప్రయాణాన్ని అనుమతించాలంటూ వస్తున్న వినతులపై స్పందించిన చంద్రబాబు... అక్కడా ఉచితం అమలు చేయండి అని అధికారులను ఆదేశించారు. 30గం.ల ఉచిత ప్రయాణంలో రూ.ఐదు కోట్ల విలువైన జీరో టికెట్లు జారీ చేశామని ఆర్టీసీ అధికారులు చెప్పడంతో సీఎం సంతోషం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి అమలులో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. సెలవురోజులు కావడంతో ఆదివారం వరకూ రద్దీ తక్కువగానే ఉంటుందని, సోమవారం నుంచి పెరిగే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ ఉన్నా అనుమతించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకం పట్ల మహిళలు హర్షంవ్యక్తం చేస్తుండటంపై ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్లకు సవాల్

(మొదటి పేజీ తరువాయి)




రికవరీ సొమ్ముతో బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ (ఫైల్), విజయనగరం పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు (ఫైల్)

ఎక్కువ లాభాల ఆశ చూపించి 'వీఐపీ66 బజాజ్ ఇన్వెస్ట్‌మెంట్, కే26జీరోడహ్ మార్కెట్ ఇన్‌సైట్స్' పేరుతో ఫేక్ యాప్ వదిలి మొదట రాయదుర్గానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహప్ప నుంచి 12 లక్షలు పెట్టుబడి పెట్టించారు. అతికొద్ది రోజుల్లోనే 5.50 లక్షల రూపాయలు లాభం వచ్చిందంటూ విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. ఇదే అవకాశంగా ఏప్రిల్ 15 నుంచి మే 14 వరకూ విడతల వారీగా నరసింహప్ప రూ.1.74 కోట్లు పెట్టుబడి పెట్టారు. లాభాలతో కలిపి రూ.3.12 కోట్ల వరకూ అకౌంట్లో చూపించింది. విత్‌డ్రా చేసుకోవడానికి ఆయన ప్రయత్నించగానే.. జీఎస్‌టీ, ఆదాయపు పన్ను 40 శాతం చెల్లించాలని సైబర్ నేరగాళ్లు అడిగారు. ఆదాయపు పన్ను తర్వాత కదా చెల్లించాల్సిందని బాధితుడు అడగ్గా.. ముందుగానే చెల్లించాలన్నారు. నరసింహప్ప వాదనకు దిగడంతో నంబర్ బ్లాక్ చేశారు. బాధితుడి గోడు విన్న అనంతపురం ఎస్పీ జగదీశ్ ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఒక డీఎస్పీ నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌కు వెళ్లారు. ఐదుగురు సైబర్ నేరగాళ్లను ఒక్కొక్కరినీ చాకచక్యంగా అదుపులోకి తీసుకుని అనంతపురం తీసుకువచ్చారు. 41.20 లక్షలు రికవరీ చూపించారు. మిగతా సొమ్ములోనూ వీలైనంత మేరకు రికవరీ చేస్తామని అనంతపురం ఎస్పీ చెప్పారు. సైబర్ నేరగాళ్లతో గుడివాడ బ్యాంకు ఉద్యోగి చేతులు కలిపి మోసానికి పాల్పడిన తీరు ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు.

> సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోకుండా ఉండాలంటే అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. ఒకవేళ మోసపోతే ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

నేరం కొత్త పుంతలు

ఒక వ్యక్తిని ఆపి దోచుకోవడం.. ఒక ఇంట్లో దొంగలు పడి నగదు, నగలు ఎత్తుకుపోవడం పాత పద్ధతి. మనిషి అలా ఉండగానే అతనికే తెలీకుండా అకౌంట్లో నుంచి సొమ్ము దోచుకోవడం ఇప్పుడు నయా దోపిడీ. ఇంతకుముందు చాలా వరకు పొట్టకూటి కోసం దొంగతనాలు చేసేవారు. కానీ ఇప్పుడు పక్కా వ్యూహంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హైటెక్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పద్ధతుల్లో దోచుకుంటున్నారు. ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు.. పోలీసులు కూడా కొత్త ఎత్తుగడలు వేస్తూ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సైబర్ నేరగాళ్ల ఆట కట్టిస్తున్నారు. బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే రికవరీకి ఎక్కువ అవకాశాలు ఉంటాయని పోలీసులు చెబుతున్నారు.



రంగంలోకి సైబర్ కమాండోలు

సైబర్ నేరాలు కట్టడి చేసేందుకు ఐజీ రవికృష్ణ నేతృత్వంలో ఏపీ పోలీసు శాఖ ప్రత్యేక సైబర్ వింగ్ ఏర్పాటు చేసింది. సైబర్ కమాండోలను రంగంలో దించే ప్రయత్నంలో ఉంది. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, ఆర్థిక మోసాలపై ఎవరు ఏ క్షణంలో ఫోన్ చేసినా 'సైబర్ కమాండో' సిద్ధంగా ఉంటారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా సైబర్ నేరగాళ్లు పోలీసుల్లా ఫోన్ చేస్తే.. ఆ సమయంలో ఏమి చేయాలో చెబుతారు. ఇప్పటికే విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అమలు చేశారు. ఈ సైబర్ కమాండోలను రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో పోలీసు శాఖ సిద్ధం చేయబోతోంది. కొత్తగా పోలీసు శాఖలోకి రాబోతున్న 6,100 మంది కానిస్టేబుళ్లలో ఇంజనీరింగ్ చదివిన వారిని ఎంపిక చేసుకుని సైబర్ కమాండోలుగా తీర్చిదిద్దనుంది. ఈ విషయంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలిసింది.

1930కి ఫిర్యాదు చేయండి

రుణాలు ఇస్తామని.. పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని.. డిజిటల్ అరెస్ట్ చేస్తామని.. ఇలా నిత్యం రకరకాలుగా మాయ చేసి సైబర్ నేరగాళ్లు కోట్లు కొల్లగొడుతున్నారు. బాధితులు వెంటనే గంటలోగా (గోల్డెన్ అవర్) ఫిర్యాదు చేస్తే 90 శాతం వరకూ రికవరీకి అవకాశాలున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇందుకోసం కేంద్రం ఆలిండియా టోల్ ఫ్రీ నంబర్ 1930 ఏర్పాటు చేసింది. బాధితులు ఈ నంబర్‌కు ఫోన్ చేసి తమతో మాట్లాడిన వ్యక్తుల (సైబర్ నేరగాళ్లు) ఫోన్ నంబర్, ఫోన్ పే లేదా బ్యాంకు ఖాతా నంబర్ (డబ్బులు పంపినది) వివరాలు తెలిపితే.. మోసగాళ్ల డబ్బులు డ్రా చేయకుండా ఫ్రీజ్ చేయవచ్చని చెబుతున్నారు.

వాట్సాప్ డీపీలో సీఎం ఫొటో..

వాట్సాప్ డీపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టి ప్రభుత్వ పథకాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు గేలం వేశారు. పథకాల సొమ్ముతో షాపింగ్ చేసుకోవచ్చంటూ అమాయక మహిళల్ని మోసం చేసి 66 లక్షల రూపాయలు దోచేశారు. 'జననీ సురక్ష యోజన' పేరుతో ఫోన్ పే ద్వారా డబ్బులు కాజేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఈ కేసును సవాల్‌గా తీసుకుని ముగ్గురు సీఐలతో బృందాలను ఏర్పాటు చేశారు. ఏపీలో తీగ లాగితే తెలంగాణ మీదుగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ దాటి ఢిల్లీలో తేలింది. దేశవ్యాప్తంగా 213 ఎఫ్ఐఆర్‌లు నమోదైన ఈ గ్యాంగ్ సుమారు 4 కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడినట్లు బాపట్ల పోలీసులు గుర్తించారు. ముగ్గురు కీలక నిందితులు రంజిత్ సింగ్, వెంకట నారాయణ, జితిన్ సాహిల్‌ను అరెస్టు చేసి లక్షలాది రూపాయల సొమ్మును రికవరీ చేశారు.

డిజిటల్ అరెస్ట్ అంటూ..

'మీ పేరుతో డ్రగ్స్ పార్శిల్ వచ్చింది. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ విజయనగరానికి చెందిన రిటైర్డ్ టీచర్ సుజాత కుమారిని భయపెట్టి సైబర్ నేరగాళ్లు ఆమె బ్యాంకు ఖాతా నుంచి 40 లక్షలు దోచుకున్నారు. విజయనగరం పోలీసులు శ్రీనగర్, పుణె వరకూ వెళ్లి నిందితుల్ని అరెస్టు చేశారు. అద్దె ఖాతాల ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్ల నుంచి 20 లక్షలకు పైగా రికవరీ చేసి బాధితురాలికి అప్పగించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ.. సొమ్ము కోల్పోయిన గంటలోపే బాధితురాలు 1930కు ఫిర్యాదు చేశారని తెలిపారు. గోల్డెన్ అవర్‌గా పిలిచే ఈ సమయంలో ఫిర్యాదు చేయడం వల్ల ఖాతాలు బ్లాక్ చేసి రికవరీ చేయగలిగామని వివరించారు. ఆలస్యమైతే నేరగాళ్లు గంటల వ్యవధిలోనే వేర్వేరు పేర్లతో ఉన్న ఖాతాల్లోకి లేదా ఈ వాలెట్లలోకి మళ్లించేస్తారని చెప్పారు.


క్యూలైన్‌లో భక్తులకు అన్నపానీయాలు అందిస్తున్న టీటీడీ సిబ్బంది

తిరుమల కిటకిట

▸▸ వరుస సెలవులతో పోటెత్తిన భక్తులు

▸▸ 3 కి.మీ. మేర వ్యాపించిన క్యూలైన్


శ్రీవారి ఆలయం ముందు భక్తజనం

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండ భక్తులతో కిక్కిరిసిపోయింది. వరుస సెలవుల నేపథ్యంలో శుక్రవారం వేకువజాము నుంచే భక్తుల సంఖ్య పెరిగింది. శనివారం రద్దీ మరింత ఎక్కువైంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని 9 షెడ్లు నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్, బాట గంగమ్మ, శ్రీవారి సేవా సదన్ సర్కిల్ మీదుగా ఆక్టోపస్ భవనం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర వ్యాపించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆక్టోపస్ భవనం దాటి కల్యాణవేదిక మీదుగా వరాహ స్వామి రోడ్డు వైపుగా లైన్ పెరిగింది. భక్తుల సంఖ్య అధికమైన నేపథ్యంలో సాయంత్రం 5 గంటల తర్వాత కల్యాణ వేదిక వద్ద క్యూలైన్ మూసివేశారు. దీంతో సాయంత్రం 6గంటలకు క్యూలైన్ సేవా సదన్ వరకు తగ్గింది. సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని అధికారులు ప్రకటించారు. చిన్నపిల్లలు, వృద్ధులు అధిక సమయం క్యూలో ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం క్యూ ప్రవేశ మార్గంలో భక్తుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఇక స్లాటెడ్ టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు దాదాపు 4 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. గదులు పొందేందుకు దాదాపు 6గంటలకు పైగానే నిరీక్షించాల్సి వస్తోంది. గదులు లభించని భక్తులు షెడ్లు, కార్యాలయాల ముందు, చెట్ల కింద, ఫుట్‌పాత్‌లపై సేదతీరుతూ కనిపించారు. మరో వైపు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగానే మారాయి. శ్రీవారి ఆలయం, మాడవీధులు, అఖిలాండం, లడ్డూ కేంద్రం, అన్నప్రసాద భవనం, లేపాక్షి, రాంభగీచా కూడళ్లు.. .ఇలా తిరుమల మొత్తం యాత్రికులతో కిటకిటలాడుతోంది.



దేశాన్ని జగన్ అవమానించారు

▸▸ కుట్ర రాజకీయాలు తప్ప దేశభక్తి లేని వ్యక్తి: ఎంపీ కలిశెట్టి

▸▸ ఫ్రస్టేషన్‌లో ఉంటే జాతీయ పండుగను మర్చిపోతారా: సోమిరెడ్డి

▸▸ జెండా ఎగురవేయని మాజీ సీఎంగా చరిత్రలో నిలిచిపోతారు: ధూళిపాళ్ల

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్రదినోత్సవ వేడుకల్లో పాల్గొనకపోవడం జగన్ అహంకారాన్ని తెలియజేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అప్పలనాయుడు మాట్లాడారు. 'జగన్‌కు కుట్ర రాజకీయాలు తప్ప దేశభక్తి, రాష్ట్రం పట్ల అభిమానం లేవు. మాజీ సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఉండి స్వాతంత్య్రదినోత్సవం నాడు జెండా ఆవిష్కరణ చేయకపోవడం ద్వారా దేశాన్ని అవమానించారు' అని ఎంపీ విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాటాడుతూ... 'లక్షల మంది ప్రాణాలర్పించి దేశానికి స్వాతంత్య్ర సాధించిన రోజు కూడా మీకు గుర్తు లేదా? ఒక పార్టీ అధ్యక్షుడివని, మాజీ సీఎంవి అనే విషయమైనా గుర్తుందా? పులివెందుల జెడ్పీటీసీ ఫలితంతో ఫ్రస్టేషన్‌లో ఉంటే మాత్రం జాతీయ పండుగను మర్చిపోతే ఎలా?' అంటూ ఎద్దేవా చేశారు. స్వాతంత్య్రదినోత్సవం రోజున జెండా ఎగురవేయని మాజీ సీఎంగా వైఎస్ జగన్ నిలిచిపోతారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. జెండా ఎగురవేయకపోవడం... దేశాన్ని, స్వాతంత్రం కోసం పోరాడిన వారిని, జాతీయ జెండాను అవమానించడమేనని మండిపడ్డారు.

జగన్ పంద్రాగస్టు వేడుకల్లో ఎందుకు పాల్గొనలేదు?: కొండపల్లి

విజయనగరం అగస్టు 16(ఆంధ్రజ్యోతి): 'ప్రతిఒక్కరూ ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఎగరవేసి దేశభక్తిని చాటుకుంటారు. కానీ ఐదేళ్లు సీఎం పదవిని అనుభవించి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న జగన్ మాత్రం వేడుకల్లో ఎందుకు పాల్గొనలేకపోయారో చెప్పాలి' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడారు. 'దేశంలో కోట్లామంది ప్రజలు పంద్రాగస్టును పండగ లా జరుపుకుంటారు. జగన్ మాత్రం ఎక్కడా ఉత్సావాల్లో పాల్గొన్నట్లు దాఖలాలు లేవు. దీన్ని ఏమంటారో వైసీపీ నేతలే చెప్పాలి. బహూశా మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు సర్వీసు, పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీకి డిపాజిట్లు గల్లంతు కావటం వల్ల ఆయన ఫ్రస్టేషన్‌లోకి వెళ్లినట్లు ఉంది. ఉత్తరాంధ్ర మీద అభిమానమున్న ఏకైక సీఎం చంద్రబాబే. అందుకే తోటపల్లి ప్రాజెక్టుకు సర్దార్ గౌతు లచ్చన్న నామకరణం చేశారు' అని అన్నారు.



కొలంబో చేరిన భారత నౌక ఐఎన్ఎస్ రాణా

స్లినెక్స్-25కు భారత్ నౌకలు

- శ్రీలంకకు ఐఎన్ఎస్ రాణా, జ్యోతి
- 14 నుంచి 18 వరకు విన్యాసాలు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో జరుగుతున్న శ్రీలంక, ఇండియా నేవల్ ఎక్సర్‌సైజ్(స్లినెక్స్-25)కు భారత్ నుంచి గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ రాణా, ఫ్లీట్ ట్యాంకర్ ఐఎన్ఎస్ జ్యోతి తరలివెళ్లాయి. శ్రీలంక నేవీ తరపున తీర ప్రాంత గస్తీ నౌకలు ఎస్ఎల్ఎన్ఎస్ గజబాహు, విజయబాహు పాల్గొంటున్నాయి. ఈ నెల 14న మొదలైన సంయుక్త విన్యాసాలు 18వ తేదీ వరకు జరుగుతాయని తూర్పు నౌకాదళం వెల్లడించింది.

ఖరీఫ్ సాగు పుంజుకుంది

- వరుస అల్పపీడనాలతో దంచుతున్న వానలు
- 24 నుంచి 8.6 శాతానికి తగ్గిన వాన లోటు
- సీమలో మెరుగైన వర్షపాతం
- కోస్తాలో జోరుగా వరి నాట్లు

ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు వివరాలు (లక్షల ఎకరాల్లో)

పంట	సాధారణం	సాగు
వరి	37.17	23.65
పత్తి	13.20	8.80
వేరుశనగ	12.42	3.67
చిరుధాన్యాలు	4.97	4.15
అపరాలు	7.67	4.47

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలతో రాష్ట్రంలో జోరుగా వర్షాలు పడుతున్నాయి. భారీ వర్షాలతో కోస్తాంధ్రలో వాన లోటు తీరిం ది. రాయలసీమలోనూ వర్షపాతం మెరుగైంది. ఖరీఫ్ సాగు ఊపందుకుంది. గతనెలాఖరు వరకు 24 శాతం ఉన్న వాన లోటు ఇప్పుడు 8.6 శాతానికి తగ్గింది. జూన్1 నుం చి ఈ నెల 16 వరకు 316.4 మిల్లీమీటర్ల వాన పడాల్సి ఉండగా, 346.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో గుంటూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువగా, నం ద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సాధారణ స్థాయిలో, శ్రీకాకుళం, విశాఖ, కోనసీమ, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యింది. అయితే వాతావరణ శాఖ ప్రకటించినవిధంగా ఈ నెల 18న ఏర్పడే అల్పపీడనంతో భారీ వర్షాలు కురిస్తే.. అన్ని జిల్లాల్లో వాన లోటు పూర్తిగా తీరిపోతుంది. కాగా ఈ ఏడాది ముందే వచ్చిన నైరుతి రుతుపవనాలు నెల రోజులపైగా మందగించి అన్ని ప్రాంతాల్లో సరైన వర్షాలు పడలేదు. కానీ గత నెలాఖరు, ఈ వారం భారీ వర్షాలు కురవడంతో మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు ఊపందుకుం ది. ప్రస్తుతం పత్తి, అపరాలు, వేరుశనగ సాగు పుంజుకుంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి, తుంగభద్ర, వంశధార నదులకు వరదలు రావడం, ప్రభుత్వం కాలువల మరమ్మతులు కూడా చేపట్టడంతో చివరి భూములకూ నదీ జలాలు పారుతున్నాయి. దీంతో డెల్టా ప్రాంతాల్లోని మాగాణి భూముల్లో రైతులు వరి సాగు చేపట్టారు. చాలాచోట్ల వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.


లంక గ్రామాలు బిక్కుబిక్కు

- కొల్లేరులో గంటగంటకూ పెరుగుతున్న వరద
- ముంపునకు గురైన పెనుమాకలంక రహదారి
- గోదావరిలో పెరిగిన నీటిమట్టం

కైకలూరు, పోలవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి కాలువలు, డ్రెయిన్ల ద్వారా వరద నీరు కొల్లేరులోకి భారీగా చేరుతుండటంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఏలూరు జిల్లా మండవల్లి, కైకలూరు మండలాల్లో కొల్లేరు సరస్సు నీటిమట్టం గంటగంటకు పెరుగుతోంది. మరింత పెరిగితే గ్రామాలు సైతం ముంపుబారిన పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండవల్లి మండలం పెద్దయడ్లగాడి నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారి ముంపుబారిన పడింది. ఇంగిలిపాకలంక, పెనుమాకలంక, నందిగామలంక గ్రామస్థులు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఆదివారం రాకపోకలు నిలిచిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెద్దయడ్లగాడి, చిన్నయడ్లగాడి వంతెనల వద్ద దట్టంగా గుర్రపుడెక్క, తూడు, కిక్కిసకర్ర అలుముకోవడంతో ఈ గ్రామాలకు మరింత ముంపు పొంచి ఉంది. కైకలూరు మండలంలో అటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరులోకి ఉధృతంగా వరద నీరు చేరుతోంది. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి వెళ్లేందుకు పోల్‌రాజ్ డ్రెయిన్‌పై ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామస్థులు నాటు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. సర్కారు కాలువ వద్ద కూడా కొల్లేరులో వరద నీరు పెరుగుతోంది.



ఏలూరు జిల్లాలో కొల్లేరు ఉధృతికి నీట మునిగిన పెదయడ్లగాడి-పెనుమాకలంక రహదారి



పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ఉధృతి

సంద్రంలోకి 4 లక్షల క్యూసెక్కుల జలాలు

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. శనివారం భద్రాచలం వద్ద నీటిమట్టం 29.40 అడుగులకు చేరింది. ఉపనదులతో పాటు కొండవాగుల నుంచి వస్తున్న జలాలతో గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 4,03,425 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు.

జగన్ సర్కారు పుణ్యమే!

కాఫర్ డ్యాం ఎత్తులో నాణ్యతా లోపాలు

స్థూపాకారంలో పెంచిన వైనం

అప్పట్లోనే కుంగిన గైడ్‌బండ్

మాజీ సీఎం జగన్ హయాంలో ఎగువ కాఫ ర్ డ్యామ్ ఎత్తును 41.5 మీటర్ల నుంచి 44 మీటర్లకు పెంచారు. నాణ్యతా లోపాలతో, సాంకేతిక ప్రమాణాలు పాటించకుండా రాళ్లు, మట్టి పోసే సి ఎత్తు పెంచిన అప్పటి ఇంజనీరింగ్ అధికారులు గొప్ప ఘన కార్యం చేసినట్లు ప్రకటించుకున్నారు. అయితే పిరమిడ్ తరహాలో కాకుండా స్థూపాకారంలో డ్యామ్ ఎత్తును పెంచడంతో దిగువన బలం చాలక 15 మీటర్ల మేర కుంగిం ది. దీంతో ప్రస్తుతం ప్రధాన ప్రాజెక్టు నిర్మాణం కోసం మెటీరియల్‌తో ఎగువ కాఫర్ డ్యామ్ పై నుంచి తిరుగుతున్న వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో బట్రస్ డ్యామ్ వైపునుంచి వాహనాల రాకపోక లు సాగేలా ఏర్పాట్లు చేశారు. ఈలోగా ఎగువ కాఫర్ డ్యామ్‌లో కుంగిన భాగాన్ని భారీ రాళ్లు, మట్టితో యుద్ధప్రాతిపదికన పూడ్చి రాకపోకల ను పునరుద్ధరించారు. జగన్ సర్కారు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, సాంకేతిక లో పాలను పట్టించుకోకపోవడం ఈ ఘటనతో బయటపడ్డాయని పోలవరం ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. 2020లో గోదావరికి వచ్చిన భారీ వరదకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతినడంతో పాటు స్పిల్ చానల్ వైపు అడ్డుకట్టగా నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. దీన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. 2019 తర్వాత పోలవరం ప్రాజెక్టులో జరిగిన నిర్మాణాల్లో లోపాలున్నట్లు గుర్తించింది. ప్రాజెక్టుకు జరిగిన నష్టంపై అధ్యయనం కోసం అంతర్జాతీయ నిపుణుల కమిటీని కేంద్ర జల సంఘం నియమించింది. ఈ కమిటీ 28న రానుంది.

స్వల్పంగా కుంగిన ఎగువ కాఫర్ డ్యామ్

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

పోలవరం/అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన ఎగువ కాఫర్ డ్యామ్ ఎడమవైపు ఎగువన కొద్దిగా కుంగింది. అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి పునరుద్ధరించారు. శుక్రవారం ఉదయం సమస్యను గమనించిన అధికారులు శనివారం నాటికి పూర్తి చేశారు. 2022 ఆగస్టు నాటి వరదలకు ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎడమవైపు ఎగువ ప్రదేశంలో నీటిమట్టం ఎక్కువగా పెరిగే అవకాశాలున్నాయని భావించిన అధికారులు ఎగువ కాఫర్ డ్యామ్ వెడల్పు 9 మీటర్లు, ఎత్తు మరో 2 మీటర్లు పెంచి పటిష్ఠం చేశారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో కొంతమేర కుంగింది. కుంగిన భాగాన్ని పునరుద్ధరించామని, బట్రస్ డ్యామ్ ఉండడం వల్ల ఎలాంటి సమస్యా ఉండదని ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలిపారు.

ప్రాధాన్యం ఏంటంటే...

ప్రాజెక్టు నిర్మాణంలో ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్) నిర్మాణం కోసం గోదావరి సహజ మార్గాన్ని వెనక్కి మళ్లించారు. అప్రోచ్ చానల్ ద్వారా స్పిల్ వేలోకి, అటు నుంచి స్పిల్ చానల్‌లోకి మళ్లించడానికి 2,364.60 మీటర్ల పొడవునా 42.50 మీటర్ల ఎత్తున ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మించారు. దిగువన గోదావరి సహజ మార్గం నుంచి జలాలు డ్యామ్‌లోకి రాకుండా 16.13 మీటర్ల పొడవునా 30.50 మీటర్ల ఎత్తున దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించారు. గోదావరికి ఎలాంటి వరదలు వచ్చినా ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులకు అడ్డంకులు లేకుండా నిర్మాణం చేశారు. అయితే గత ప్రభుత్వం నిర్మాణంలో జాప్యం చేయడంతో కాఫర్ డ్యామ్‌ల కాలపరిమితి మించిపోవడం వల్ల సీపేజ్ సమస్య మొదలైంది. దీంతో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనుల్లో జాప్యం జరుగుతూ వస్తోంది. డీవాటరింగ్ ద్వారా నిరంతరాయంగా నీటిని తొలగిస్తూ, ఎగువ కాఫర్ డ్యామ్ పొడవునా బట్రస్ డ్యామ్ నిర్మించి సీపేజ్ సమస్యను అధిగమించి పనులు వేగంగా చేస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కుంగిన ఎగువ కాఫర్ డ్యామ్

చకాచకా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. వరద పరిస్థితుల్లో సైతం డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనుల్లో 373 ప్యానెళ్లకు గాను ఇప్పటికే 142 పూర్తయ్యాయి. 41 శాతం డయాఫ్రమ్ వాల్ పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది మార్చి 20, 26 తేదీలలోపు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

రేపు మరో అల్పపీడనం

24న ఇంకో అల్పపీడనం

- కోస్తా, సీమకు మళ్లీ భారీ నుంచి అతిభారీ వర్షాలు
- ఉత్తరకోస్తా రేవుల్లో మూడో నంబరు హెచ్చరిక
- మత్స్యకారులు సంద్రంలో వేటకు వెళ్లొద్దని సూచన

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రుతుపవన ద్రోణి తూర్పు భాగం దక్షిణాది వైపు కొనసాగుతోంది. శనివారం నాటికి ఇది దక్షిణ ఛత్తీస్‌గఢ్, విశాఖపట్నం మీదుగా బంగాళాఖాతం వరకూ విస్తరించింది. దీనికి తోడు ఛత్తీస్‌గఢ్‌పై అల్పపీడనం ఉంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు ఉత్తర కోస్తాపైకి వీస్తుండడంతో శనివారం ఉదయం నుంచి అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చిరుజల్లుల నుంచి ఒక మోస్తరుగా వర్షాలు కురిశాయి. కాగా, రుతుపవన ద్రోణి ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖపట్నంలోని తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. సోమవారం పశ్చిమ బెంగాల్, ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని తెలిపింది. ద్రోణి, అల్పపీడనం ప్రభావాలతో సోమవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అనకాపల్లి, కాకినాడ, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అతిభారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 19న అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అతిభారీ, కోస్తాలో శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు ఉన్న జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. కాగా, ఈనెల 24న వాయవ్య బంగాళాఖాతంలో ఇంకో అల్పపీడనం ఏర్పడనుందని అధికారులు తెలిపారు.

ముగ్గురా.. ఐదుగురా!

- పోలవరం-బనకచర్ల కమిటీ సభ్యులపై రాష్ట్ర జలవనరుల శాఖ తర్జనభర్జన
- పేర్లు ప్రతిపాదించాలంటూ కేంద్రం లేఖ
- సీఎంతో చర్చించాక ఖరారుకు నిర్ణయం

అమరావతి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై తెలంగాణ నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు కేంద్ర జలశక్తి మం త్రిత్వశాఖ నియమించే కమిటీకి ఎంతమంది సభ్యులను ప్రతిపాదించాలనే దానిపై రాష్ట్ర జలవనరుల శాఖ తర్జనభర్జన పడుతోంది. ముగ్గురు సభ్యులతో సరిపుచ్చాలా.. లేదంటే ఐదుగురి పేర్లను పంపాలా అనే సంశయంలో పడింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ ఏడాది జూలై 16న సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో పోలవరం-బనకచర్లకు గోదావరి వరద జలాలను వాడుకోవడంపై చర్చ జరిగింది. ఈ చర్చల్లో 2 రాష్ట్రాలూ తమ వాదనలకు కట్టుబడి ఉండటంతో.. కేంద్రం, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన కమిటీని వేయాలని పాటిల్ నిర్ణయించారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధా న కార్యదర్శి జి.సాయిప్రసాద్, జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి పేర్లను కేంద్రానికి ప్రతిపాదించాలని నిర్ణయించారు. కమిటీకి సభ్యుల పేర్లతో ప్రతిపాదనలు పంపాలంటూ ఈనెల 12న రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్ అగర్వాల్ లేఖ రాశారు. ఈ లేఖపై శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. ముందుగా అనుకున్నట్లు ముగ్గురి పేర్లను కేంద్రానికి పంపాలా లేదంటే.. ఐదుగురి పేర్లను ప్రతిపాదించాలా అనే సంశయం తలెత్తింది. దీంతో ముఖ్యమంత్రితో సోమవారం చర్చించాలని నిర్ణయించారు.

పోలవరం-కూలవరం

అనే దమ్ముందా..?

- బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారు?: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): "పోలవరంలో కాఫర్ డ్యామ్(ప్రాజెక్టు నిర్మాణం కోసం మట్టితో ఏర్పాటు చేసిన తాత్కాలిక కట్టడం) రెండోసారి కొట్టుకుపోయినా జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ)కు కానరావడం లేదా? కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే కూలేశ్వరం అని కారుకూతలు కూసిన కాం గ్రెస్, బీజేపీ నేతలకు పోలవరంను కూలవరం అనే ద మ్ము, ధైర్యం ఉందా?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా...? అంటూ శనివారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ అత్యంత అనుమానాస్పదంగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లపై కేవలం 24 గంటల్లోపే ఎన్‌డీఎస్ఏను దించి.. బీఆర్ఎస్‌పై బురదజల్లిన బీజేపీ నేతలు.. కళ్లముందు రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. 2020లో పోలవరం డయాఫ్రమ్ వాల్ రెండేళ్లకు కొట్టుకుపోయినా ఇప్పటికీ ఉలుకు పలుకు లేదన్నారు.

ఇలాగైతే బార్ పాలసీ కష్టమే

- ప్రతి బార్‌కు 4 దరఖాస్తులు తప్పనిసరి
- ఒక్కోదానికి రూ.5 లక్షలు రుసుము
- పాలసీపై జిల్లాల్లో వ్యాపారుల సమావేశాలు
- దరఖాస్తులు చేయకూడదని ప్రాథమిక నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం కొత్తగా తీసుకురాబోతున్న బార్ పాలసీ సజావుగా సాగుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త పాలసీపై రాష్ట్రవ్యాప్తంగా మద్యం వ్యాపారుల్లో వ్యతిరేకత పెరుగుతోంది. ప్రభుత్వం పెడుతున్న నిబంధనలతో వ్యాపారం చేయలేమనే నిర్ణయానికి వస్తున్నారు. అసలు బార్ కోసం దరఖాస్తులే చేయకూడదని వ్యాపారులు ప్రాథమికంగా నిర్ణయించారు. గత నాలుగు రోజుల్లో మూడు జిల్లాలు మినహా అన్ని ఉమ్మడి జిల్లాల్లో వ్యాపారులు సమావేశాలు నిర్వహించారు. ఎవరైనా కొత్తవారు వస్తే సరే గానీ, తమలో ఎవరూ దరఖాస్తు చేయకూడదని వారు నిర్ణయించారు. ప్రధానంగా ప్రతి బార్‌కు 4 దరఖాస్తులు తప్పనిసరి అనే నిబంధన, ఇష్యూ ప్రైస్‌పై 15 శాతం అదనంగా అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్(ఏఆర్ఈటీ) వసూలు అంశాలపై వ్యాపారుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొత్త బార్ పాలసీలో ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు తప్పనిసరిగా రావాలనే నిబంధన పెట్టింది. అంటే.. ఏదైనా బార్‌కు నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే దానికి లాటరీ తీయకుండా ఆపేస్తారు. దీంతో బార్ లైసెన్స్ కావాలనుకునే వారు కచ్చితంగా 4 దరఖాస్తులు సమర్పించాలి. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షలు రుసుము. అయితే లైసెన్స్ వచ్చినా, రాకపోయినా దరఖాస్తు రుసుము తిరిగి ఇవ్వరు. దీంతో లైసెన్స్ కావాలనుకునేవారు వేర్వేరు పేర్లతో రూ.20 లక్షలు వెచ్చించి దరఖాస్తులు సమర్పించాలి. మరోవైపు గత ప్రభుత్వం బార్లకు ఇచ్చే మద్యంపై అదనంగా విధించిన ఏఆర్ఈటీని ఈ ప్రభుత్వం కొనసాగిస్తోంది. సాధారణంగా మద్యం షాపులకు ఇష్యూ ప్రైస్‌పై మద్యం సరఫరా చేస్తారు. అంటే ఎమ్మార్పీలో లైసెన్సీకి ఇచ్చే మార్జిన్ మినహాయించుకుని మద్యం ఇస్తారు. ఉదాహరణకు ఒక సీసా ఎమ్మార్పీ రూ.100 అయితే, షాపులకు రూ.86కే సరఫరా చేస్తారు. రూ.14 షాపులకు దక్కుతుంది. కానీ గత వైసీపీ ప్రభుత్వం బార్లకు ఇచ్చే మద్యానికి ఇష్యూ ప్రైస్‌పై అదనంగా ఏఆర్ఈటీని విధించింది. అప్పట్లో రాజకీయ కారణాల నేపథ్యంలో విధించిన ఈ ఏఆర్ఈటీని ఈ ప్రభుత్వం కూడా తొలగించలేదు. ఈ ప్రభుత్వంలో పన్నులు సవరించినప్పుడు 15శాతం అదనంగా ఏఆర్ఈటీ చెల్లించాలనే నిబంధన పెట్టారు. దానివల్ల ఏడాదికి సగటున రూ.40లక్షలు అదనంగా చెల్లిస్తున్నామని లైసెన్సీలు అంటున్నారు. దానిని తొలగించాలని కోరారు. ఏఆర్ఈటీని తొలగిస్తే ఏడాదికి రూ.240 కోట్ల ఆదాయం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ నిర్ణయాలతో పాటు మరోవైపు లైసెన్స్ ఫీజులను భారీగా పెంచింది. 2022లో ఇచ్చిన పాలసీలో గరిష్ఠ ఫీజు రూ.50 లక్షలు కాగా, ఇప్పుడు రూ.75 లక్షలు చేశారు. అప్పట్లో వేలం పద్ధతిలో నిర్వహించగా, ఇప్పుడు లాటరీ ద్వారా కేటాయించనున్నారు. అప్పట్లో వేలం నిర్వహించినా పది శాతం బార్లకు మినహా ఎవరూ కనీస ధరను దాటి పాడలేదు. ఇప్పుడు ప్రభుత్వం ఒకేసారి రూ.25 లక్షలు పెంచడంతో అది భారం అవుతుందని వ్యాపారులు అంటున్నారు. ఇంత ప్రతికూల వాతావరణంలో బార్ లైసెన్స్ తీసుకోవడం అనవసరమని వ్యాపారులు భావిస్తున్నారు. తాజాగా మద్యం షాపుల్లో పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతివ్వడం కూడా బార్‌లపై ప్రతికూల ప్రభావం చూపనుంది. మరోవైపు బార్ లైసెన్స్ తీసుకున్నా ప్రతి మూడేళ్లకోసారి కొత్తగా లైసెన్స్ సాధించుకోవాలి. వాస్తవానికి 2022కు ముందు దాదాపు పాతికేళ్లుగా బార్‌ల లైసెన్స్‌లు రెన్యువల్ మాత్రమే చేస్తూ వస్తున్నారు.



తుంగభద్ర డ్యాం గేట్లను పరిశీలిస్తున్న బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి

తుంగభద్ర డ్యాంకు ప్రమాదం లేదు

- ఖరీఫ్‌కు నీటికి ఢోకాలేదు.. వర్షాలు పడితేనే రబీకి..
- బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్

బళ్లారి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు ఎలాంటి ప్రమాదమూ లేదని బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు. డ్యాంకు అమర్చిన 4, 6, 11, 18, 20, 24, 27 నంబర్ల క్రస్ట్ గేట్లు దెబ్బతిన్నాయని డ్యాం సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డితో కలిసి ఆయన శనివారం డ్యాంను పరిశీలించారు. సీడబ్ల్యూసీ, టీబీపీ బోర్డు, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల సూచనల ప్రకారం డ్యాంలో 80 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నామని తెలిపారు. వరద పెరిగితే క్రస్ట్ గేట్లు తెరిచి 1.5 లక్షల క్యూసెక్కుల నీటిని నదికి వదిలే అవకాశం ఉందని చెప్పారు. ఖరీఫ్‌లో పంట సాగుకు, తాగునీటికి ఎటువంటి ఇబ్బందీ ఉండదన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఖరీఫ్‌కు మాత్రమే సాగు నీరిస్తామని, రబీకి నీరు ఉండదని స్పష్టం చేశారు. వర్షాలు కొనసాగి, డ్యాంలో నీరు నిల్వ ఉంటే రబీకి కూడా ఇస్తామని ఆయన తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ పరిధిలో వివిధ కాలువల కింద 17 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగయ్యాయని పేర్కొన్నారు.

ధర్మవరం వాసికి 'ఉగ్ర' లింకులు!

- ఐబీ, ఎన్ఐఏ సమాచారంతో పోలీసులు అప్రమత్తం
- నూర్ మహమ్మద్‌పై నిఘా.. ఉపా చట్టం కింద కేసు.. అరెస్ట్

ధర్మవరం/కదిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న కారణంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్ (45) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేశామని ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ నర్సింగప్ప శనివారం తెలిపారు. పట్టణంలోని లోనికోటలో కొత్వాల్ నూర్ మహమ్మద్ కుటుంబం నివసిస్తోంది. మార్కెట్ వీధిలోని బిరియానీ సెంటర్‌లో వంటమనిషిగా పని చేస్తున్నాడు. ఇతనికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు కొన్నాళ్ల కిందటే ఐబీ, ఎన్ఐఏ గుర్తించి, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిఘా పెట్టారు. ఆధారాలు సేకరించి, 4 రోజుల కిందట అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాద సంస్థల వాట్సాప్ గ్రూప్‌లలో నూర్ మహమ్మద్ యాక్టివ్‌గా ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ తెలిపారు. అతని ఇంట్లో సోదా చేసి మొబైల్ ఫోన్, రెండు సిమ్ కార్డులు, ఉర్దూ సాహిత్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడు పలు నిషేధిత ఉగ్రవాద సంస్థల వాట్సాప్ గ్రూపుల్లో ఉంటూ, ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు.



కొత్వాల్ నూర్ మహమ్మద్(ఫైల్)

పాతికేళ్లుగా ఇక్కడే..!

నూర్ మహమ్మద్ పాతికేళ్లుగా ధర్మవరంలోని వివిధ హోటళ్లలో వంట మనిషిగా పని చేశాడు. ప్రస్తుతం సల్మాన్ బిరియానీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పదో తరగతి వరకూ ఉర్దూ మీడియంలో చదివాడు. చదువు మానేశాక.. ధర్మవరం తిరిగి వచ్చాడు. టీ స్టాల్ ప్రారంభించి, సాగడం లేదని మూసేశాడు.

కడప జైలుకు తరలింపు

అరెస్టు చేసిన నూర్ మహమ్మద్‌ను ధర్మవరం పోలీసులు శనివారం రాత్రి కదిరి న్యాయాధికారి పి.లోక్‌నాథ్ ఎదుట హాజరుపరిచారు. తొలుత ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో అతడికి వైద్య పరీక్షలు చేయించారు. అతనిపై క్రైమ్ నంబర్ 170/2025 కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్లు 152, 196, క్లాస్1, 196(2), ఉపా చట్టంలోని 13,38,39 సెక్షన్ల కింద నమోదు చేశారు. న్యాయాధికారి నిందితుడికి ఈ నెల 29వరకు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతడిని భారీ బందోబస్తు మధ్య కడప సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు.

మరో యువకుడూ?

ధర్మవరంలోని ఎర్రగుంటకు చెందిన ఆటో డ్రైవర్ రియాజ్ శుక్రవారం రాత్రి 'ఐ లవ్ పాకిస్థాన్' అని వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇతరులు పెట్టిన పోస్టును తాను షేర్ చేశానని విచారణలో రియాజ్ చెప్పాడు. దీంతో పోలీసులు మందలించి విడిచిపెట్టారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.